ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
ప్రకాశం
జిల్లా వార్తలు
బుధవారం 16, ఏప్రిల్ 2025



వైభవంగా చక్రస్నానం

రాచర్ల మండలంలోని శ్రీనెమలిగుండ్ల రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. చివరి రోజైన మంగళవారం స్వామి వారికి చక్రస్నానాన్ని వైభవంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను తిరిగి జేపీ చెరువు గ్రామానికి తీసుకు వచ్చి విద్యుత్ దీపాలంకరణల మధ్య కనులపండువగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

7

- 50శాతం అదనంగా వసూలు చేస్తున్న కన్సిడరేషన్ అమౌంట్ రద్దు
- రెన్యువల్స్ ప్రీమియం సగానికి తగ్గింపు
- నూతన లీజుల కాలపరిమితి పెంపు, ఆక్షన్ విధానానికి స్వస్తి
- పాతకేసుల పరిష్కారానికి ఓటీఎస్.. జరిమానాలు భారీగా తగ్గింపు
- కాంట్రాక్ట్ ఏజెన్సీ ద్వారా రాయల్టీ వసూలు
- నూతన పాలసీకి కేబినెట్ ఆమోదం
- హర్షం వ్యక్తంచేసిన పరిశ్రమ వర్గాలు

ఎన్నికల నాటి హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంది. గడ్డుపరిస్థితిని ఎదుర్కొంటున్న గ్రానైట్ పరిశ్రమను గాడిన పడేలా చేసేందుకు నూతన మైనింగ్ పాలసీని రూపొందించింది. మంగళవారం దానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. గత ప్రభుత్వం అనుసరించిన అస్తవ్యస్త విధానాలతో పరిశ్రమ పూర్తిస్థాయిలో దెబ్బతింది. ఈ పరిస్థితులను సరిదిద్ది పరిశ్రమకు ఊతం ఇచ్చేలా నిర్ణయాలు తీసుకోవాలని పాదయాత్ర సమయంలో లోకేష్‌కు గ్రానైట్ అసోసియేషన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. కచ్చితంగా పరిశ్రమను కాపాడతామని ఆయన హామీ ఇచ్చారు. దాని కోసం వేయికళ్లతో ఎదురుచూస్తున్న పరిశ్రమ వర్గాలు నూతన పాలసీతో ఊపిరిపీల్చుకున్నాయి. ప్రభుత్వ నిర్ణయంపై హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నాయి.

పాలసీతో ప్రాణం

నూతన మైనింగ్ విధానంతో గ్రానైట్ పరిశ్రమకు పునరుజ్జీవం



గ్రానైట్ పరిశ్రమకు మేలు



నూతనంగా తెచ్చిన మైనింగ్ పాలసీ గ్రానైట్ పరిశ్రమకు ఎంతో మేలు చేకూర్చే విధంగా ఉంది. ప్రభుత్వంపై పారిశ్రామిక వేత్తలకు నమ్మకాన్ని పెంచింది. మేము అడిగిన విన్నపాలన్నింటినీ పరిగణనలోకి తీసుకోవడం సంతోషంగా ఉంది. సీఎం, డిప్యూటీ సీఎం, లోకేష్, మంత్రులకు అసోసియేషన్ తరఫున ధన్యవాదాలు.

- చలువాది బదరీనారాయణ, గెలాక్సీ గ్రానైట్ ఓనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు

పరిశ్రమకు ఊతమిచ్చేలా పాలసీ

కుదేలైన గ్రానైట్ పరిశ్రమకు ఊతమిచ్చేలా మైనింగ్ పాలసీని రూపొందించిన ప్రభుత్వానికి ఓనర్ల అసోసియేషన్ ద్వారా ధన్యవాదాలు తెలుపుతున్నాం. పరిశ్రమ పునరుజ్జీవం దిశగా పాలసీలో పలు నిర్ణయాలు ఉండటం సంతోషకరం.

-అజీమ్, గెలాక్సీ గ్రానైట్ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి

చీమకుర్తి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఆమోదించిన నూతన పాలసీతో కష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న గ్రానైట్ పరిశ్రమకు ప్రాణం పోసినట్లైంది. అందులో ఊరటనిచ్చే అంశాలే ఎక్కువగా ఉన్నాయి. అదేవిధంగా కాసిన్ని చేదు గుళికలు సైతం చోటుచేసుకున్నాయి. మొత్తం మీద గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన విధానం వలన అనేక పరిశ్రమలు మూతపడగా, ప్రస్తుత సర్కారు నూతన పాలసీ ఊరటనిచ్చింది. ఉద్యోగ అవకాశాలను పెంపొందించడమే కాక ప్రభుత్వంపై నమ్మకం పెంపొందించేలా, ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమకూరే విధంగా ఉంది.

మైనింగ్ పాలసీలో ప్రధానాంశాలు ఇవీ..

2021లో కొవిడ్ అనంతరం గ్రానైట్ ఖనిజంపై అప్పటికే పెంచిన రాయల్టీకి అదనంగా 50శాతం కన్సిడరేషన్ అమౌంట్‌ను వసూలు చేయాలని అప్పటి వైసీపీ ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో కొవిడ్ వలన కుప్పకూలిపోయిన పరిశ్రమకు మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లు అయింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం దాన్ని పూర్తిగా రద్దుచేసింది.


కొండలా పేరుకుపోయిన డంపింగ్‌రాళ్లు

1 సీనరేజీ ఫీజును సవరిస్తూ భారం లేకుండా రూపొందించారు. టన్నేజీ ఆధారిత ఒకే విధమైన సీనరేజీ ఫీజు ప్రవేశపెట్టారు. ఇటీవల కాలంలో చైనాకు ఎగుమతులు చేసే గెలాక్సీ బ్లాకులను టన్నేజీ ఆధారంగా కొనుగోలుకు బయ్యర్లు సుముఖత వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకూ క్యూబిక్ మీటర్లలో జరుగుతుండటం ఎగుమతులకు ఇబ్బందిగా మారింది. ఇప్పుడు టన్నేజీ విధానం వలన ఎగుమతుల ప్రక్రియ సులభతరం అవుతుంది.

1 గత వైసీపీ ప్రభుత్వం మైనింగ్ లీజుల మంజూరు ప్రక్రియను మార్చివేసింది. అప్పటివరకు అమలులో ఉన్న ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ విధానాన్ని రద్దుచేసి వేలం ద్వారా లీజుల మంజూరును 2022లో ప్రవేశపెట్టింది. తమకు అనుకూలంగా ఉన్న వారికి లీజులు మంజూరు చేసే దొడ్డిదారి ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. దీని వలన 6వేలకుపైగా దరఖాస్తులు అర్హత

మిగతా 6వ పేజీలో



శేష వాహనంపై చెన్నయ్య వైభవం

మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. నాలుగోరోజైన మంగళవారం స్వామివారు శేషవాహనంపై కాళీయ మర్దన అలంకారంలో దర్శనమిచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు తిలకించి తన్మయత్వం చెందారు.


7

లక్ష్యాల మేరకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలి

కలెక్టర్ తమీమ్‌అన్సారియా ఆదేశం

జిల్లాకు 1,305 యూనిట్లు మంజూరైనట్లు వెల్లడి

వివరాలు 7వ పేజీలో



నివేశన స్థల పట్టాపై ఉన్న తహసీల్దార్ ఫోర్జరీ సంతకం

దుగ్గెం భాస్కర్ పేరున సృష్టించిన నివేశన స్థల పట్టా

ఫోర్జరీతో హాంఫట్!

- దొంగ సంతకాలతో ప్రైవేటు స్థలానికి ఇంటి పట్టాలు
- రూ.కోటి విలువైన భూమిని కాజేసేందుకు యత్నం
- యజమాని ఫిర్యాదుతో అప్రమత్తమైన రెవెన్యూ
- పోలీసులకు ఫిర్యాదు చేసిన పెద్దారవీడు తహసీల్దార్

మార్కాపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం ప్రాంతంలో భూమాఫియా కొత్త పుంతలు తొక్కుతోంది. ఇప్పటివరకూ ప్రభుత్వ, అసైన్డ్ భూములు, వాగులు, వంకల ఆక్రమణలను తెగబడిన అక్రమార్కులు.. ఇప్పుడు రిజిస్టర్డ్ పట్టా భూములను కూడా వదలడం లేదు. చివరికి తహసీల్దార్, వీఆర్వోల సంతకాలను సైతం ఫోర్జరీ చేసి పట్టా భూములకు నివేశన స్థల ధ్రువీకరణ పత్రాలు సృష్టించారు. వాటిని పల్నాడు జిల్లా వినుకొండలో రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నారు. ఈ విషయం బయటకు పొక్కి రెవెన్యూ అధికారుల దృష్టికి వెళ్లడంతో అవాక్కయ్యారు. వాస్తవానికి ప్రభుత్వం మంజూరు చేసిన నివేశన స్థల ధ్రువీకరణ పత్రాలకు కూడా రిజిస్ట్రేషన్ చేయడానికి వీల్లేదు. అయినా కాసుల కక్కుర్తితో అధికారులు రిజిస్ట్రేషన్ చేశారు. ఈ అక్రమ తంతు డివిజన్‌లోని పెద్దారవీడు మండలం దేవరాజుగట్టులో చోటుచేసుకుంది. పట్టా భూముల యజమానుల ఫిర్యాదుతో ప్రస్తుతం రెవెన్యూ అధికారులు నివేదిక తయారుచేసి పోలీసుస్టేషన్‌లో అందజేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసేందుకు సిద్ధమయ్యారు.

రూ.కోటి విలువైన భూమిని కొట్టేసేందుకు కుటిల యత్నం

పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు గ్రామంలోని సర్వేనంబర్ 213లో సంగు రాజశేఖర్‌రెడ్డి అనే వ్యక్తికి 13 సెంట్ల భూమి ఉంది. 2011లో దాన్ని దేవరాజుగట్టు గ్రామస్థుల నుంచి కొనుగోలు చేశాడు. ఆ భూమి జాతీయ రహదారి 544ని ఆనుకుని ఉండటంతో మార్కెట్ విలువ ప్రకారం రూ.కోటిపైనే ఉంది. ఎలాగైనా దాన్ని

మిగతా 6వ పేజీలో

వెలిగొండపై ముందడుగు

రూ.106.39 కోట్ల పనులకు ఆమోదం

- ప్యాకేజీ-2,4లలో పెండింగ్‌లో ఉన్నవి కొనసాగింపునకు మంత్రివర్గం తీర్మానం
- మెగా, ఎస్‌సీఎల్ కంపెనీలు చేపట్టేందుకు గ్రీన్‌సిగ్నల్

వెలిగొండ ప్రాజెక్టు పెండింగ్ పనులకు సంబంధించి మరో కీలక నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకుంది. ప్యాకేజీ 2, ప్యాకేజీ-4లలో పెండింగ్‌లో ఉన్న పనులకు రూ.106.39 కోట్లను మంజూరు చేసింది. అత్యవసరాన్ని బట్టి తొలుత టెండర్ పొందినవి కాకుండా ఇతర ఏజెన్సీలు చేసేందుకు అనుమతి ఇచ్చింది. ఆమేరకు ఆమోదం తెలుపుతూ మంగళవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తీర్మానించింది. వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ పనులను 2026 జూలైకి పూర్తిచేసి నీరు ఇవ్వాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి సంకల్పానికి అనుగుణంగా జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఎప్పటికప్పుడు సమీక్షలు చేస్తున్నారు. సాంకేతిక నిపుణులు, ఉన్నత స్థాయి ఇంజనీరింగ్ అధికారులు పనులను పరిశీలిస్తున్నారు. ఈక్రమంలో గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన పనుల పురోగతికి, ప్రస్తుతం నిర్దేశించుకున్న లక్ష్యానికి అనుగుణంగా అవసరమైన నిధుల మంజూరు, సాంకేతిక అనుమతులను ఒక్కొక్కటిగా కూటమి ప్రభుత్వం ఇస్తోంది.



ఒంగోలు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : వెలిగొండకు వార్షిక బడ్జెట్‌లో రూ.301కోట్లు మాత్రమే కేటాయించినట్లు చూపినప్పటికీ అవసరానికి అనుగుణంగా నిధులు మంజూరుకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. దీంతో పనుల వేగవంతంపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్యాకేజీ-4లో కొన్ని పనులకు సంబంధించి ప్రాజెక్టు అధికారులు ప్రతిపాదించిన రూ.183 కోట్ల అదనపు నిధుల మంజూరుకు గత నెలలో ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. తాజాగా తొలిదశ పనుల్లో అంతర్భాగంగా ప్యాకేజీ-2, ప్యాకేజీ-4లలో అత్యవసరంగా చేయాల్సిన పనుల కొనసాగింపునకు అనుమతి ఇచ్చింది. రూ.106.39 కోట్లు మంజూరు చేసింది. ఆ పనులు చేసేందుకు మెగా ఇంజనీరింగ్, అలాగే ఎస్‌సీఎల్ కంపెనీలకు అనుమతిస్తూ మంగళవారం జరిగిన మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది. వాస్తవానికి ప్యాకేజీ-2 పనులను గాయత్రీ కంపెనీ చేయాలి.ప్యాకేజీ-4 పనులను ఎస్‌సీఎల్-బీఎస్‌సీపీఎల్ కంపెనీలు జాయింట్ వెంచర్‌తో చేయాల్సి

మిగతా 6వ పేజీలో

డీఈవో కార్యాలయంలో ప్రక్షాళన



- పలువురు ఉద్యోగులకు స్థానచలనం

ఒంగోలు విద్య, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ప్రక్షాళనకు డీఈవో కిరణ్‌కుమార్ శ్రీకారం చుట్టారు. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందికి పనిభారం తగ్గించి ఉపాధ్యాయులకు మెరుగైన సేవలు అందించేందుకు వీలుగా పలువురికి స్థానచలనం కల్పించారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏ సెక్షన్‌లో ఏ-2గా షేక్ అల్లావలి, ఏ-3గా రమణయ్య, ఏ-4గా సిహెచ్.నవ్య, ఏ-7గా పి.స్టీవెన్‌సన్, బీసెక్షన్‌లో బీ-2గా కేవీ నాగార్జునరెడ్డి, బీ-4గా షేక్ మదార్‌బీ, బీ-5గా మల్లికార్జునరావును నియమించారు. సీసెక్షన్‌లో సీ-5గా నవ్యరోహిణి, సీ-6గా బి.శాంతికుమార్, అవుట్ వర్క్‌లో బి.బాలగురవయ్య, బి.సుబ్బారాయుడును నియమించారు. వీరంతా పాత స్థానాల్లో పూర్తి చార్జిని అప్పగించి వెంటనే కొత్త స్థానాల్లో బాధ్యతలు స్వీకరించాలని ఆ ఉత్తర్వుల్లో డీఈవో ఆదేశించారు.


పెదయిర్లపాడులో ఆక్రమిత భూమిలో వేసిన ప్లాట్లు

మల్లేశ్వరస్వామి భూములు అన్యాక్రాంతం

- పెదయిర్లపాడులో ప్లాట్లు వేసిన ఆక్రమణదారులు
- నిమ్జ్, రిలయన్స్ కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ రాకతో ఖాళీ స్థలాలకు డిమాండ్
- రెచ్చిపోతున్న భూబకాసురులు

7

ఇన్‌చార్జ్ డీసీవోగా ఇందిరాదేవి

- పూర్తి అదనపు బాధ్యతలతో నియామకం

ఒంగోలు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సహకార శాఖ ఇన్‌చార్జి అధికారిగా ఎన్.ఇందిరాదేవి నియమితులయ్యారు. సహకారశాఖ డివిజనల్ అధికారి హోదాలో ఉన్న ఆమె ప్రస్తుతం పీడీసీసీ బ్యాంకు లీగల్ విభాగంలో ఓఎస్‌డీగా పనిచేస్తున్నారు. ఇక్కడ డీసీవోగా పనిచేస్తున్న బి.శ్రీనివాసరెడ్డిపై అధికారపార్టీ కీలక ప్రజాప్రతినిధుల నుంచి పలు ఫిర్యాదులు వచ్చాయి. అయన పనితీరుపై కలెక్టర్ తమీమ్ అన్సారియా సైతం అసంతృప్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలో రెండు వారాల క్రితం శ్రీనివాసరెడ్డిని ప్రభుత్వానికి సరెండర్ చేశారు. అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉండగా, ఇందిరాదేవిని పూర్తి అదనపు బాధ్యతల (ఎఫ్ఏసీ)తో డీసీవోగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో మంగళవారం సాయంత్రం ఆమె బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ అన్సారియాను మర్యాదపూర్వకంగా కలిశారు. రెగ్యులర్ డీసీవోగా మరొకరిని ప్రభుత్వం నియమించే వరకు ఇందిరాదేవి ఈ బాధ్యతల్లో కొనసాగనున్నారు.


బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ అన్సారియాను కలిసి బొకేను అందజేస్తున్న ఇందిరాదేవి

ఉపాధి పనుల్లో పురోగతి సాధించాలి

- కలెక్టర్ అన్సారియా
- పి.నాయుడుపాలెంలో జరుగుతున్న పనుల పరిశీలన
- కూలీల సమస్యల గురించి వాకబు


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

చీమకుర్తి, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన లక్ష్యం మేరకు అందరికీ పనులు కల్పించి పురోగతి సాధించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. మంగళవారం చీమకుర్తి మండలం పి.నాయుడుపాలెం గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్మాణంలో ఉన్న పశువుల తొట్టెలను పరిశీలించి నాణ్యతతో త్వరగా నిర్మాణాలు పూర్తిచేయాలని డ్వామా పీడీ జోసఫ్‌కుమార్‌ను ఆదేశించారు. కూలీల వద్దకు వెళ్లి పనిదినాల కల్పన గురించి అడిగి తెలుసుకున్నారు. హాజరును పరిశీలించారు. వేసవిలో ఎండ తీవ్రత నుంచి ఉపశమన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. రైతుల పొలంలో నిర్మించిన ఫారంపాండ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని మహిళలు కలెక్టర్‌ను కోరగా తదనుగుణంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మయ్య, మాజీ సర్పంచ్ కూరాకుల కరుణాకర రెడ్డి పాల్గొన్నారు.

ఒక్కడ్రాపౌట్ ఉండకూడదు..

బడి ఈడు గల పిల్లలందరూ నూటికి నూరుశాతం పాఠశాలలకు వెళ్లాలని, ఒక్క డ్రాపౌట్ కూడా ఉండకూడదని కలెక్టర్ అన్సారియా చెప్పారు. చీమకుర్తిలో ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేకంగా సమావేశమైన కలెక్టర్ డ్రాపౌట్లపై దిశానిర్దేశం చేశారు. విద్యాశాఖలో అనేక సంస్కరణలు తీసుకువచ్చిందని, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను తల్లిదండ్రులకు వివరించి, పిల్లల నమోదు పెంచేవిధంగా వ్యవహరించాలని డీఈవో కిరణ్‌కుమార్‌ని ఆదేశించారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. తదుపరి పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా న్యూట్రిషన్ ఆహారం తయారుచేసే విధానాన్ని ఐసీడీఎస్ సిబ్బంది ప్రదర్శించగా కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవోలు నరసింహారావు, శివాజీ, ఐసీడీఎస్, వైద్యశాఖాధికారులు పాల్గొన్నారు.

ఫోర్జరీతో హాంఫట్

(5వ పేజీ తరువాయి)

కాజేయాలని మండల కేంద్రమైన పెద్దారవీడు చెందిన విద్యుత్ శాఖలో పనిచేసే ఓ ఉద్యోగి పథకం పన్నాడు. దొంగపత్రాలు సృష్టించి ఎలాంటి భూమినైనా కాజేయడం అతనికి వెన్నతో పెట్టిన విద్య. అనుకున్నదే తడవుగా పెద్దారవీడు తహసీల్దార్ దాను సంతకాన్ని ఫోర్జరీ చేశాడు. 2024 ఫిబ్రవరిలో జారీ చేసినట్లుగా మండల కేంద్రానికి చెందిన దుగ్గెం భాస్కర్, వేశపోగు అచ్చమ్మ, ఆరవీటి కొండయ్య అనే ముగ్గురికి ఒక్కొక్కరి 120 గజాల చొప్పున నివేశన స్థల పట్టాలు తయారు చేశాడు. వాటిని చూపించి పల్నాడు జిల్లా వినుకొండ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించాడు. అందుకు అవసరమైన వీఆర్వో ధ్రువీకరణపత్రాన్ని కూడా ఫోర్జరీ సంతకాలతో తయారు చేశాడు. అనంతరం ఆ భూమిలోకి వెళ్లి శుభ్రం చేస్తున్న క్రమంలో భూయజమాని రాజశేఖర్‌రెడ్డి అడ్డుకోవడంతో అక్రమం బహిర్గతమైంది.

భూయజమాని ఫిర్యాదుతో కదిలిన డొంక

దొంగ రిజిస్ట్రేషన్ పత్రాలతో భూమిలోకి ప్రవేశించిన సదరు మండల కేంద్రానికి చెందిన ముగ్గురు తొలుత భూయజమానిపై దౌర్జన్యానికి దిగారు. భూయజమాని ఆ రిజిస్ట్రేషన్ పత్రాలను తీసుకుని తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి మొత్తం రికార్డులను పరిశీలించారు. నివేశన స్థల పత్రాలు దొంగవి సృష్టించినట్లు నిర్ధారించుకుని తొలుత వీఆర్వో భాస్కర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. వాటిని పూర్తిగా పరిశీలించిన వీఆర్వో భాస్కర్‌రెడ్డి ఒక నివేదికను తయారుచేసి తహసీల్దార్ శైలేంద్రకుమార్‌కు ఇచ్చారు. స్థల ధ్రువీకరణ పత్రంలో 2024 ఫిబ్రవరి 30న పట్టాను తయారు చేసినట్లు ఉంది. అంతేకాక 2024 ఫిబ్రవరిలో పనిచేసిన తహసీల్దార్ సంతకం కూడా తేడాగా ఉంది. రిజిస్ట్రేషన్ కోసం సృష్టించిన వీఆర్వో ధ్రువీకరణ పత్రంలో కూడా ఎన్.భాస్కర్‌రెడ్డి బదులు జి.భాస్కర్ రెడ్డి అని వీఆర్వో సంతకాన్ని చేశారు. వీటన్నింటినీ పేర్కొంటూ దొంగ ధ్రువీకరణ పత్రాలు సృష్టించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ శైలేంద్రకుమార్ దేవరాజుగట్టు పోలీసు స్టేషన్‌కు మంగళవారం ఫిర్యాదును పంపారు. దీనిపై ఎస్సై అనిల్‌కుమార్‌ను వివరణ కోరగా తాను మార్కాపురంలో క్రైం మీటింగ్‌లో ఉన్నానని చెప్పారు. స్టేషన్‌కు వెళ్లిన తర్వాత పరిశీలించి కేసు నమోదు చేస్తానని తెలిపారు.


దొంగ సంతకాలతో ఇళ్ల పట్టాలు సృష్టించి కాజేసిన భూమి ఇదే

పాలసీతో ప్రాణం

(5వ పేజీ తరువాయి)

కోల్పోయాయి. ఇపుడు నూతన పాలసీలో ఆక్షన్ పద్ధతిని రద్దు చేసి పాతపద్ధతినే పునరుద్ధరించనున్నారు.

రెన్యువెల్స్‌కి కూడా వసూలు చేస్తున్న ప్రీమియం 10రెట్ల వార్షిక డెట్ రెంట్ నుంచి 5 రెట్లకు తగ్గించారు. ఇది రెండు దశలలో చెల్లించే వెసులుబాటును కల్పించారు. పూర్తి ప్రీమియం చెల్లించిన తేదీ లేదా దరఖాస్తు సమయానికి సంబంధం లేకుండా అన్ని రెన్యువల్ దరఖాస్తులు ఆరునెలల పాటు పరిగణిస్తారు. అపుడు తగ్గించిన ప్రీమియంతో వాటిని సమర్పించవచ్చు

--డెట్‌రెంట్లను ఖనిజ ప్రాతిపదికన తిరిగి సవరించారు. ఇప్పటి వరకూ ప్రతికూలంగా ఉండే త్రైమాసిక సెటిల్‌మెంట్‌కు బదులుగా వార్షిక సెటిల్ చేయగలిగే విధంగా మార్చారు. దీనివలన లీజుదారులు తమ నిధులను సమర్థవంతంగా వినియోగించగలుగుతారు.

-కొత్త లీజులు, రెన్యువల్స్‌కు గరిష్ఠ కాలపరిమితిని పెంచారు. గ్రానైట్‌కు కొత్త లీజుకు 20ఏళ్ల నుంచి 30 ఏళ్లకు, రెన్యువల్స్‌కు 10 నుంచి 20ఏళ్లకు పెంచారు. పూర్తి ప్రీమియం చెల్లించి గతంలో మంజూరైన రెన్యువల్స్ కూడా ఇపుడు ఈ కొత్త కాలపరిమితికి అనుగుణంగా సర్దుబాటు చేయటం ఓనర్లకు కలిసి వచ్చే అంశంగా ఉంది

-గత కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పాత కేసుల పరిష్కారానికి వన్‌టైం సెటిల్‌మెంట్‌ని తీసుకురానున్నారు. ఒక సంవత్సర కాలపరిమితితో ఓటీఎస్‌ను ప్రవేశపెట్టారు.

-జరిమానాలు కూడా భారీగా తగ్గించారు. పదిరెట్ల సీనరేజి ఫీజు నుంచి రెండు రెట్లు, ఐదు రెట్లు నుంచి ఒక రెట్టుకు తగ్గించారు. దీనివలన మూసివేసిన గనులను మళ్లీ ప్రారంభించే అవకాశం ఉంటుంది. కేసుల భారం తగ్గుతుంది. పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సులభంగా వసూలు అవటం ద్వారా ఇటు ప్రభుత్వానికి సైతం లాభదాయకంగా ఉంటుంది.

-డంపింగ్ రాళ్లను అధికారికంగా విక్రయించేందుకు నూతన పాలసీ వెసులుబాటు కల్పించింది. రోడ్ మెటల్‌కు నామినల్‌గా వసూలు చేసే ఫీజును చెల్లించి విక్రయించుకోవచ్చు. దీని వలన అక్రమంగా తరలుతున్న డంపింగ్ రాళ్లకు చెక్ పడటమే కాక ప్రభుత్వానికి ఆదాయం చేకూరుతుంది. ఓనర్లకు ప్రయోజనకరంగా ఉంటుంది. వ్యర్థాల డంపింగ్ కోసం అదనంగా భూమిని పొందే వెసులుబాటును కల్పించారు. అయితే దీనికిగాను మూడు రెట్ల డెట్ రెంట్‌ని వసూలు చేస్తారు.

-కుటుంబ సభ్యులకు లీజు బదిలీపై ఫీజు మినహాయింపునిచ్చారు. తండ్రి, తల్లి, కొడుకు, కుమార్తె వంటి ప్రత్యక్ష కుటుంబ సభ్యులకు లీజులను సులభంగా బదిలీ చేసుకోవచ్చు

--సీనరేజి వసూలు చేసే ప్రక్రియను మార్పుచేశారు. రాష్ట్రం అంతా ఒకేవిధంగా వసూలు బాధ్యతను కాంట్రాక్ట్ ఏజెన్సీకి అప్పజెప్పనున్నారు. దీనివలన ప్రభుత్వ ఖజానాకు స్థిరమైన ఆదాయం లభిస్తుంది.

-లీజు జీవితచక్రం మొత్తం డిజిటల్ పోర్టల్ ద్వారా నిర్వహిస్తారు.

--లీజుదారులకు స్టార్ రేటింగ్‌ని నిర్ణయిస్తారు.

-తమకు మంజూరైన లీజుల్లో ఇప్పటివరకూ జరిపిన తవ్వకాలపై డ్రోన్ల ద్వారా సర్వే నిర్వహించి అనుమతులు మేరకు తవ్వకాలు జరిపారా లేదా? అని నిర్ధారించనున్నారు. పాలసీలో కొత్తగా తీసుకున్న ఈ నిర్ణయం ఓనర్లకు చేదు గుళికలా మారింది. దీనిపై ప్రాక్టికల్‌గా ఎదురయ్యే సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే యోచనలో ఓనర్లు ఉన్నారు.

-మొదలుపెట్టకుండా ఉన్న లీజు గడువును ఒక సంవత్సరంలో శాస్త్రీయంగా మూసివేయాలి.

ట్రాక్టర్ ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతి చెందిన అంజయ్య

పంగులూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆదిరెడ్డి బావి మలుపు సమీపంలో ట్రాక్టర్ ఒరిగి ట్రక్కు టైరు కింద పడి గోళ్లమూడి అంజయ్య (45) మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. అందిన సమాచారం మేరకు.. కోటపాడు గ్రామానికి చెందిన పూసపాటి శివశంకర్ మంగళవారం రాత్రి ముప్పవరం వైపు నుంచి ట్రాక్టర్ నడుపుకుంటూ స్వగ్రామానికి వస్తున్నారు. ట్రాక్టర్ ఆదిరెడ్డి బావి సమీపంలో రోడ్డు మార్జిన్‌లో ఒరిగి పడిపోవడంతో ట్రక్కుపై కూర్చున్న కోటపాడు గ్రామానికి చెందిన గోళ్లమూడి అంజయ్య ప్రమాదవశాత్తు తిరగబడ్డ ట్రక్కు టైరు కిందపడి మృతి చెందారు.

చిల్లర కొట్టులో చోరీ

రూ.59,245 విలువైన బంగారం, నగదు, సిగరెట్ల అపహరణ

అద్దంకి, ఏప్రిల్ 15 : చిల్లర కొట్టు నిర్వహించే ఇంట్లో చోరీ జరిగి సుమారు 59,245 రూపాయల విలువైన బంగారం, నగదు, సిగరెట్లు అపహరణకు గురయ్యాయి. పోలీస్‌లు కథనం మేరకు.. అద్దంకి పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల నుంచి కొత్తపేట వెళ్ళే రోడ్డులో పల్లబోతు రోశమ్మ ఇంట్లో బడ్డీ దుకాణం నిర్వహించుకుంటూ ఉంది. సోమవారం రాత్రి దుకాణం మూసి వేసి ఆయిల్‌మిల్ రోడ్డులోని కుమార్తె ఇంటికి వెళ్లింది. మంగళవారం ఉదయం వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు. ఇంట్లో ఉన్న 12 వేల రూపాయల నగదు, 5 గ్రాముల చెవి కమ్మలు, 40 పెట్టెల వివిధ కంపెనీల సిగరెట్‌లు అపహరించుకు పోయారు. ఇంట్లో వెనుక వైపు తలుపు తెరిచి లోపలకు ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. రోశమ్మ అల్లుడు ఉడత్ సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. అయితే చోరీ జరిగిన తీరును బట్టి స్థానికంగా ఉండే దొంగలే చోరీకి పాల్పడి ఉంటారని పోలీస్‌లు భావించి ఆ కోణంలో విచారణ చేపట్టినట్లు తెలుస్తుంది. ఈ క్రమంలో ఇప్పటికే చోరీకి పాల్పడ్డ యువకులకు సంబంధించిన సమాచారం కూడా లభ్యమైనట్లు సమాచారం.

సిమెంటు దిమ్మెను ఢీకొని మోటారు సైకిలిస్టు మృతి


సుభాని మృతదేహం

సింగరాయకొండ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మోటారు సైకిల్ అదుపు తప్పి జాతీయ రహదారి మధ్యలో ఉన్న సిమెంటు దిమ్మెను ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మూలగుంటపాడు పోలేరమ్మగుడి సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బాపట్ల జిల్లా యద్దనపూడి మండలం పెదజాగర్లమూడి గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ సుబాని (35) తిరుపతి జిల్లా గూడూరులోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. స్వగ్రామంలోని తల్లి వద్దకు సోమవారం వెళ్లాడు. రాత్రికి గూడూరుకు బయల్దేరాడు. జాతీయ రహదారిపై మూలగుంటపాడు పోలేరమ్మగుడి సమీపంలోకి వచ్చేసరికి బైక్ అదుపుతప్పడంతో రన్‌వే మధ్యలో ఉన్న సిమెంట్ దిమ్మెను బలంగా ఢీకొట్టాడు. దీంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకొన్న హైవే మొబైల్ పోలీసులు ఆయన్ను అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏఎస్సై షేక్ మహబూబ్‌బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భైరాగిమాన్యంలో చోరీ

రూ.25 వేల నగదు అపహరణ

సింగరాయకొండ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని భైరాగిమాన్యంలో చోరీ జరిగింది. దొంగలు రూ.25వేల నగదును అపహరించుకెళ్లారు. పోలీసు కథనం మేరకు.. భైరాగి మాన్యంకు చెందిన రాజు సుబ్బారెడ్డి ఈనెల 5న భార్యతో కలిసి తిరుపతి వెళ్లారు. తిరిగి మంగళవారం ఉదయం ఇంటికి వచ్చారు. ప్రధాన ద్వారం తాళం పగులకొట్టి ఉండటాన్ని చూసి కంగారుపడ్డారు. లోపలికి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. దుస్తులు చిందరవందరగా ఉన్నాయి. అందులో ఉంచిన రూ.25వేలు కన్పించలేదు. దీంతో సుబ్బారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై బి.మహేంద్ర కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా మద్యం, సారా విక్రయిస్తే చర్యలు

చీరాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మద్యం అమ్మకం, సారా తయారీ వంటి నేరాలకు పాల్పడితే చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. ఈక్రమంలో వైకుంఠపురానికి చెందిన కావాటి నాగరాజును అదుపులోకి తీసుకుని అతని వద్ద 8 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రామారావు, ఎస్సై శ్రీహరి, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళపై బంధువుల దాడి

బల్లికురవ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వైదనలో ఆస్తి తగాదాల నేపథ్యంలో మహిళపై బంధువులు దాడి చేయడంతో గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. వైదనకు చెందిన ఓర్సు రమణమ్మను బంధువులైన ఓర్సు వెంకటేశ్వర్లు మరో ముగ్గురు కలిసి పూర్వీకుల నుంచి రాబడిన ఆస్తుల పంపకం విషయంలో గొడవపడి సోమవారం దాడి చేశారు. రమణమ్మను అద్దంకి ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

కందుకూరి రాష్ట్ర పురస్కారానికి ఎంపికైన 'కందిమళ్ల'

మార్టూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోలలపూడి గ్రామానికి చెందిన ప్రముఖ నాటక రచయిత రంగస్థల ప్రముఖుడు మార్టూరు శ్రీకారం రోటరీ కళా పరిషత్ అధ్యక్షుడు డాక్టరు కందిమళ్ల సాంబశివరావుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కందుకూరి రాష్ట్ర పురస్కారాన్ని మంగళవారంప్రకటించింది. కందిమళ్ల తెలుగునాటక రంగం నూతన ధోరణులు ప్రయోగాలు అనే అంశంపై పీహెచ్‌డీ, గుంటూరు జిల్లా నాటకరంగ చరిత్ర అనే అంశంపై డిలిట్ పట్టాలను నాగార్జున బరంపురం విశ్వ విద్యాలయాల నుంచి పొందారు. సారా సంహారం,సైసై జోడెడ్ల బండి వంటి 18 నాటకాలు నాటికలను రచించారు. ఉత్తమ నాటకరచయితగా నాగార్జున, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారాలను పొందారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కళారత్నప్రపంచతెలుగు మహాసభల పురస్కారాలతోగిడుగు తెలుగుభాషా పురస్కారాలను పొందారు.కందిమళ్ల రచించిన అభినయ భారతాచార్య చాట్ల శ్రీరాములు తెలుగునాటక ఉద్యమ నేపథ్యం నాటక గ్రంధాలకు ప్రభుత్వ నంది పురస్కారాలు లభించాయి.సాంబ శి వరావు చిలకలూరిపేటలోని డిఆర్ ఎన్ యస్‌సివిఎస్ కళాశాలనుండి తెలుగు ప్రొఫెసర్ గా ఉద్యోగ విరమణ చేశారు.కందుకూరి రాష్ట్ర పురస్కారాన్ని సీఎం చంద్రబాబు నాయుడు తెలుగు నాటక రంగదినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం విజయవాడ లో జరిగే సభలో ప్రధానం చేస్తారు. అయితే ప్రస్తుతం సాంబ శి వరావు అమెరికాలో ఉన్నారు.

పోలీసుల అదుపులో ప్రధాన క్రికెట్ బుకీ

సింగరాయకొండ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ప్రధాన క్రికెట్ బుకీ అయిన వైసీపీ నాయకుడిని సింగరాయకొండ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఇతనిపై స్థానిక స్టేషన్‌లో నెల క్రితం కేసు నమోదైంది. అప్పటి నుంచి పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్నాడు. ఈ తరుణంలో సింగరాయకొండలో అదుపులోకి తీసుకొని ఒంగోలుకు తరలించి విచారిస్తున్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న మండలంలోని క్రికెట్ బుకీలు పరారయ్యారు.

వెలిగొండపై ముందడుగు

(5వ పేజీ తరువాయి)

ఉంది. ప్యాకేజీ-2లో అత్యవసరమైన తీగలేరు హెడ్ రెగ్యులేటరీ గేట్ల ఏర్పాటు, ఆ కాలువలోని టన్నెల్ లైనింగ్, ఫీడర్ కాలువ కలిపి సుమారు రూ.68 కోట్ల పనులను చేయకుండా సదరు కంపెనీ పెండింగ్‌లో పెట్టింది. ప్యాకేజీ-4లోని తూర్పు ప్రధాన కాలువ హెడ్‌రెగ్యులేటరీ నిర్మాణం, గేట్ల ఏర్పాటు ఇతరత్రా సుమారు రూ.38 కోట్ల విలువైన పనులు పెండింగ్‌లో ఉన్నాయి. జాయింట్ వెంచర్‌లో ఉన్న ఒక కంపెనీ ముందుకు రాక ఆగిపోయాయి. దీంతో పనులు అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని ఉన్నతాధికారులు చొరవ చూపి వెలిగొండ ప్రాజెక్టులో ఇతర పనులు చేస్తున్న మెగా, అలాగే ఎస్‌సీఎల్ కంపెనీలతో మాట్లాడి పెండింగ్ పనులు చేసేలా ఒప్పించారు. ఆ ప్రకారం ప్యాకేజీ-2లో పెండింగ్‌లో ఉన్న రూ.68 కోట్ల పనులను మెగా కంపెనీకి, ప్యాకేజీ-4లో పెండింగ్ పనులు జాయింట్ వెంచర్‌లోని ఎస్‌సీఎల్ చేసేందుకు అంగీకరించి కొంత పని కూడా చేపట్టారు. ఈనేపథ్యంలో ఆ రెండు ఏజెన్సీలకు రూ.106.39 కోట్ల విలువైన పనులు చేసేందుకు అనుమతిస్తూ మంత్రివర్గం తీర్మానించింది. దీంతో వెలిగొండ తొలిదశ పనుల్లో మరో ముందడుగు పడినట్లు అయింది.

గిన్నిస్‌బుక్‌లోకి చీమకుర్తి విద్యార్థి

అవీఇవీ

- నాన్‌స్టాప్ కీబోర్డు ప్లే ఈవెంట్‌లో రికార్డు సాధన


పత్రాన్ని అందుకుంటున్న గుణవంత్

చీమకుర్తి, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి) : గిన్నిస్‌బుక్ ఆఫ్ రికార్డు సాధించిన ఘనత చీమకుర్తి విద్యార్థికి దక్కింది. పట్టణంలో వీవర్స్‌కాలనీకి చెందిన ఈదర గుణవంత్ స్థానిక లిటిల్ స్టార్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. కాగా 1046మందితో ఒకే టైమ్‌లో గంటపాటు నాన్‌స్టాప్‌గా కీబోర్డు ప్లేచేసి గిన్నిస్‌బుక్ రికార్డును సొంతం చేసుకున్నాడు. ఈ కార్యక్రమం హైదరాబాద్‌లోని అంతర్జాతీయ హలెబ్ మ్యూజిక్‌స్కూల్‌లో 2024 డిసెంబర్ 1న జరగ్గా, దీనిని గుర్తించిన గిన్నిస్‌బుక్ ప్రతినిధులు రికార్డు సాధించినట్లు అధికారికంగా సోమవారం వెల్లడించి హైదరాబాద్‌లో గుణవంత్‌కి ఆ పత్రాన్ని అందజేసి అభినందించారు. గుణవంత్ తల్లి ప్రేమ్‌జ్యోతి చీమకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సుగా, తండ్రి రహీమ్ గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేస్తుంటారు. కీబోర్డులో శిక్షణను హైదరాబాద్‌లో ఉన్న మ్యూజిక్ సంస్థ ద్వారా ఆన్‌లైన్‌లో ఏడాదిపాటు తీసుకొని రికార్డు సాధించిన గుణవంత్‌ను మంగళవారం పట్టణవాసులు, స్కూల్ యాజమాన్యం అభినందించింది.

ఒడా కార్యదర్శిగా దేవసేన

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఒడా) కార్యదర్శిగా ఆర్.చాంది దేవసేనను నియమిస్తూ పురపాలక ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పలువురు మునిసిపల్ కమిషనర్లలో బదిలీలో భాగంగా ఆమెను నియమించారు. గ్రేడ్-2 హోదా కలిగిన ఆమె పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉండగా, ఒంగోలు ఒడా కార్యదర్శిగా నియమితులయ్యారు.

వైభవంగా శ్రీలక్ష్మీ గణపతి షిర్డీ సాయినాథ మందిర వార్షికోత్సవం


పూజల్లో పాల్గొన్న భక్తులు

పంగులూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముప్పవరం గ్రామంలో శ్రీలక్ష్మీ గణపతి షిర్డీ సాయినాథ ఆలయ 21వ వార్షిక మహోత్సవం ఘనంగా జరిగింది. శ్రీషిర్డీ సాయిబాబా మూల విరాట్‌కు భక్తులు పంచామృత అభిషేకం, శ్రీలక్ష్మీ గణపతి హోమంను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవమూర్తుల గ్రామోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. వార్షికోత్సవ సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు జరిగిన ఉత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం


అయ్యప్పస్వామి

అద్దంకి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ సమీపంలోని అయ్యప్ప స్వామి దేవాలయ వార్షికోత్సవ పూజలు మంగళవారం వైభవంగా జరిగాయి. పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, చెన్నుపాటి వీరాంజనేయులు, దామా హనుమంతరా వు, కన్నెబోయిన వీరయ్య, వల్లెపు వెంకటేశ్వర్లు, వాసు గురుస్వా మి, తిరుపతిరెడ్డి గురుస్వామి, శ్రీరాం రామలింగేశ్వరరావు, అంజ య్య, ఆలకుంట నాగేంద్రస్వామి, బాపయ్య, అర్చకులు సూర్యమాల మాలకొండమాచార్యులు పాల్గొన్నారు.

నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేయాలి

రైతుల నిరసన, రాస్తారోకో


పర్చూరు బొమ్మల సెంటర్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు, రైతులు

పర్చూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : నల్లబర్లీ పొగాకును వెంటనే కొనుగోలు చేసేవిధంగా ఆయా కంపెనీల ప్రతినిధులతో ప్రభుత్వం చర్చలు జరపాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. నల్లబర్లీ పొగాకు రైతులతో కలిసి రైతు, కౌలు రైతు సంఘం నాయకులు మంగళవారం నిరసన, రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెద్ద ఎత్తున పొగాకును సాగు చేయాలని గతం లో సూచించిన కంపెనీలవారు ఇప్పుడు కొనుగోలుకు ముందుకు రావ డం లేదన్నారు. దీంతో రైతులకు పాలుపోని పరిస్థితి ఏర్పడిందన్నారు. వెంటనే ఆయా కంపెనీల వారు పొగాకు కొనుగోలు చేసేవిధంగా ప్రభు త్వం చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య, అధ్యక్షుడు కొండయ్య, సీపీఎం నాయకులు శ్రీనివాసరావు, డేవిడ్, షేక్ రహీం, రోశయ్య రైతులు పాల్గొన్నారు.

పూసపాడు : నల్లబర్లీ పొగాకుకు మంచి ధర ఉన్నా కొనుగోలు చేయడం లేదని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కందిమళ్ల రామకోటేశ్వరరావు అన్నారు. నల్లబర్లీ పొగాకును వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఇంకొల్లు మండలం, పూసపాడు అడ్డరోడ్డులో జిల్లా రైతు సంఘం, కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బొగ్గవరపు శంకర్రావు, గోవిందరాజులు, మహేష్, పౌలు జక్కరయ్య, రామారావు పాల్గొన్నారు.

ఏపీబీఎస్ఎస్ఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా 'ప్రకాశం'

అద్దంకిటౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (ఏపీబీఎస్ఎస్ఎస్) రాష్ట్ర కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం మంగళవారం ఏలూరులో జరిగింది.కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా అద్దంకికి చెందిన ప్రకాశం ఎయిడెడ్ స్కూల్‌కు చెందిన టంగుటూరి ప్రకాశం ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా పదవి పొందిన టంగుటూరి ప్రకాశంకు అద్దంకి బ్రాహ్మణ సంఘ సభ్యులు, ఇతర సంఘాల సభ్యులు అభినందనలు తెలియజేశారు.

తీరంలో సమస్యల తిష్ట

- వాడరేవు, రామాపురం సముద్రతీరంలో అరకొర వసతులు
- ఎమ్మెల్యే చొరవతో గజ ఈతగాళ్ల సమస్యకు పరిష్కారం
- ముఖ్యంగా మహిళలకు మరుగుదొడ్లు, విశ్రాంతికి షెడ్లు అవసరం
- వేసవి నేపథ్యంలో పెరుగుతున్న పర్యాటలకు తాకిడి



చీరాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలోని వాడరేవు, రామాపురం సముద్ర తీరాలు పర్యాటకులతో కళకళలాడుతున్నాయి. పదో తరగతి, ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు ముగియడంతో తీరప్రాంతానికి విద్యార్థుల సంఖ్య కూడా పెరిగింది. ఈ ప్రాంతంలోని తీరం చక్కగా, ఆహ్లాదకరంగా ఉండడంతోపాటు రిసార్ట్స్ ఉన్నాయి. దీంతో హైదరాబాద్, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి, గుంటూరు వంటి సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది. దీంతో సాగరతీరంలో సందడి వాతావరణం నెలకొంటోంది.

కొన్ని సమస్యలతో ఇబ్బందులు

తీర ప్రాంతంలో కొన్ని సమస్యలు తాండవిస్తున్నాయి. ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదు. చెత్తతోపాటు మద్యం ఖాళీ సీసాలు ఎక్కడికక్కడే కనిపిస్తున్నాయి. పర్యాటకులు సేద తీరేందుకు తీరం వెంబడి కనీసం షెడ్లు కూడా లేవు. ఆహార వసతి కూడా లేదు. స్త్రీలు, యువతులకు టాయ్‌లెట్లు లేక అవస్థలు పడుతున్నారు. విశ్రాంతి గదుల ఊసే లేదు. దీంతో పర్యాటకులు అసౌకర్యానికి గురవుతున్నారు. తగిన రుసుంతో అత్యవసర, కచ్చితమైన అవసరాలను అధికార యంత్రాంగం ఏర్పాటు చేయడం వలన పర్యాటకులకు సౌకర్యాలు.. ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. ఇటీవల కలెక్టర్ సైతం స్పందిస్తూ బీచ్‌లో ఏర్పాటు చేయాల్సిన వసతులపై కచ్చితమైన సూచనలు చేశారు.



గతంలో వరుస మరణాలతో బెంబేలు

గతంలో బీచ్‌లో వరుస మరణాలతో పర్యాటకులు, ప్రజలు బెంబేలెత్తారు. ఒక దశలో అధికారులు సైతం బీచ్‌ను తాత్కాలికంగా మూసేశారు. ఈ సమస్యపై దృష్టి సారించిన ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పర్యాటకుల రక్షణకు నడుం బిగించారు. రిసార్ట్స్ నిర్వాహకులు, పోలీసులతో సమావేశాలు నిర్వహించి ప్రమాదాలను అరికట్టేందుకు హెచ్చరిక హోర్డింగులు, గజ ఈతగాళ్లను నియమించారు. ఈ సమయంలో ఎమ్మెల్యేపై ఆరోపణలు వెల్లువెత్తినప్పటికీ ఆయన లక్ష్య పెట్టలేదు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగి తిరిగి అన్ని ఏర్పాట్లతో బీచ్‌ను ప్రారంభించారు. దీంతో మరణాల సంఖ్య దాదాపుగా తగ్గింది. మధ్యలో రిసార్ట్స్ నిర్వాహకులు రెండుమాసాలు గజ ఈతగాళ్లకు జీతాలు ఇవ్వకపోవడంతో వెంటనే రెండు ఘటనలు చోటుచేసుకున్నాయి. ఆ ఘటనల్లో ఒకరు మృత్యువాత పడగా, మరొకరిని మెరైన్ పోలీసులు రక్షించారు. దీంతో తిరిగి మళ్లీ రిసార్ట్స్ నిర్వాహకులు గజ ఈతగాళ్లను కొనసాగిస్తున్నారు. ఈక్రమంలో ప్రస్తుతం రక్షణ మార్గాలు సమకూరాయి.

వాడరేవు, రామాపురాన్ని అభివృద్ధి చేస్తాం

ఎమ్మెల్యే కొండయ్య

గతంలో వైఫల్యాల వలన చాలా ప్రమాదాలు జరగడమే కాకుండా, ఆదాయం లేకుండా పోయింది. ఈక్రమంలో బీచ్‌ల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాం. రెండు ప్రాంతాల్లో ఈ మాసంలోనే రూ.60లక్షల(ఒక్కో ప్రాంతానికి 30లక్షల)తో మరుగు దొడ్లు, డ్రెస్సింగ్ రూంలను ఏర్పాటు చేస్తాం. అందుకు సంబంధించి శంకుస్థాపన త్వరలోనే జరుగుతుంది. ప్రమాదాలను నియంత్రించాం. సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంది. అలాగే హట్స్ ఏర్పాటుకు పరిశీలిస్తున్నాం. పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తీరాన్ని అభివృద్ధి చేస్తాం.





ఎమ్మెల్యే సూచనలతో రక్షణ కల్పిస్తున్నాం

పోతురాజు, గత ఈతగాడు

ఎమ్మెల్యే కొండయ్య ఆదేశాలతో పర్యాటకులకు రక్షణ కల్పిస్తున్నాం. ఈక్రమంలో ప్రజలకు రక్షణ, మాకు భుక్తి దొరుకుతుంది. గతంలో పర్యవేక్షణ లేక చాలా ప్రమాదాలు జరిగాయి. ఇప్పుడు ఆ ప్రభావం లేకుండా చూస్తున్నాం. పర్యాటకులకు కూడా అలల తాకిడిని గుర్తిస్తుండాలి.

డైట్ పోస్టులకు నేడు, రేపు రాతపరీక్ష

ఒంగోలు విద్య, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మైనంపాడులోని జిల్లా విద్యాశిక్షణా సంస్థ(డైట్)లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను భర్తీ చేసేందుకు బుధ, గురువారాల్లో ట్యాబ్ ఆధారిత రాతపరీక్ష నిర్వహిస్తున్నారు. ఈ పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు డైట్ ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు చెప్పారు. డైట్‌లో ఖాళీగా ఉన్న ఆరు సీనియర్ లెక్చరర్స్, 17 లెక్చరర్ పోస్టులను భర్తీ చేసేందుకు ఎస్సీఈఆర్టీ నోటిఫికేషన్ జారీ చేసింది. మండల విద్యాధికారులు, హెచ్ఎంలు, స్కూలు అసిస్టెంట్లను డిప్యూటేషన్ విధానంలో ఈ పోస్టుల్లో నియమాకం చేయనున్నారు. ఈ పోస్టులకు 85 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తుల పరిశీలనలో 39 మంది అనర్హులుగా తేలారు. అర్హులు 46 మందికి బుధ, గురువారాల్లో స్థానిక పీవీఆర్ బాలికోన్నత పాఠశాలలో ట్యాబ్ ఆధారిత రాత పరీక్షను వంద మార్కులకు నిర్వహించనున్నారు. ఈ పరీక్షల్లో కంటెంట్, మెథడాలజీ, ట్రెండ్స్, జనరల్ ఇంగ్లీషు, కంప్యూటర్ అవేర్‌నెస్ నుంచి 100 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. 16న ఉదయం 9నుంచి 11 గంటలు, మధ్యాహ్నం 1నుంచి 3 గంటలు, సాయంత్రం 5 నుంచి గంటలు, 17న ఉదయం 9నుంచి 11 వరకు, మధ్యాహ్నం 1నుంచి 3 గంటల వరకు మొత్తం ఐదు సెషన్లలో పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష నిర్వహణకు ట్యాబ్‌లను సిద్ధం చేసినట్లు ప్రిన్సిపాల్ సుబ్బారావు తెలిపారు.

ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు చేయాలి

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గుండ్లకమ్మ ప్రాజెక్టు నిర్వాసిత ప్రాంతం కింద తమ గ్రామానికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని అమలు చేయడంలో ఏళ్ల తరబడి నిర్లక్ష్యం వహిస్తున్నారని అద్దంకి మండలం కొటికలపూడి గ్రామ పంచాయతీ పరిధిలోని తిమ్మారెడ్డిపాలెం గ్రామస్థులు ఆరోపించారు. జేసీ ప్రఖర్‌జైన్‌ను కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో మంగళవారం కలిసి సమస్యలను వివరించారు. 2006నుంచి గ్రామంలో తాగునీరు మొదలుకుని రోడ్ల వరకు అన్ని సమస్యలు అపరిష్కృతంగానే ఉండిపోయానని, భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం కూడా ఇంకా 25 ఎకరాలకు సంబంధించి పెండింగ్‌లోనే ఉందని జేసీకి వివరించారు. ఇదే విషయాన్ని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లగా ఆయన సీసీఎల్ఏ కమిషనర్‌తో కూడా మాట్లాడారని, మంత్రి గొట్టిపాటి రవికుమార్ కూడా సమస్య పరిష్కారానికి సానుకూలంగా స్పందించారని గ్రామస్థులు వివరించారు. గుండ్లకమ్మ ప్రాజెక్టు నిర్వాసిత ప్రాంతం గ్రామస్థుల సమస్యలపై తక్షణమే స్పందించిన జేసీ ప్రఖర్‌జైన్ ప్రాజెక్టు ఎస్‌డీసీని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలపై కదలిక రావడం పట్ల తిమ్మారెడ్డిపాలెం గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. జేసీ ప్రఖర్‌జైన్ కలిసిన వారిలో చందలూరి రామాంజనేయులు, బత్తుల సుబ్బారావు, అంజయ్య ఇతర గ్రామస్థులు ఉన్నారు

మల్లేశ్వరస్వామి భూములు అన్యాక్రాంతం



దేవదాయ భూమిని ఆక్రమించి డెయిరీ ఫాం కోసం షెడ్ వేసిన ఆక్రమణదారుడు

- పెదయిర్లపాడులో ప్లాట్లు వేసిన ఆక్రమణదారులు
- నిమ్జ్, రిలయన్స్ కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ రాకతో ఖాళీ స్థలాలకు డిమాండ్
- రెచ్చిపోతున్న అక్రమార్కులు

పీసీపల్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఓవైపు నిమ్జ్, మరోవైపు రిలయన్స్ కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్‌లు వస్తున్న తరుణంలో పెదయిర్లపాడు ప్రాంతంలో భూ ఆక్రమణదారులు తెగబడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భూములనే కాకుండా దేవదాయ భూములను సైతం ఆక్రమించి ప్లాట్లు వేసి సొమ్ము చేసుకుంటున్నారు. అడిగేవారు లేకపోవడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. మండలంలోని పెదయిర్లపాడు గ్రామంలో శ్రీకృష్ణదేవరాయల కాలంనాటి మల్లేశ్వర స్వామి ఆలయం ఉంది. పొన్నలూరు మండలం చెరుకూరు, లింగసముద్రం మండలం మొగిలిచర్ల, వివిధ ప్రాంతాలలో 120 ఎకరాల భూములను పలువురు దాతలు మల్లేశ్వరస్వామి ఆలయానికి ఇచ్చారు. ఈ భూముల నుంచి వచ్చే కౌలుతో స్వామికి ధూపదీప నైవేద్యాలకు అయ్యే ఖర్చులకు వినియోగించేవారు.

ఈ ఆలయాన్ని 1970లో దేవదాయ, ధర్మాదాయ శాఖలో చేర్చారు. ఈక్రమంలో దాతలు ఇచ్చిన భూములతో పాటు అర్చకులకు చెందిన ఈనాం భూములను సైతం స్వామికి ఇచ్చారు. 1977లో వచ్చిన తుఫాన్‌కి మల్లేశ్వరస్వామి ఆలయ ధ్వజస్తంభం విరిగిపడింది. అప్పటినుంచి 2010వరకు ఆలయం మూతబడి ధూప దీప నైవేద్యాలకు నోచుకోలేదు. ఆలయ ప్రాంగణం మొత్తం పిచ్చిమొక్కలు పెరిగి మూసుకుపోయింది. ఈ ఆలయాన్ని 1515వ సంవత్సరంలో పలుకూరి వంశస్థులు నిర్మించారు. 2010వ సంవత్సరంలో పలుకూరి వంశీయులలో ఒకరైన సుబ్బారావు దాతల సహకారంతో ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేసి ధూపదీప నైవేద్యాలను నిర్వహిస్తూ ఉత్సవాలు నిర్వహిస్తూ వచ్చారు. అప్పటివరకు పలు ప్రాంతాల్లో అన్యాక్రాంతమైన భూములను అధికారుల సహాయంతో తిరిగి దేవస్థానానికి చెందేటట్లు చేశారు.



సర్వేనెంబరు 133లోని దేవదాయ భూమి

ఆక్రమణలో ఉన్న భూముల సర్వే నంబర్లు

మల్లేశ్వరస్వామి ఆలయం ఉన్న పెదయిర్లపాడు గ్రామంలో సర్వే నెంబరు 133లో 15.35ఎకరాలు, సర్వేనెంబరు 840లో 3.58ఎకరాల భూములు ఆలయానికి చెందినవి ఉన్నాయి. ఈ భూములను కొంత మంది ఆక్రమంచారు. సర్వేనెంబరు 133 భూమిలో సుమారు 1.25 ఎకరాలను ఓ వ్యక్తి ఆక్రమించి ప్లాట్లు వేశారు. సర్వే నెంబరు 840లో ఉన్న భూమిని ఓవ్యక్తి ఆక్రమించి డెయిరీ ఫాం కోసం షెడ్‌ను నిర్మించాడు. సంబంధిత అధికారులకు తెలిసినా పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దేవదాయ భూములను అక్రమార్కుల చెర నుంచి విడిపించి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

దేవదాయ భూములను కాపాడతాం

పెదయిర్లపాడులో మల్లేశ్వరస్వామి ఆలయ భూముల ఆక్రమణ విషయంపై దేవదాయశాఖ ఈవో కొండారెడ్డిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా సర్వేనెంబరు 133, 840లో కొంతభూమి ఆక్రమణకు గురైన విషయం వాస్తవమేనని చెప్పారు. తమకు తెలిసిన వెంటనే ఆక్రమణదారులను ప్రశ్నించగా సరైన సమాధానాలు రాలేదన్నారు. వెంటనే రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. దేవదాయ భూములను ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆక్రమణదారులపై పోలీసులకు ఫిర్యాదుచేసి భూములను స్వాధీనం చేసుకుంటామని ఆయన చెప్పారు.

లక్ష్యాల మేరకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలి

జిల్లాకు 1,305 యూనిట్లు మంజూరు

- ఎస్సీ నిరుద్యోగ యువత ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట
- కలెక్టర్ తమీమ్‌అన్సారియా ఆదేశం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి పథకాల కింద ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం సబ్సిడీ రుణాలు ఇచ్చేందుకు శ్రీకారం చుట్టిందని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా చెప్పారు. అందుకోసం బ్యాంకులకు కేటాయించిన లక్ష్యాల మేరకు రుణాలు మంజూరు చేయాలన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎస్సీ కార్పొరేషన్ కార్యాచరణ ప్రణాళిక 2025-26 కింద ఓబీఎంఎంఎస్ స్వయం ఉపాధి పథకాల అమలుపై మంగళవారం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన వ్యక్తులకు స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు కార్యాచరణ ప్రణాళికను ప్రభుత్వం రూపొందించిందన్నారు. రూ.54.60 కోట్లతో జిల్లాకు 1,305 యూనిట్లు మంజూరు కాగా అందులో రూ.21.58 కోట్లు సబ్సిడీ కాగా రూ.30.29 కోట్లు బ్యాంకు రుణాలు ఇస్తాయని చెప్పారు. మిగిలిన మొత్తం లబ్ధిదారులు కట్టాల్సి ఉంటుందన్నారు. అర్హత కలిగిన ఎస్సీ లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేస్తూ బ్యాంకులకు కేటాయించిన రుణాల మంజూరును సకాలంలో పూర్తి చేయాలన్నారు.

వచ్చే నెల 13లోపు గడువు

ఈనెల 14 నుంచి వచ్చేనెల 13వ తేదీ వరకు నెల రోజుల పాటు ఆన్‌లైన్‌లో అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, ఎల్‌డీఎం రమేష్, బ్యాంకు అధికారులు ఉన్నారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

వైభవంగా రంగనాయకస్వామికి చక్రస్నానం

జేపీ చెరువులో గ్రామోత్సవం

గిద్దలూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): శ్రీనెమలిగుండ్ల రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా చివరి రోజు మంగళవారం స్వామి వారి చక్రస్నాన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలకు నెమలి గుండంలో భక్తిశ్రద్ధలతో శాస్త్రోక్తంగా చక్రస్నాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి నెమలిగుండంలోని నీటిలోకి దిగి స్వామి వారి చక్రస్నాన కార్యక్రమంలో పాల్గొన్నారు. జనసేన ఇన్‌చార్జి బెల్లంకొండ సాయిబాబు, బీజేపీ నాయకులు పిడతల రమేష్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షులు కె.యోగానంద్, కాపు జేఏసీ నాయకులు దుత్తా బాలీశ్వరయ్య, దేవస్థాన కమిటీ ప్రతినిధులతోపాటు ఈవో నాగయ్యలు చక్రస్నాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా స్వామి వారి ఉత్సవ విగ్రహాలను తిరిగి జేపీ చెరువు గ్రామానికి తీసుకుని వచ్చి విద్యుత్ దీపాకరణల మధ్య గ్రామంలో వైభవంగా స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు.

శేష వాహనంపై చెన్నయ్య నగరోత్సవం

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 15 ఆంధ్రజ్యోతి: మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం చెన్నకేశవస్వామి శేష వాహనంపై కాళీయామర్ధన అలంకారణలో భక్తులకు దర్శనమిచ్చారు. శేషవాహనం దాస్య భక్తికి నిదర్శనమని ఆ భక్తితో పశుత్వం కరిగి, మానవత్వం, ఆపై దైవత్వం పరమపదం సిద్ధిస్తాయని ఆలయ అర్చకులు అప్పనాచార్యులు తెలిపారు. ఆ సందేశాన్ని భక్తులకు అందించడానికే శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఎడమ చేతిలో నాగాస్త్రం ధరించి దర్శనం ఇస్తారన్నారు. ఉభయ దాతలుగా ఉదయం జటప్రోలు దక్షిణామూర్తి శర్మ, రాత్రి గానుగపెంట కూర్మయ వంశస్తులు వ్యవహరించారు. ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

నేడు వ్యాలి వాహనం

బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీలక్ష్మీ చెన్నకేశవుడు బుధవారం రాత్రి వ్యాలివాహనంపై వామన అలంకారంలో నాలుగు మాడ వీధులలో విహరించనున్నారు.



ప్రత్యేక అలంకరణలో నెమలిగుండ్ల రంగనాయకస్వామి

ఒకరోజు ఆలస్యంగా నీటి సరఫరా


పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న కార్మికులు

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ సమీపంలోని ఐడీఎస్ఎంటీ స్థలాల్లో తాగునీటి పైపులైనుకు భారీ లీకు ఏర్పడింది. దీంతో మరమ్మతుల దృష్ట్యా నగరంలో ఒకరోజు ఆలస్యంగా నీటి సరఫరా జరుగుతుందని కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు మంగళవారం వెల్లడించారు. రెండవ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నుంచి హిల్‌టవర్ సమీపంలోని ఓవర్ హెడ్ ట్యాంకుకు నీటి సరఫరా జరిగే పైపులైను కావడంతో లీకు వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. సమస్య పరిష్కారానికి ఒకరోజు పడుతున్నందున హిల్‌లాక్ ఓహెచ్‌టీ నుంచి పలు కాలనీలకు అందించే నీరు ఆలస్యం అవుతుందని తెలిపారు.

వలస కుటుంబాల ఆరోగ్యంపై ఆరా


వివరాలను తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

కొత్తపట్నం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లూరు ఆర్‌ఆర్‌కాలనీలో నివాసం ఉంటున్న 10 వలస కుటుంబాల ఆరోగ్య పరిస్థితులపై డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్లు ఆరా తీశారు. మంగళవారం ఆయన ఆర్‌ఆర్‌కాలనీని కొత్తపట్నం పీహెచ్‌సీ సిబ్బందితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఆరోగ్య సిబ్బంది నిర్వహించిన వైద్య పరీక్షల ఫలితాలను అడిగి తెలుసుకున్నారు. రక్తహీనత వంటి వాటిని నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఎస్టీ కుటుంబ సభ్యులతో ఆయన మాట్లాడారు. తరచూ వైద్య పరీక్షలు చేయించుకుంటూ ఆరోగ్యంగా ఉండలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీపీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రావణ్ పాల్గొన్నారు.

క్విస్ అధినేతకు పోస్ట్ డాక్టోరియల్ ఫెలోషిప్


ఫెలోషిప్‌ను అందుకుంటున్న సూర్యకల్యాణచక్రవర్తి

ఒంగోలువిద్య, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న ఒంగోలులోని క్విస్ విద్యాసంస్థల అధినేత నిడమానూరి సూర్యకళ్యాణ్‌చక్రవర్తి మరో ఘనత సాధించారు. ఆయన అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందారు. మలేషియా కౌలాలంపూర్‌లోని టాప్ యూనివర్శిటీ అయిన యూసీఎస్‌ఐ విశ్వవిద్యాలయం నుంచి పోస్ట్ డాక్టోరియల్ ఫెలోషిప్(పీడీఎఫ్) అందుకున్నారు. అంతర్జాతీయ పరిశోధన, నిర్వహణలో కంప్యూటర్ సైన్స్, డిజిటల్ ఇన్నోవేషన్ సహకారం అనేది ఒక ముఖ్యమైన మైలు రాయి అనే అంశంపై కళ్యాణ్‌చక్రవర్తి రీసెర్చ్ చేసినందుకు గాను పీడీఎఫ్ అందించారు. కౌలాలంపూర్‌లో ఈనెల 12న జరిగిన కార్యక్రమంలో యూనివర్శిటీ డిప్యూటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ దాతుక్ టీఎస్ డాక్టర్ రోహిన్ బింటి యూసఫ్ ఈ సర్టిఫికెట్‌ను సూర్యకల్యాణచక్రవర్తికి అందజేశారు. ఉన్నత సాంకేతిక విద్యను అందించడంలో ఆయన చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ డిజిటల్ ఇన్నోవేషన్ డైరెక్టర్ డాక్టర్ రాయాన్, క్విస్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ జాఫర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక కళాశాలలో సూర్యకళ్యాణచక్రవర్తిని క్విస్ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ డాక్టర్ శ్రీగాయత్రి, ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావు, క్విస్‌ఫార్మసీ ప్రిన్సిపాల్ కిషోర్‌బాబు, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేషన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఒంగోలు నగరపాలక సంస్థ కార్మికులు డిమాండ్ చేశారు. ఏపీ మునిసిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ చనిపోయిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని తెలిపారు. అలాగే 60 సంవత్సరాలు వయస్సు నిండిన విధుల నుంచి తొలగించిన వారి కుటుంబాల్లో వారికి కార్మికుడుగా అవకాశం కల్పించాలన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్‌లు పరిష్కరించకుంటే సమ్మెబాట పట్టాల్సి వస్తుందన్నారు. కార్మికురాలు టి.విజయమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నరసింహం, రత్నకుమారి, రామారావు, నాగేశ్వరరావు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి

మద్దిపాడు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీడీ వెంకటస్వామి కోరారు. మంగళవారం మద్దిపాడులో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి పని దినాలు పెంచిందని, ఆసక్తి కలిగిన వారు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వైసీపీ మండల వైస్ ప్రెసిడెంట్‌గా బాలచంద్రమౌళి

మద్దిపాడు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల వైస్‌ప్రెసిడెంట్‌గా సీతారాంపురం గ్రామానికి చెందిన మండవ బాలచంద్రమౌళి ఎన్నికయ్యారు. అలాగే ఇనమనమెళ్లూరు ఎంపీటీసీ వాక కోటిరెడ్డి జనరల్ సెక్రటరీగా, ఏడుగుండ్లపాడుకు చెందిన వల్లంరెడ్డి బాలాంజనేయరెడ్డి, ఎస్‌కేమస్తాన్‌వలి, నాదెండ్ల మహేష్‌లు సెక్రటరీలుగా, వేమిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పిట్టల ఆంజనేయులు, పైడిపాటి వెంకట్రావు మద్దినేని శ్రీకాంత్, కన్నెబోయిన వెంకటాద్రి తదితరులు ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మాజీ మంత్రి మేరుగ నాగార్జున మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు విజయదశమి నాటక ప్రదర్శన

ఒంగోలు కల్చరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా బుధవారం సాయంత్రం 7 గంటలకు కళా ప్రకాశం ఆధ్వర్యంలో విజయదశమి పద్య నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి జి.వెంకట్రామయ్య తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం స్థానిక సీవీఎన్ రీడింగ్ రూము ఆవరణలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బుధవారం సాయంత్రం 7 గంటల నుంచి సీవీఎన్ రీడింగ్ రూము గంజాం శేషగిరిరావు కళాప్రాంగణంలో నాటక ప్రదర్శన ఉంటుందని, కనుక నాటక రంగ అభిమానులు, కళాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ధేనువకొండ సుబ్బయ్య, బాబూరావు, జి.సుబ్బారావు, పొదిలి బాలగురవయ్య, బ్రహ్మయ్య, జి.శ్రీనివాసరెడ్డి, పిచ్చయ్యపంతులు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి


ఒంగోలులో మంటలార్పడంపై అవగాహన కల్పిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి


కొండపిలో కరపత్రాలను అందజేస్తున్న ఫైర్ సిబ్బంది

- అగ్నిమాపకశాఖ జిల్లా అధికారి శ్రీకాంత్‌రెడ్డి

ఒంగోలు క్రైం,ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): షాపింగ్‌మాల్స్, ముఖ్యమైన ప్రాంతాలలో అగ్నిప్రమాదాల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి కె.శ్రీకాంత్‌రెడ్డి కోరారు. మంగళవారం ఒంగోలులోని ఆర్టీసీ బస్టాండ్ గ్యారేజీలో సిబ్బందికి అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా అగ్నిమాపక సిబ్బంది అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ బస్సు డిపోల్లోని గ్యారేజీలలో కరెంటు ప్రమాదాలు జరగకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం షాపింగ్‌మాల్స్, రైల్వేస్టేషన్‌లో అగ్నిప్రమాదాల నివారణ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సహాయ అధికారి వి.శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

కొండపి: ప్రజలు అగ్నిప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని కొండపి ఫైర్ అధికారి వెంకటరావు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక బస్టాండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అగ్నిప్రమాదాలకు కారణాలు, వెంటనే అదుపులోకి తెచ్చేందుకు తీసుకోవాల్సిన చర్యలను ప్రయాణికులకు, స్థానికులకు వివరించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను గుర్తించాలి

- ఎంపీడీవో రామాంజనేయులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామాంజనేయులు

కొండపి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని బడిఈడు పిల్ల లను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని ఎంపీడీవో రామాంజనేయులు సూచించారు. స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌పై ఆయన స్థానిక ఎంఈవో కార్యాలయంలో హెచ్‌ఎంలు, ఐసీడీఎస్, సచివాలయ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బుధవారం నుంచి ఈనెల 19వ తేదీ వరకు ప్రతి గ్రామంలో ఇంటింటికీ తిరిగి బడికి రాని పిల్లలను గుర్తించాలన్నారు. వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి బడిలో చేర్చేవిధంగా చూడాలన్నారు. సమావేశంలో ఎంఈవోలు కె.సురేఖ, పి.రామారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విక్టోరియారాణి పాల్గొన్నారు.

జరుగుమల్లిలో...

బంగారు బాల్యం కార్యక్రమాన్ని అధికారులు విజయవంతంగా నిర్వహించాలని ఎంఈవో బి.నాగేంద్రవదన్ అన్నారు. మంగళవారం జరుగుమల్లిలోని ఎంఈవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బడిఈడు పిల్లలు బడికి వెళ్లే విధంగా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదు సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరినీ ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలన్నారు. ఎంపీడీవో రమణమూర్తి, ఎంఈవో-2 డి.శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు భారతి, జ్యోతి పాల్గొన్నారు.

ఉగాది పురస్కార గ్రహీతలకు ఘన సత్కారం

- హాజరైన మేయర్ సుజాత, సాహితీవేత్తలు


అరుణను సన్మానిస్తున్న మేయర్ సుజాత, పలువురు ప్రముఖులు

ఒంగోలు కల్చరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నుంచి విశ్వావసు ఉగాది పురస్కారాలను అందుకున్న సాహితీవేత్తలను మంగళవారం పలు సాహిత్యసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి నగర మేయర్ గంగాడ సుజాత ముఖ్యఅతిథిగా హాజరు కాగా డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ సభాధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సాహిత్యంలో ఉగాది పురస్కార గ్రహీతలు నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ, కళామిత్ర మండలి జాతీయ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మేయర్ సుజాత మాట్లాడుతూ ప్రకాశం జిల్లా సాహితీవేత్తలకు పుట్టినిల్లని, ఎన్నో సంవత్సరాల నుంచి సాహిత్యరంగంలో కృషి చేస్తున్న తేళ్ల అరుణ, నూనె అంకమ్మరావులకు ఉగాది పురస్కారం లభించటం ఆనందదాయకమని చెప్పారు. ప్రజా నాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) మాట్లాడుతూ సాహిత్యం, కళలను ప్రభుత్వాలు ప్రోత్సహించినప్పుడే అవి భావితరాలకు అందుతాయని, ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారాలను అందజేయటం వాటికి తేళ్ల అరుణ, నూనె అంకమ్మరావులు ఎంపిక కావటం హర్షణీయమని చెప్పారు. తమను ఉగాది పురస్కారానికి ఎంపిక చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్, పురస్కార కమిటీ చైర్మన్ మండలి బుద్ధప్రసాద్ తదితరులకు అరుణ, అంకమ్మరావులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు పాల్గొన్నారు.

సర్వే నెం.15/1లో ఆక్రమణలు జరగలేదు..!

- ముక్తినూతలపాడు రైతుల వెల్లడి

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు రూరల్ పరిధిలోని ముక్తినూతపాడు సర్వే నెం.15/1 భూమిలో ఎలాంటి ఆక్రమణలు జరగలేదని స్థానిక రైతులు తెలిపారు. మంగళవారం ముక్తినూతలపాడులోని పొలం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. సర్వే నెం.15/1లో విభజించి 5.10ఎకరాలు, అలాగే 4.40ఎకరాలు, 12.30ఎకరాలు మొత్తం 21.80 ఎకరాల భూమి 1927 సంవత్సంలో సబ్ డివిజన్ చేయబడినట్లు తెలిపారు. కాగా ఆ భూమిలోని 5.10 ఎకరాలు పోలీసు డిపార్ట్‌మెంట్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ అబ్దుల్‌ఖాదర్ సాహెబ్ 1927 డిసెంబరు 11న పట్టా పొందారని, ఆ తర్వాత ఆయన సంపూర్ణ హక్కులతో ఉన్న భూమికి ఎలాంటి రాతపూర్వక వ్యవహారాలు జరగకపోవడంతో ఆయన వారసులు 1945లో పంపిణీ చేసుకుని సూదనగుంట వెంకటసుబ్బయ్యకు విక్రయించారని చెప్పారు. ఆ తర్వాత సూదనగుంట వెంకటసుబ్బయ్య సోదరులు రత్తయ్య, అంకమ్మ, నాగభూషణం, చెంచురామయ్య, వెంకటేశ్వర్లు, భాగం పంపిణీ చేసుకున్నట్లు వివరించారు. ప్రస్తుతం కంచెవేసిన భూమిలో ఎలాంటి ఆక్రమణలు జరగలేదని, రైతుల స్వాధీనంలో ఉన్నదని వివరించారు. సమావేశంలో రైతులు సూదనగుంట శేషయ్య, కోటేశ్వరరావు, మురళీకృష్ణ, రాఘవయ్య, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ విద్యార్థులను ప్రభుత్వ స్కూళ్లలో చేర్చాలి

- ఎంపీడీవో మహాలక్ష్మి


మాట్లాడుతున్న ఎంపీడీవో మహాలక్ష్మి

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న ఐదేళ్లు నిండిన విద్యార్థులును విధిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా సంబంధిత అధికారులు కృషి చేయాలని ఎంపీడీవో వై.మహాలక్ష్మి సూచించారు. మంగళవారం నాగులుప్పలపాడు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. అంగన్‌వాడీ విద్యార్థులు నూరు శాతం ప్రభుత్వ స్కూళ్లలో చేరేలా చూడాలని, బంగారుబాల్యం పటిష్ఠంగా అమలు చేయాలని చెప్పారు. బడిఈడు పిల్లలు పాఠశాలల్లో ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో లు తిరుమలశెట్టి రవి, రమణయ్య, సూపర్‌వైజర్లు ఉష, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ సిబ్బందితో ఎంపీడీవో సమావేశం నిర్వహించారు.

జిల్లా నటులకు పురస్కారాలు


మల్లిఖార్జునరావు

ఒంగోలు కల్చరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2025 సంవత్సరానికి ప్రకటించిన జిల్లా స్థాయి కందుకూరి విశిష్ట పురస్కారానికి జిల్లాకు చెందిన ముగ్గురు రంగస్థల నటులు ఎంపికయ్యారు. ఒంగోలుకు చెందిన మిడసల మల్లిఖార్జునరావు, అంబడిపూడి శివప్రసాద్, కొప్పోలుకు చెందిన ఉన్నం వెంకటశేషయ్యలు ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. వీరికి రూ.10వేల నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేయనున్నారు. కాగా రాష్ట్ర ప్రభుత్వ పురస్కారానికి ఎంపికైన నటులకు పలువురు రంగస్థల నటులు అభినందనలు తెలిపారు.

రైతులను నట్టేట ముంచుతున్న ప్రభుత్వం

- వైసీపీ ఒంగోలు ఇన్‌చార్జి రవిబాబు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులను నట్టేట ముంచిందని వైసీపీ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ చార్జి చుండూరి రవిబాబు ఆరోపించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొగాకు, మిర్చి రైతులకు తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. గిట్టుబాటు ధరలు అందక రైతులు అల్లాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

అలరించిన అన్నమయ్య సంగీత విభావరి


గానం చేస్తున్న మురళీకృష్ణ, సాయిలహరి

ఒంగోలు కల్చరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక కేశవస్వామిపేటలోని శ్రీప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి నిర్వహించిన అన్నమయ్య సంకీర్తనా విభావరి భక్తులను విశేషంగా అలరించింది. అన్నమయ్య సాహిత్య సాంస్కృతిక సేవాసమితి అధ్యక్షులు ఐ.మురళీకృష్ణ, సాయిలహరి ఈ సందర్భంగా పలు అన్నమాచార్య సంకీర్తనలను రసరమ్యంగా ఆలపించి భక్తుల కరతాళధ్వనులందుకున్నారు. వారికి తబలాపై నల్లమల్లి పాండురంగనాథం, కీబోర్డుపై ఎస్‌కే.బాబులు వాద్య సహకారాన్ని అందజేశారు. కాగా వారిని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆర్.శివశంకర్ ఘనంగా సత్కరించారు.

మోటార్‌సైక్లిస్టుకు గాయాలు

మద్దిపాడు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ఏడుగుండ్లపాడు సమీపంలో మంగళవారం మోటార్‌సైకిల్ అదుపుతప్పి యువకునికి గాయాలయ్యాయి. ఒంగోలు నుంచి మేదరమెట్ల వెళుతున్న మోటార్‌సైకిల్‌కు ఒక్కసారిగా కుక్క అడ్డురావడంతో అదుపుతప్పగా ఒంగోలుకు చెందిన పరమేశ్వరరావు గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

పోరుమామిళ్లపల్లిలో భారీ చోరీ

కంభం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కంభం మండలం పోరుమామిళ్లపల్లిలో మంగళవారం చోరీ జరిగింది. గ్రామానికి చెందిన ఎం.చంద్రశేఖర్ ప్రైవేటు స్కూలులో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నాడు. భార్య సాయిలక్ష్మి ట్యూషన్ చెబుతోంది. మంగళవారం వారు గిద్దలూరు వెళ్లారు. దీంతో దొంగలు ఇంటికి వేసిన తాళం పగులగొట్టి 7 తులాల బంగారం, రూ.2లక్షల నగదు, 300 గ్రాముల వెండిని చోరీ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బేల్దారి మేస్త్రీపై కత్తితో దొంగ దాడి

- చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు

ఒంగోలు క్రైం,ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): బేల్దారి మేస్త్రీపై కత్తితో దాడికి దిగిన దొంగను పట్టుకొని అరెస్టు చేసినట్లు ఒంగోలు తాలుకా సీఐ అజయ్‌కుమార్ మంగళవారం తెలిపారు. సోమవారం ఉదయం త్రోవగుంటకు చెందిన బేల్దారి మేస్త్రీ బొంతా సుధాకర్ వాకింగ్‌కు వెళ్లారు. ఒంగోలు మార్కెట్ యార్డు సమీపంలో ఓ వ్యక్తి కత్తితో బెదిరించి అతని సెల్‌ఫోన్ లాక్కున్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా దొంగను అదుపులోకి తీసుకొని విచారించగా ఆకవీడుకు చెందిన బండి సురేష్‌గా గుర్తించారు. సురేష్ మోటార్‌సైకిల్ తిరుగుతూ పలు చోరీలకు పాల్పడుతుంటాడు. నిందితుడిపై ఇప్పటికే 19 దొంగతనం కేసులు ఉన్నట్లు సీఐ తెలిపారు. ఈమేరకు కోర్టుకు హాజరుపరచగా న్యాయాధికారి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఆయన చెప్పారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ వర్షిణి, అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని వాణిజ్య పన్నుల కార్యాలయం-1లో మంగళవారం డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పైనం మల్లికార్జునరావు ఆధ్వర్యంలో అసిస్టెంట్ కమిషనర్లు కె.వర్షిణీ, సోమసుందర్‌ప్రసాద్‌లు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు అంబేడ్కర్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీసీటీవో సుబ్బారావు, అహ్మద్‌బాషా, ప్రసన్న కుమార్‌రెడ్డి, రవికుమార్, వంశీ, మల్లేశ్వరరావు, పురుషోత్తం, యూవీ.సుబ్బారావు, సరోజినీదేవి, అంజమ్మ, పెద్దామ్మాయి, కిషోర్, వెంకటరెడ్డి, షరీఫ్, తోట ప్రసాద్, వెంకటేష్, సిరిగిరి శ్రీను. ప్రియాంక, వనలత తదితరులు పాల్గొన్నారు.

రైజ్ విద్యార్థులకు ఉద్యోగాలు


ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కళాశాల నిర్వాహకులు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రైజ్ ఇంజనీరింగ్ కళాశాలలో మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ కంపెనీ వారు మంగళవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఏడుగురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కంపెనీ ప్రతినిధులు విద్యార్థులకు మొదటగా రాతపరీక్ష, టెక్నికల్ రౌండ్ ముగిశాక ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రతిభ చాటిన వారిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. సాఫ్ట్‌వేర్ ట్రైనీలుగా ఎంపికైనా వారికి రూ.3.40 లక్షల వార్షిక వేతనం లభిస్తుంది. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రటరీ శిద్దా హనుమంతరావు, గౌరవ చైర్మన్ ఇస్కాల చినరంగమన్నార్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎన్‌వీ.రఘుబాబు, ట్రెజరర్ శిద్దా భరత్, రాగా చీఫ్ అడ్వయిజర్ ప్రవల్లిక, డైరెక్టర్ ఏవీ.భాస్కరరావు, ప్రిన్సిపాల్ కేవీ.సుబ్రహ్మణ్యంలు అభినందించారు.

విద్యార్థుల విజ్ఞానయాత్ర

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని సాయిబాబా సెంట్రల్ స్కూలు పదో తరగతి విద్యార్థులు మంగళవారం సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్ (శ్రీహరికోట)ను విజ్ఞానయాత్రలో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాకెట్ల తయారీ ప్రక్రియ, ప్రయోగశాల నిర్వహణ, ఉపగ్రహాలు వంటి అంశాలను ప్రత్యక్షంగా చూసే అవకాశాన్ని పొందారు. శాస్త్రవేత్తలు విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. పాఠశాల అకడమిక్ డైరెక్టర్ సాయినాధుని శృతి మాట్లాడుతూ ఇలాంటి యాత్రల వల్ల విద్యార్థులు శాస్త్రీయ దృష్టిని పెంపొందించుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ జీవీ.భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

21 నుంచి ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్


మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్‌బాబు

సంతనూతలపాడు, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించాలని ఎంపీడీవో డి.సురేష్‌బాబు తెలిపారు. మంగళవారం సంతనూతలపాడు మండలపరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాసంవత్సరం చివరి పనిదినాల్లో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు. 5 సంవత్సరాలు నిండిన బాలబాలికలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా చూడాలని, డ్రాపౌట్ విద్యార్థులను గుర్తించాలని, ఇందుకోసం ప్రతి గ్రామంలో ర్యాలీలు నిర్వహించాలని చెప్పారు. మండల ప్రత్యేక అధికారి బి.చిరంజీవి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నమోదైన ప్రతీ విద్యార్థి పైతరగతులు కొనసాగేలా చూడాలన్నారు. పోషణ్ పక్వాడాను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకారెడ్డి, ఏపీఎం బాబూరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రోడ్ల ఆక్రమణలను తొలగించాలి

- ఎంపీడీవో రాజశేఖర్‌రావు


మాట్లాడుతున్న ఎంపీడీవో రాజశేఖర్‌రావు

ఒంగోలు(రూరల్), ఏప్రిల్15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో ఎక్కడైనా రోడ్ల ఆక్రమణలు ఉంటే వెంటనే వాటిని తొలగించాలని ఎంపీడీవో కె.రాజశేఖర్‌రావు ఆదేశించారు. మంగళవారం ఒంగోలు మండల పరిషత్ సమావేశ భవనంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో రోడ్లు పంచాయతీ నిబంధనలకు అనుగుణంగా ఉండాలని చెప్పారు. రోడ్లను ఆక్రమించి కట్టడాలు నిర్మించేవారికి పంచాయతీ కార్యదర్శులు ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. ముఖ్యంగా రోడ్లపై నిర్మించిన ప్రహరీలు, మెట్లు ఉంటే వాటిని తొలగించాలని ఆదేశించారు. ఇళ్ల పన్నులు నూరుశాతం వసూలు చేసి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ ఎ.బాలచెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

మద్దిపాడు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని ఎంపీడీవో డీవీఎస్.ప్రసాద్ అన్నారు. మంగళవారం మద్దిపాడు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన పోషణ్ పక్వాడా సదస్సులో అంగన్‌వాడీ వర్కర్లకు ఆరోగ్యకరమైన తినుబండారాలను తయారు, వాటిని నిల్వ చేసే విధానంపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు ఎంవీఆర్.ఆంజనేయులు, మెడబలిమి శ్రీనివాసరావులు మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను పౌష్టికాహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ సృజన్‌కుమార్, ఏపీఎం సుబ్బారావు, సీహెచ్.లలితమ్మ, సూపర్‌వైజర్లు జయలక్ష్మి, నాగరాజు, పద్మావతి, వర్కర్లు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్‌కు పది రోజుల జైలు

మద్దిపాడు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మద్యమత్తులో లారీని నడిపిన డ్రైవర్‌కు కోర్టు పది రోజుల జైలుశిక్ష విధించినట్లు మద్దిపాడు ఎస్‌ఐ శివరామయ్య మంగళవారం తెలిపారు. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన డ్రైవర్ మద్యం తాగి లారీని నిర్లక్ష్యంగా నడపడం గమనించిన ఎస్‌ఐ శివరామయ్య బ్రీత్ అనలైజర్ ద్వారా పరిశీలించగా 398 రీడింగ్ వచ్చింది. దీంతో సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా పది రోజులు జైలు శిక్ష విధించారు.

అవి.. ఇవి

గిన్నిస్‌బుక్‌లో నమోదు ప్రదర్శనకు ప్రాతినిధ్యం



ధ్రువీకరణ పత్రాలు అందుకుంటున్న జయపాల్, సంపత్‌కుమార్

గిద్దలూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో జరిగిన మ్యూజిక్ ప్రదర్శనలో గిద్దలూరుకు చెందిన జయపాల్, సంపత్‌కుమార్ ప్రతిభ కనపరచి గిన్నీస్ వరల్డ్ రికార్డ్స్‌లో తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఆన్‌లైన్ మ్యూజిక్ ప్రదర్శనలో 1046 మంది పాల్గొనగా గంట సమయంలో కీబోర్డు ద్వారా ప్రతిభ కనపరిచే కార్యక్రమాన్ని గిన్నీస్ వరల్డ్ రికార్డు ప్రతినిధులు పోటీ నిర్వహించారు. ఈ పోటీలో గిద్దలూరుకు చెందిన కె.జయపాల్, కెఎస్‌పల్లికి చెందిన ఉపాధ్యాయుడు సంపత్‌కుమార్‌లు టీంగా ఏర్పడి కీబోర్డు వాయించి ప్రతిభ కనపరిచారు. దాంతో వీరిరువురికి గిన్నీస్‌బుక్‌లో చోటు కల్పిస్తూ గిన్నీస్ ప్రతినిధి వీరికి ధ్రువీకరణపత్రాలు, పతకాలు అందజేశారు.

టీడీపీ నూతన కార్యాలయం ప్రారంభం



టీడీపీ కార్యాలయానికి ప్రారంభిస్తున్న ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం రూరల్ ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మురారిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన టీడీపీ కార్యాలయాన్ని ఆ పార్టీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు ప్రారంభించారు. గ్రామంలో వెలసిన గంగమ్మతల్లి తిరునాళ్ల సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా ఎరిక్షన్‌బాబు హాజరయ్యారు. ముందుగా గంగమ్మతల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పార్టీ విద్యుత్ ప్రభలలో పాల్గొని మాట్లాడారు. ఆయా కార్యక్రమాలలో మండల అధ్యక్షుడు చేకూరి సుబ్బారావు, మురారిపల్లి నాయకులు మేడగం సుబ్బారెడ్డి, మారం నారాయణరెడ్డి, బాష్యం లక్ష్మీరెడ్డి, ఆవుల రామలింగారెడ్డి, పోతిరెడ్డి అంజిరెడ్డి, యంసిహెచ్ మంత్రునాయక్, వెంగళరెడ్డి పాల్గొన్నారు.

ఐఐటీ, ఒలింపియాడ్‌లో సాయి బాలాజీ విద్యార్థుల ప్రతిభ



బహుమతులు పొందిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ సాయి బాలాజీ ఉన్నత పాఠశాల విద్యార్థులు గుంటూరులో జరిగిన ఇంటర్ స్టేట్ యాన్యువల్ అవార్డ్సులో ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా పాఠశాలలో మంగళవారం విద్యార్థులను అభినందించి ప్రిన్సిపాల్ సయ్యద్ మస్తాన్‌వలి మాట్లాడుతూ.. 450 పాఠశాలలు 8700 మంది విద్యార్థులు ఆయా పోటీలలో పాల్గొనగా తమ పాఠశాల విద్యార్థులు 8 అవార్డులు సాధించారన్నారు. గణిత విభాగంలో శ్రీఖర్ రాష్ట్ర రెండో ర్యాంకు, అనూష మూడో ర్యాంకు, సైన్సులో అవినాష్ రాష్ట్ర మొదటి ర్యాంకు, సాయి ప్రణవి మూడో ర్యాంకు, తౌఫిక్ రెండో ర్యాంకు సాధించారన్నారు. రీజనింగ్ విభాగంలో సాదియా మూడు, అనూష మూడు, కెషాట్‌లో జశ్వంతిక, అనూషలు మొదటి ర్యాంకు సాధించారన్నారు. వీరందరికీ ఇస్రో సైంటిస్ట్ రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ లక్ష్మణ్ తన చేతుల మీదుగా బహుమతులు అందించారని తెలిపారు.

పశుగ్రాసానికి డిమాండ్

● వరిగడ్డి కట్ట రూ.220



ట్రాక్టర్‌పై తరలిస్తున్న వరిగడ్డి కట్టలు

కంభం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పశువుల మేతగా వినియోగించే వరిగడ్డికి పశ్చిమ ప్రకాశంలో డిమాండ్ ఏర్పడింది. ట్రాక్టర్ వరిగడ్డి ధర రూ.15వేల నుంచి రూ.17వేల వరకు పలుకుతోంది. గిద్దలూరు, మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గాలలో పంటలకు వర్షమే ఆధారం కావడంతో ఈ ప్రాంతంలో రైతులు అధికంగా మెట్టపైర్లనే సాగు చేస్తుంటారు. చీరాల, నంద్యాల, కర్నూలు, బాపట్ల ప్రాంతాలలో వరిసాగు చేసే రైతులు ఏటా ట్రాక్టర్లపై గడ్డిని తీసుకువచ్చి కంభం, బేస్తవారపేట, అర్ధవీడు, గిద్దలూరు, మార్కాపురం మండలాల్లో విక్రయిస్తుంటారు. ప్రస్తుతం ఒక్కో వరిగడ్డి కట్ట ధర 220 రూపాయలకు విక్రయిస్తున్నారు. ఎండలు ముదరడంతో వరిగడ్డికి డిమాండ్ పెరిగిందని రైతులు చెబుతున్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు

● కౌన్సెలింగ్ నిర్వహించిన సీఐ సుబ్బారావు



మైనర్లకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న సీఐ సుబ్బారావు

మార్కాపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మైనర్లు వాహనాలు నడిపితే కఠినచర్యలు తప్పవని మార్కాపురం సీఐ పి.సుబ్బారావు హెచ్చరించారు. పట్టణంలో మంగళవారం పోలీసులు అన్ని ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు నడుపుతున్న మైనర్లపై దృష్టిపెట్టారు. సుమారు 20 మంది వరకు మైనర్లు వాహనాలు నడుపుతూ పోలీసులకు దొరికారు. వారిని పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించారు. సీఐ సుబ్బారావు అక్కడ వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. మైనర్లు వాహనాలు నడపడంతో గతంలో పోల్చితే ఇప్పుడు ప్రమాదాలు పెరిగాయన్నారు. అంతేకాక ఎంతమంది యువకులు ప్రమాదాలకు బలవుతున్నారన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ వచ్చిన తర్వాతనే ఎవరైనా వాహనాలు నడపాలన్నారు. ప్రస్తుతం చట్టాలు అత్యంత కఠినంగా ఉన్నాయన్నారు. చట్టాలను అతిక్రమిస్తే సహించేదిలేదన్నారు. వాహనాలు నడిపిన మైనర్‌ల తల్లిదండ్రులను కూడా పిలిచి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సైలు ఎం.సైదుబాబు, రాజమోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

తర్లుపాడు, ఏప్రిల్ 15 ఆంధ్రజ్యోతి: మండలంలో ఎస్సీ కార్పొరేషన్‌కు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్ తెలిపారు. 21 నుంచి 50 ఏళ్ల లోపు వారు మే 13వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. డేట్ ఆఫ్ బర్త్, క్యాస్ట్, ఇన్‌కమ్, రేషన్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ

● అవగాహన సదస్సులో అగ్నిమాపక అధికారి రామకృష్ణ

● నివారణకు సూచనలిచ్చిన అధికారులు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 15 ఆంధ్రజ్యోతి: ప్రజలు అప్రమత్తతతో ఉంటే అగ్ని ప్రమాదాలు నివారించవచ్చని మార్కాపురం అగ్నిమాపక శాఖ అధికారి రామకృష్ణ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలు పురస్కరించుకుని స్థానిక సుందరయ్య కాలనీలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్లల్లో సంభవించే గ్యాస్ లీకేజీలు, వాటి నివారణ, వివిధ అగ్నిప్రమాదాల కారకాలు నివారణ ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ప్రజలతో నివారణ చర్యలు కూడా చేయించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



కంభం ఆర్టీసీ బస్టాండ్‌లో కరపత్రాలు అందజేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కంభం : కంభం అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా అగ్నిమాపక శాఖాధికారి పిచ్చయ్యచౌదరి కంభం ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు కరపత్రాలను పంపిణీ చేయడమేకాక అగ్ని ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : వేసవి ఎండల తీవ్రత పెరగడంతో ఉష్ణోగ్రతలు పెరిగి అగ్నిప్రమాదాలు సంభవించే ప్రమాదం పొంచి ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక కేంద్రం అధికారి మాల్యాద్రి తెలిపారు. ఎర్రగొండపాలెంలోని చైతన్య హైస్కూల్‌లో మంగళవారం అగ్నిప్రమాదాలు జరిగినపుడు, గ్యాస్ సిలెండరు నుంచి మంటలు వ్యాపించిన సమయంలో మంటలు అదుపుచేసే విధానంపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదం సంభవించిన వెంటనే అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ఆంజనేయులు, హెచ్‌ఎం ఈశ్వరీ, ఫైర్‌సిబ్బంది పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పెద్దదోర్నాల : అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి హరిబాబు అన్నారు. స్థానిక ఆర్‌టీసీ బస్టాండ్, సినిమా హాలు, సుందరయ్య కాలనీల్లో అగ్నిప్రమాదాల నివారణ, తీసుకోవాలసిన జాగ్రత్తలపై మంగళవారం ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల పట్ల మహిళలు పలు జాగ్రత్తలు పాటించాలన్నారు. వంటగదిలో కాటన్ చీరలు ధరించాలని వంటగదికి గాలి వెలుతురు వచ్చేలా చూసుకోవాలని, సిలెండరు నుంచి గ్యాస్ లీక్ కాకుండా జాగ్రత్త పడాలన్నారు. అనుకోని ప్రమాదం ఏర్పడినప్పుడు అగ్నిమాపక కేంద్రానికి వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. పలు సూచనలతో కూడిన కరపత్రాలు పంపిణీ చేశారు.



మార్కాపురంలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎస్సీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత

ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరుటౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎస్సీ కుటుంబాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చి పనిచేస్తోందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన 17 ఎస్సీ పొదుపు గ్రూపు మహిళలకు మంజూరైన రూ.21లక్షల రూపాయల రుణ చెక్కులను ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి అందజేశారు. కిరాణా, సెంట్రింగ్, దుస్తులు, టెంట్‌హౌస్, పెయింట్ షాపు, బియ్యం వ్యాపారం వంటి జీవనోపాధి కార్యక్రమాలకు ఈ రుణాలు మంజూరయ్యాయన్నారు. వీటి ద్వారా వ్యాపారం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మహిళలకు సూచించారు. 10 శాతం లబ్ధిదారుల వాటా ఉండగా ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ నుంచి రూ.50వేలు రాయితీ ఇస్తోందన్నారు. మిగిలిన మొత్తం వడ్డీ లేకుండా ఉన్నతి పథకం ద్వారా అందచేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ వెలుగు క్లస్టర్ ఏసీ లక్ష్మీరెడ్డి, మార్కెట్‌కమిటీ చైర్మన్ బైలడుగు బాలయ్య,



మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

కంభం జడ్పీటీసీ సభ్యుడు శ్రీను, మండల టీడీపీ అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు ముత్తుముల సంజీవరెడ్డి, బోనేని వెంకటేశ్వర్లు, వెలుగు ఏపీఎంలు పాల్గొన్నారు.

అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

గిద్దలూరుటౌన్ : వేసవి తీవ్రత దృష్ట్యా మండలాల్లో చలివేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, నీటిసమస్య లేకుండా జాగ్రత్తలు పాటించాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన కార్యాలయంలో నియోజకవర్గంలోని రెవెన్యూ, హౌసింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు వేసవి తాపం పెరుగుతుండడంతో మండల కేంద్రాలకు వచ్చే ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. రెవెన్యూ సదస్సులలో ప్రజలు ఇచ్చిన అర్జీలు, వాటి పరిష్కారంపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించాలని, స్పందనకు లోబడి అర్జీల పరిష్కారాన్ని వేగవంతం చేయాలన్నారు. కొమరోలు మండలంలో ఏర్పాటు చేయనున్న సబ్‌స్టేషన్ల కోసం అవసరమైన స్థలాల సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గృహ నిర్మాణశాఖ ద్వారా గృహాలు పొందిన లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికేట్ల మంజూరులో అలసత్వం వహించవద్దని, త్వరితగతిన లబ్ధిదారులకు అందజేయాలన్నారు. సమీక్షలో గిద్దలూరు, రాచర్ల, కంభం, అర్ధవీడు, బేస్తవార పేట, కొమరోలు మండలాల తహసీల్దార్లు, గృహ నిర్మాణశాఖ అధికారులు పాల్గొన్నారు.

గలిజేరుగుళ్లలో ఆధార్‌కేంద్రం ఏర్పాటు

బేస్తవారపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : బేస్తవారపేట మండలంలోని గలిజేరుగుళ్ల గ్రామ సచివాలయంలో నేటి నుంచి 19వ తేదీ వరకు ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని ఎంపీడీవో ఏవీ.రంగనాయకులు తెలిపారు. ఆధార్‌కు సెల్ నెంబరు, పేరు తప్పులు, కొత్తగా ఆధార్ నమోదు, చిరునామా మార్పులకు సంబంధించిన వాటిని మండలంలోని ప్రజలు ఈ కేంద్రంలో నమోదు చేయించుకోవచ్చునని తెలిపారు.

గ్రంథాలయ సెస్ చెల్లించాలి

పెద్ద దోర్నాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ సెస్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో నాసర్‌రెడ్డికి గ్రంథపాలకుడు సుబ్బారెడ్డి మంగళవారం వినతిపత్రం అందజేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో నాసర్‌రెడ్డిని గ్రంథపాలకుడు సుబ్బారెడ్డి, చిన్నగుడిపాడు, ఎగువ చెర్లోపల్లి, గంటవానిపల్లె బీడీసెల్ నిర్వాహకులు శ్రీనివాసులు, శేషిరెడ్డి, బీ ఆదిలక్ష్మీ గ్రంథాలయాలకు సెస్ చెల్లించేలా ఆయా గ్రామ కార్యదర్శులకు సూచించాలని కోరుతూ వినతిప్రతం అందజేశారు.

టీడీపీ పార్లమెంట్ అధికార ప్రతినిధి బాషా మృతి

గిద్దలూరుటౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఒంగోలు పార్లమెంటు అధికార ప్రతినిధి షేక్ మహబూబ్‌బాషా(56) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. షేక్ మహబూబ్‌బాష (పెద్దబాష) అనారోగ్యంతో కొంతకాలంగా కర్నూలులోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. గుండెపోటు రావడంతో చికిత్స పొందుతూ ఆరోగ్యం మెరుగుపడుతున్న సమయంలో మృతిచెందడం బాధాకరమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దబాష మృతికి ఆయన ఆ ప్రకటనలో సంతాపం తెలుపుతూ కుటుంబసభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

మే 10న జాతీయ లోక్‌అదాలత్



పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న న్యాయాధికారులు

గిద్దలూరుటౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరులోని కోర్టు ప్రాంగణంలో మే 10న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ఎ.ఓంకార్ అన్నారు. స్థానిక కోర్టు నందు పోలీసు, ఎక్సైజ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి ఓంకార్ మాట్లాడుతూ కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి బి.మేరీసారా దానమ్మ మాట్లాడుతూ హైబ్రీడ్ పద్ధతి ద్వారా కూడా కేసులను రాజీ చేస్తున్నామన్నారు. రాజీపడదగిన క్రిమినల్ కేసుల్లో కక్షిదారులకు అవగాహన కల్పించి వారి కేసులను రాజీ చేసుకునేలా చూడాలన్నారు. ఫొటో, ఆధార్ తప్పనిసరి అని పేర్కొన్నారు. జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసేందుకు అధికారులు చొరవ చూపాలన్నారు. సివిల్, రాజీపడదగిన క్రిమినల్, చెక్‌బౌన్స్ కేసులను రాజీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.అరుణకుమారి, కంభం, కొమరోలు, అర్ధవీడు, గిద్దలూరు ఎస్సైలు బి.నరసింహారావు, జె.నాగరాజు, బి.సుదర్శన్ యాదవ్, పి.ఇమ్మానియేలు, కంభం ఎక్సైజ్ ఎస్సై ప్రేమ్‌కుమార్, రాచర్ల హెడ్‌కానిస్టేబుల్ బి.సురేష్, కోర్టు కానిస్టేబుళ్ళు, పారాలీగల్ వలంటీర్ అద్దంకి మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్ ఎంపిక

పెద్ద దోర్నాల, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి):స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్స్‌కు ఎంపిక మంగళవారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు అనసూదేవి అధ్యక్షతన 16 మంది బాలురుతో స్కౌట్ యూనిట్, 16మంది బాలికలతో గైడ్స్ యూనిట్ ఎంపిక చేశారు. మాష్టర్‌గా వై.ఆంజనేయులు వ్యవహరించనున్నారు. కార్యక్రమంలో స్టాఫ్ కార్యదర్శి నాగమూర్తి, ఉపాధ్యాయులు కిరణ్, కే ఆవులయ్య, పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై వేంకటేశ్వరుడు

ఎర్రగొండపాలెంరూరల్ ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాద్రిపాలెంలో వేంచేసిన శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. నాలుగోవ రోజు మంగళవారం స్వామివారికి ఆలయ అర్చకులు కారంపూడి వెంకటాచార్యులు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. హనుమంతవాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉభయ దాతలుగా బోడా పాలంక వీరయ్య, బోడా వెంకటేశ్వర్లు, బోడా చిన్న వెంకటేశ్వర్లు, బోడా శంకరయ్యలు కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కంభం : కంభం కాపువీధిలో 16వ శతాబ్దంలో శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించిన వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 22 నుంచి మే 2వ తేదీ వరకు వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగునని ఆలయ చైర్మన్ పి.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. 22న మంగళవారం శ్రీవేంకటేశ్వరస్వామి కళ్యాణం, పుష్ప యాగం, 23వ తేదీ బుధవారం ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనంలో మాడవీధుల్లో దర్శనమిస్తారు. 24వ తేదీ గురువారం రాత్రి సింహవాహనం, 25న శుక్రవారం శేషవాహనం, 26న శనివారం కల్పవృక్ష వాహనం, 27న ఆదివారం హనుమంత వాహనం, 28న సోమవారం రాత్రి గరుడ వాహనం, 29న మంగళవారం రాత్రి గజవాహనం, 30న బుధవారం రథోత్సవం, మే 1వ తేది గురువారం మధ్యాహ్నం అన్నప్రసాదం, రాత్రి అశ్వవాహనం, 2వ తేది శుక్రవారం ఉదయం చక్రస్నానం, వసంతోత్సవం, రాత్రికి ఊంజల్ సేవ ఉంటుందన్నారు.

పోరుమామిళ్లపల్లిలో భారీ చోరీ



వేలిముద్రలు సేకరిస్తున్న క్ల్యూస్ టీం

కంభం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కంభం మండలం పోరుమామిళ్లపల్లిలో ఓ ప్రైవేటు ఉపాధ్యాయుని ఇంటిలో మంగళవారం పట్టపగలే చోరీ జరిగింది. పోరుమామిళ్లపల్లెకు చెందిన ఎం.చంద్రశేఖర్ కంభంలోని ఓ ప్రైవేటు స్కూలులో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నాడు. భార్య సాయిలక్ష్మి ట్యూషన్ చెబుతోంది. కాగా మంగళవారం ఇంటికి తాళం వేసి గిద్దలూరు ఆర్మీ క్యాంటీన్‌కు సరుకులకు వెళ్లారు. ఇది గమనించిన దొంగలు పట్టపగలే ఇంటికి వేసిన తాళం పగులగొట్టి కబ్‌బోర్డులో దాచిన 7 తులాల బంగారం, 2లక్షల నగదు, 300 గ్రాముల వెండిని దొంగిలించి వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చిన సాయిలక్ష్మి తాళం పగులగొట్టి ఉండడం గమనించి స్థానికుల ద్వారా పోలీసులకు తెలియజేసింది. సమాచారం ఒంగోలు నుంచి క్లూస్ టీమ్ వేలిముద్రలను సేకరించారు. కంభం ఎస్సై నరసింహారావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నగరపంచాయతీ కమిషనర్‌గా నారాయణరెడ్డి

పొదిలి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : నగరపంచాయతీ కమిషనర్‌గా పనిచేస్తున్న పి.శ్రీనివాసులు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కర్నూల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కే.ఎల్.నారాయణరెడ్డి నియమించినట్లు మంగళవారం ఉత్తర్వులు అందాయి. పొదిలి కమిషనర్‌గా ఉన్న పి.శ్రీనివారావు నర్సరావుపేట గ్రేడ్-1 మేనేజరుగా ఉంటూ ఎఫ్‌ఏసీగా పొదిలిలో నగరపంచాయతీ కమీనర్‌గా పనిచేస్తున్నారు. ఆయన స్థానంలో నారాయణరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

బహిరంగంగా మద్యం సేవించడం నేరం

మార్కాపురం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నేరమని మార్కాపురం పట్టణ ఎస్సై డాక్టర్ ఎమ్.రాజమోహన్‌రావు హెచ్చరించారు. పట్టణ శివార్లలోని పలు ప్రాంతాల్లో మంగళవారం రాత్రిదాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. కొందరిపై పెట్టీ కేసులు నమోదు చేశారు. ఈ మేరకు వారిని కోర్టులో హాజరుపరచనున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడా



వై.పాలెంలో ఉత్తమ వంట చేసి కార్యకర్తకు బహుమతి అందజేస్తున్న ఎంపీడీవో శ్రీనివాసులు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు వివిధ వంటల ద్వారా పొందవచ్చని సీడీపీవో సుశీలాదేవి అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాన్ని పురస్కరించుకుని పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో మంగళవారం వంటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ.. ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ వహించడం కోసం లబ్దిదారులే స్వయంగా వివిధ వంటకాలు చేసుకుంటే ఎంతో ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రవికుమారి, బుజ్జి, అంగన్‌వాడీలు, కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు సోమవారం స్థానిక కార్యాలయంలో సీడీపీవో ఎం.పద్మావతి ఆధ్వర్యంలో పోషక విలువలతో కూడిన వంటకాలపై పోటీలను నిర్వహించారు. పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా ఈ పోటీలు నిర్వహించారు. ఎక్కువ సంఖ్యలో ఏ వంటకాల్లో పోషకాలు ఉంటాయో అనే అంశంపై వంటల కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. ఆసక్తిగా పాల్గొని విజేతలుగా నిలిచిన వారికి ఎంపీడీవో బండారు శ్రీనివాసులు, ఎంఈవో పి ఆంజనేయులు సీడీపీవో పద్మావతి కలసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎం పద్మజ, సుబ్బమ్మ, సార్డ్ సంస్థ సభ్యులు మరియ దాసు, సిబ్బంది పాల్గొన్నారు.

బేస్తవారపేట : బ్తేవారపేట సచివాలయం-2 నందు పోషణ్ పక్వాడ కార్యాక్రమంలో భాగంగా మంగళవారం అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.వి.రంగనాయకులు, తహసీల్దార్ జితేంద్రలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మంచి పోషక పదార్థాలు కలిగిన ఆహారాన్ని తయారు చేసిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీడీపీవో నీలోఫర్ బేగం, ఎంఈవో కాశయ్య అంగన్‌వాడీ సూపర్ వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలను విధిగా పాఠశాలలో చేర్పించాలని ఎంపీడీవో నాసర్ రెడ్డి అన్నారు. స్థానిక ఎంఈవో కార్యాలయంలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఎంఈవో మస్తాన్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఎంపీడీవో మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరంలో అంగన్‌వాడి కేంద్రంలో ఐదేళ్లు పూర్తయిన చిన్నారుల వివరాలు తీసుకుని ఆధార్‌కార్డు, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్టు తప్పులు లేకుండా చేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 కొండల రావు, క్లస్టర్ ఉపాధ్యాయులు అంగన్‌వాడి సూపర్‌వైజర్లు, సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.



మార్కాపురంలో వంటలు ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీలు

కంభం : అంగన్‌వాడి కేంద్రాలలో చదువు పూర్తి చేసుకున్న పిల్లలందరినీ సమీప ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఇఒలు మాల్యాద్రి, శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు కొత్తపల్లి జ్యోతి, క్లస్టర్ హెడ్మాష్టర్లు, సీఆర్‌పీలు సీడీపీవో, సూపర్‌వైజర్, అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

కంభం : పోషణ పక్వాడ పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం మహారాణి మహారాజ పౌష్టికాహార ప్రదర్శనను నిర్వహించారు. బేస్తవారపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అన్ని అంగన్‌వాడి కేంద్రాల నుంచి పోషణ పదార్థాలను తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జడ్పీటీసీ సభ్యురాలు కొత్తపల్లి జ్యోతి మాట్లాడుతూ జీవనశైలిలో పౌష్టికాహార ప్రాముఖ్యతను తెలిపేందుకు ఇటువంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో నీలోఫర్, సూపర్ వైజర్ నాగలక్ష్మి, అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

పొదిలి : మహిళా శిశుసంరక్షణ శాఖ ఆధ్వర్యంలో స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో అంగన్వాడిలకు జరిగిన పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో ఎం.శ్రీనివాసరెడ్డి పాల్గొని బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందజేయాలన్నారు. దాన్ని లబ్ధిదారులు వినియోగించుకొని ఆరోగ్యవంతులుగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీవో సుధామారుతీ, ఏపీఎం గోపాలకృష్ణ ఎంఈవో-2 నాగలక్ష్మీ, సీఆర్‌పీ కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : గ్రామాల్లో బడిఈడు పిల్లలు అందరిని బడిలో చేర్పించాలని, ఉపాధ్యాయులను, అంగన్వాడీ కార్యకర్తలను ఎంఈవో ఆంజనేయులు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన అధికారుల సమావేశంలో తెలిపారు. మండలంలో 908 మంది బడిమానిన విద్యార్థులు ఉన్నారని వారందరిని బడిలో చేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలను, సూపర్ వైజర్లును కోరారు. ఈ కార్యక్రమంలో ఎం ఈ వో పి ఆంజనేయులు, ఎంపీడీవో శ్రీనివాసులు, సీడీపీవో పద్మావతి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

తర్లుపాడు: తర్లుపాడులోని అంగన్‌వాడీ కేంద్రాలలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణవేణి ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ పాలెంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహారంలో విటమిన్‌లు కలిగిన చిరుధాన్యాలతో తయారుచేసిన వంటకాలను ప్రదర్శించారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్చాలి

దొనకొండ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పటమే ప్రభుత్వ ఉద్దేశమని ఎంఈవో సాంబశివరావు అన్నారు. మంగళవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు సమిష్టిగా పనిచేయాలన్నారు. తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను వివరించి వారి పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చేర్చేలా చైతన్యపర్చాలన్నారు. తద్వార పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో-2 షేక్ అమీర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిణి, దొనకొండ జడ్పీ పాఠశాల హెచ్ఎం రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

వరిగడ్డి వామి దగ్ధం



పసుపుగల్లులో దగ్ధమవుతున్న వరిగడ్డి వామి

ముండ్లమూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పసుపుగల్లు గ్రామానికి చెందిన గొంది లక్ష్మీరెడ్డికి చెందిన ఆరు ఎకరాల వరి గడ్డి వామికి మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. గ్రామస్థులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అగ్నికి ఆహుతైన ఆరు ఎకరాల వరి గడ్డి విలువ రూ.1.20 లక్షలు ఉంటుందని బాధితు తెలిపారు. గత ఏడాదిలో కూడా లక్ష్మీరెడ్డికి చెందిన వామికి నిప్పు పెట్టారు. దీంతో బాధితుడు మంగళవారం సాయంత్రం ముండ్లమూరు పోలీసు స్టేషన్‌లో అనుమానాస్పద కేసు పెట్టారు.

నవ ధాన్యాల సాగుతో భూసారం పెంపుదల

ముండ్లమూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నవ ధాన్యాల సాగుతో భూసార పెంపుదల సాధ్యమవుతుందని ప్రకృతి వ్యవసాయం డీపీఎం సుభాషిణి అన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం చేస్తే భూమి మనుషుల ఆరోగ్యాన్ని కాపాడుతుందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రమణ, ఏవో ఫరూక్, ఏపీఎం హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

పీసీపల్లి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చునని ఎంపీడీవో ప్రభాకరశర్మ అన్నారు. మంగళవారం నేరేడుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన పోషణ్ పక్వాడ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతిరోజు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా పిల్లలు శారీరకంగా, మానసికంగా ఎదుగుతారని అన్నారు. ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు జరీన మాట్లాడుతూ కార్యకర్తలు ప్రతిరోజు సమయపాలన పాటిస్తూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లా మల్లికార్జున్, ఎంఈవోలు జి.సంజీవిని, ఆర్.శ్రీనివాసులు, హెచ్ఎం అంజనీదేవి, తదితరులు పాల్గొన్నారు.

కళాశాలకు సిమెంట్ బల్లలు అందజేత

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం శీలంవారిపల్లిలోని కళాశాలకు ఎస్ఎంసీ చైర్మన్ మూరం మస్తానయ్య ఆధ్వర్యంలో మంగళవారం పది సిమెంట్ బల్లలను అందజేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా విద్యార్థులకు మజ్జిగను కేతా శ్రీనివాసరావు, శీలం మాలకొండారెడ్డి, చెరుకుపల్లి సత్యనారాయణరెడ్డి ఏర్పాటుచేశారు. పాఠశాల ప్రారంభం నుంచి విద్యా సంవత్సరం ముగిసేవరకు మినరల్ వాటర్‌ను ఏర్పాటుచేయనున్నట్టు మూరం మస్తానయ్య, యనగల సుధాకర్‌రెడ్డి తెలిపారు.

పోలేరమ్మ ఆలయంలో చోరీ

ముండ్లమూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూజెండ్లపల్లిలో గల పోలేరమ్మ దేవాలయంలో మంగళవారం మధ్యాహ్నం చోరీకి పాల్పడ్డారు. ఆలయం పక్కనే పొలం ఉన్న పల్లా సుబ్బారావు వెళ్తుండగా ఇద్దరు దొంగలు అక్కడ సంచరిస్తున్నారు. అనుమానం వచ్చి వారిని ప్రశ్నించగా పొంతన లేని సమాచారం చెప్పారు. అనుమానం వచ్చిన పోలేరమ్మ ఆలయం వైపు చూడగా అక్కడి వరండాలో గంటలు కన్పించ లేదు. దీంతో వెంటనే సుబ్బారావు గ్రామస్థులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. వెంటనే కొందరువచ్చి దొంగల్లో ఒకరిని పట్టుకోగా, మరొకరు పరారయ్యారు. పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ కె.కమలాకర్ సిబ్బందితో వెళ్ళి గ్రామస్థులు పట్టుకున్న దొంగను అదుపులోకి తీసుకున్నారు.

అధ్వానంగా డ్రైనేజీ

- దర్శిలో ఆక్రమణలకు గురైన మురుగు కాల్వలు
- రోడ్లమీదకు చేరుతున్న వర్షపునీరు
- అసౌకర్యానికి గురవుతున్న ప్రజలు



దర్శి గడియార స్తంభం సెంటర్‌లో వర్షం పడినప్పుడు రోడ్డుపై నిలిచిన నీరు(ఫైల్)

దర్శి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మురుగు కాల్వలు ఆక్రమణలకు గురయ్యాయి. దీంతో మురుగునీరు ముందుకువెళ్లే పరిస్థితి లేదు. కొన్నిచోట్ల కాల్వలను రోడ్ల కంటే ఎత్తులో నిర్మించటంతో నిరుపయోగంగా మారాయి. దర్శి-పొదిలి రోడ్డులో వర్షం పడితే చాలు కుంటలా రోడ్లపైకి నీరు చేరుతుంది. మురుగు నీటితో కలిసి వర్షపునీరు రోడ్లపై చేరటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

దర్శి-పొదిలి రోడ్డులో మురుగు కాల్వ పూర్తిగా ఒకవైపు ఆక్రమణకు గురైంది. రిలయన్స్ ఫ్రెష్ వద్ద మురుగుకాల్వ లేకుండా చేయటంతో వర్షపు నీరు రోడ్డుపైనే కుంటలా నిల్వ ఉంటుంది. దర్శి-అద్దంకి రోడ్డు, దర్శి-కురిచేడు రోడ్డులో కూడా అధికశాతం ఆక్రమణలకు



దర్శి-పొదిలి రోడ్డులో రిలయన్స్ ఫ్రెష్ ఎదురు కుంటలా నీరు

గురయ్యాయి. మురుగు నీరు ముందుకు కదలకపోవడంతో దుర్వాసనలు వెదజల్లుతున్నాయి. దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారిపోయాయి. ఎన్నో సంవత్సరాలుగా డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉన్నా అధికారులు పట్టించు కోలేదు. టీడీపీ కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత దర్శి పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. డ్రైనేజీ వ్యవస్థను కూడా అభివృద్ధి చేస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు. నగర పంచాయితీ అధికారులు అధ్వానంగా మారిన డ్రైనేజీ వ్యవస్థను మార్చాలని కోరుతున్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు

- ఈఈ పాలగిరి శ్రీనివాసులు



సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఈఈ శ్రీనివాసులు

ముండ్లమూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్టు ఈఈ పాలగిరి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం ముండ్లమూరు సబ్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండురోజుల క్రితం గాలివానతో మండలంలో 20 విద్యుత్ స్తంభాలు కూలిపోయాయన్నారు. వాటిని 24 గంటల్లోనే ఏర్పాటు చేసి ప్రజలకు అసౌకర్యం లేకుండా చేశామన్నారు. వేసవి కాలంలో సహజంగా అధికలోడు ఉంటుందన్నారు. అవసరమైనమేర చర్యలు తీసుకుంటున్నామన్నారు. సిబ్బంది గ్రామాలకు వెళ్ళి ఎప్పటికప్పుడు విద్యుత్ వినియోగదారులతో మాట్లాడాలన్నారు. విని యోగదారుడికి ఎటువంటి ఇబ్బంది కలిగించ వద్దన్నారు. సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకొనే విధంగా చూడాలన్నారు. ప్రభుత్వం ఎక్కువ శాతం సబ్సిడీ ఇస్తుందని చెప్పారు. విద్యుత్ బిల్లులు సకాలంలో వసూలుచేసి సంస్థ పురోభివృద్ధికి సిబ్బంది తోడ్ప డాలన్నారు.

ప్రధానంగా ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ బకాయిలు పేరుకుపోయాయని ఈఈ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలో రూ.1.80 కోట్లు విద్యుత్ బకాయి ఉందన్నారు. ఇటీవల రైతులు విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. వారందరికీ త్వరలోనే ట్రాన్స్‌ఫారాలు, స్తంభాలు అందజేస్తామన్నారు. రైతులకు మెరుగైన విద్యుత్‌ను అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మండలంలోని కమ్మవారిపాలెం, పులిపాడు, నందమూరి నగర్, ముండ్లమూరు గ్రామాల్లో పడిపోయిన విద్యుత్ స్తంభాలను పరిశీలించి కొత్త స్తంభాలను వేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏడీ కృష్ణారెడ్డి, ఏఈ చిన అంకబాబు, లైన్‌ఇన్‌స్పెక్టర్ సాంబయ్య, లైన్‌మెన్ అంజనేయులు, నాయక్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన గుంటిగంగ తిరునాళ్ల

- ట్రాఫిక్ నియంత్రణలో పోలీసుల వైఫల్యం
- భక్తుల ఇబ్బందులు



తురకపాలెం టీడీపీ ప్రభపై డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్‌లలిత్ సాగర్ దంపతులను సన్మానిస్తున్న టీడీపీ శ్రేణులు

తాళ్లూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): గుంటిగంగ తిరునాళ్ల సోమవారం రాత్రి వైభవంగా ముగిసింది. దాదాపు రెండులక్షల మందికిపైగా భక్తులు తిరునాళ్లను తిలకించారు. దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో సీఐ రామారావు ఆధ్వర్యంలో ఎస్ఐ మల్లికార్జునరావులు తిరునాళ్ల ప్రాంగణంలో ట్రాఫిక్‌కు అంతరాయం జరుగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ప్రకటించారు. అయితే, ట్రాఫిక్‌ను నియంత్రించలేకపోవటంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నాలుగువైపులా వాహనాల పార్కింగ్‌లు ఏర్పాటుచేయటంతో పాటు పికెట్లు ఏర్పాటు చేసి సాయంత్రం నాలుగు గంటల నుంచి వాహనాలను తిరునాళ్ల ప్రాంగణంలోకి రాకుండా నిరోధించి ఉన్నట్లయితే భక్తులకు ఇబ్బందులు ఉండేదికాదు. పికెట్లు ఏర్పాటు చేసినా పోలీసులు కన్పించిన దాఖాలు లేదు.

తూర్పుగంగవరం వెళ్లే మార్గంలో రాత్రి 11 గంటల సమయంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం జరిగి దాదాపు గంటపాటు ట్రాఫిక్ నిలిచింది. హైవేరోడ్డు నిర్మాణాలు జరుగుతుండటంతో ప్రజలు ఆరోడ్డు గుండా తిరునాళ్లలోకి ప్రవేశించటం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ప్రభల వద్ద మైకుల అధిక శబ్దంతో భక్తులు చెవులు దిమ్మతిరిగిపోయాయి. దేవదాయశాఖ ఏర్పాటుచేసిన బారీ కేడ్లతో గంగమ్మ దర్శనానికి వచ్చిన లక్షలాది మంది భక్తులు మునుపెన్నడూ లేనివిధంగా ఎలాంటి తొక్కిసలాటకు గురికాకుండా అమ్మవారిని దర్శించుకున్నారు. తురకపాలెం, నాగంబొట్లపాలెం టీడీపీ ప్రభలు, జనసేన ప్రభలపై టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి, లలిత్‌సాగర్ కార్యకర్తల నుద్దేశించి మాట్లా డారు. తురకపాలెం వైసీపీ ప్రభలపై జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి, చేవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడారు. దాదాపు 15 సంవత్సరాల తరువాత విఠలాపురం గ్రామానికి చెందిన కైపు వెంకటకృష్ణారెడ్డి కాంగ్రెస్ ప్రభను ఏర్పాటుచేశారు.

ప్రజాసేవే లక్ష్యం

తాళ్లూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ప్రజాసేవే తన లక్ష్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. తిరునాళ్ల సందర్భంగా తురకపాలెం, నాగంబొట్లపాలెం టీడీపీ శ్రేణులు, జనసేన శ్రేణులు ఏర్పాటుచేసి ప్రభలపై ప్రజల నుద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండింటికి ప్రాధాన్యత నిస్తూ రాష్ట్రాభివృద్ధికి బాటలు వేస్తుందన్నారు. దర్శిలో నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవచేస్తూ ముందుకుసాగుతున్నామన్నారు. కార్యక్రమాల్లో టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ లలిత్‌సాగర్, తదితరులు పాల్గొన్నారు. కాగా, తురకపాలెం టీడీపీ శ్రేణులకు మండల నేతలపై ఉన్న అసంతృప్తితో టీడీపీ యూత్ ఫోర్స్ ఏర్పాటుచేసిన ప్రభపైకి మండలస్థాయి నాయకులను ఎవరిని ఆహ్వానించలేదు. ఆగ్రామ యువకులు తీసుకున్న నిర్ణయాన్ని పలుగ్రామాలకు చెందిన నేతలు తప్పుపడుతున్నారు.

గంగమ్మ తల్లికి రూ.7లక్షల ఆదాయం

తాళ్లూరు, ఏప్రిల్15 (ఆంధ్రజ్యోతి): గుంటిగంగ తిరునాళ్ల సందర్భంగా గంగా భవానీ అమ్మవారి దేవాలయానికి రూ.7,42,158 ఆదాయం వచ్చిందని ఈవో జి.వాసుబాబు తెలిపారు. మంగళవారం హుండీల్లో కానుకలను లెక్కించారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, యు.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాల మంజూరుకు గ్రీన్‌సిగ్నల్


- ఎస్సీ నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం తీపికబురు
- వచ్చేనెల 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

దొనకొండ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాల నిరుద్యోగ యువతకు సబ్సిడీ రుణాల ద్వారా ఉపాధి చూపేందుకు టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. గత వైసీపీ ప్రభుత్వంలో షెడ్యూల్డ్ కులాల నిరుద్యోగులకు ఆర్థిక భరోసా కల్పించే రుణాల మంజూరును గాలికొదిలేశారు. దీంతో ఆర్థిక భరోసా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఎస్సీల సంక్షేమానికి చేయూతనివ్వాలనే లక్ష్యంతో రుణాల మంజూరుకు ఉత్తర్వులు జారీచేసింది. ఈమేరకు జిల్లాలో 1305 మంది లబ్ధిదారులకు రుణాల మంజూరుకు చర్యలు చేపట్టారు. 21 నుంచి 50 సంవత్సరాలలోపు అర్హులైన లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేలా ఉత్తర్వులు జారీ చేసింది. రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు దాదాపు 32 రకాల వివిధ స్వయం ఉపాధి పథకాలకు రుణాలు అందించేలా చర్యలు చేపట్టారు. వచ్చేనెల 10వ తేదీలోపు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు సమాచారం. ఈరుణాలు పొందేందుకు అర్హులైన వారు ఏపీవోబీఎంఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ ఆన్‌లైన్ పోర్టల్‌లో ఆధార్ కార్డు, కులం, ఆదాయం, పుట్టినతేది సర్టిఫికెట్లు, రేషన్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఫోన్‌నెంబర్‌తో దరఖాస్తులు చేసుకోవాలి.

2014 నుంచి 2019 మధ్యకాలంలో వేలమంది ఎస్సీ నిరుద్యోగులకు ఎన్నో రకాల రుణాలు అందజేసి వారి జీవనోపాధికి అప్పటి టీడీపీ ప్రభుత్వం చేయూతనిచ్చింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాల నిరుద్యోగులకు గూడ్స్ ఆటోలు, కార్లు, మెడికల్ షాపులు, ఫొటోస్టూడియో, సోలార్ ప్రొడెక్టు, వాటర్ ప్యూరిఫేషన్, మొబైల్ రిపేరింగ్, ప్లంబింగ్, ఎలక్ట్రిషియన్ సర్వీస్ తదితర యూనిట్లు ద్వారా ఆర్థిక సహకారం అందించే అవకాశం కల్పించనుంది. గత వైసీపీ ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్‌ను పూర్తిగా పట్టించుకోకపోవటంతో షెడ్యూల్డ్ కులాలకు చెందిన నిరుద్యోగులు ప్రభుత్వం నుంచి ఎటువంటి లబ్ధిపొందలేకపోయారు. టీడీపీ కూటమి ప్రభుత్వం తిరిగి ఎస్సీ కార్పొరేషన్‌లో దాదాపు 32 రకాల యూనిట్లు అర్హులైన వారు పొందేలా ఉత్తర్వులు ఇవ్వటంతో నిరుద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన రుణాలను పొందేందుకు అర్హులైన షెడ్యుల్డ్ కులాలకు చెందిన నిరుద్యోగులు సకాలంలో దరఖాస్తులు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

- అధికారులకు ఎంపీపీ సుంకర సునీత ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుంకర సునీత

ముండ్లమూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సుంకర సునీత అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. మండలానికి సరఫరా అవుతున్న ఎన్ఏపీ నీరు వారానికి ఒక సారి సరఫరా చేస్తున్నారని అన్నారు. అదికూడా రంగు మారిన నీరు సరఫరా చేస్తున్నారని, దీనివల్ల వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. తక్షణమే చర్యలు తీసుకొని గ్రామాల్లో తాగు నీటి కొరతను తీర్చాలన్నారు. సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామాలను సందర్శించాలన్నారు. గ్రామ పంచాయతీల్లో చలివేంద్రాలు కూడా ఏర్పాటుచేసి ప్రజల దాహార్తిని తీర్చాలన్నారు.

మండల ప్రత్యేకాధికారి రమణ మాట్లాడుతూ మండలంలో అన్ని శాఖల అధికారులు గ్రామాలను సందర్శించి ప్రజల అవసరాలను తీర్చటమే కాక అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ప్రధానంగా ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం డీపీఎం సుభాషిణి మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలను సాగు చేసి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలన్నారు. విచ్చలవిడిగా పురుగు మందులు, రసాయానిక ఎరువులు వాడవద్దన్నారు. మండల వ్యవసాయ అధికారి ఎండీ ఫరూక్ మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు పండించిన కందులను ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దన్నారు. విద్యుత్ శాఖ సబ్ ఇంజనీరు ఇమ్మానియేలు బాబు మాట్లాడుతూ రెండు రోజుల క్రితం గాలివానతో విద్యుత్ స్తంభాలు పడి పోయాయన్నారు. 24 గంటల వ్యవధిలోనే వాటి స్థానంలో స్తంభాలు ఏర్పాటుచేసినట్టు చెప్పారు. అనంతరం ఉపాధి, వెలుగు, విద్య, ఆరోగ్య, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, సాగునీటి శాఖల పురోగతిపై అధికారులతో సమీక్షా చేశారు.

సతులకు బదులు పతులు

మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరుకావాల్సి ఉండగా వారి స్థానంలో సతులకు బదులు పతులు హాజరయ్యారు. సంబంధిత శాఖల అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. అధికారులు మాత్రం చోద్యం చూస్తూ మిన్నకుండిపోయారు. సమావేశంలో తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ, ఎంపీఈవో ఆర్.జనార్దన్, జడ్పీటీసీ టి.రత్నరాజు, ఎంఈవోలు సుబ్బారావు, వెంకటేశ్వర్లు, వైద్యాధికారులు జాస్మిన్, మధుకిరణ్, సీడీపీవో భారతి, తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

నేడు కనిగిరిలో అమరజీవి జయంతి

కనిగిరి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలు బుధవారం కనిగిరిలో ఘనంగా జరుగనున్నాయి. కందుకూరు రోడ్డులోని ఎంబీఆర్ ఫంక్షన్ హాలులో నిర్వహించే ఉత్సవాల ఏర్పాట్లను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఉత్సవాల్లో జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు.

బాణసంచా దుకాణాల తనిఖీ



బాణసంచా దుకాణాలను పరిశీలిస్తున్న డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్

పామూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నెల్లూరు రోడ్డులోగల బాణసంచా దుకాణాలను కనిగిరి డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్ మంగళవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా బాణసంచా నిల్వలు ఉన్నా, అక్రమంగా విక్రయాలు జరిపినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వేసవిలో దుకాణాల్లో తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. చైనా బాణ సంచాను విక్రయించరాదన్నారు. ఆయన వెంట ఎస్ఐ టి.కిశోర్‌బాబు, సిబ్బంది ఉన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం



అగ్నిప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కనిగిరి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ ఎస్ఐ బంగారుబాబు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా రెండోరోజు మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజీ, కాశిరెడ్డి కాలనీ, చింతలపాలెం గ్రామాల్లో అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక సిబ్బంది పలు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. గ్యాస్ సిలిండర్ లీక్ కారణంగా జరిగే అగ్ని ప్రమాదాలను ఏ విధంగా నియంత్రించవచ్చో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, ఆర్టీసి డిపో మేనేజర్ షహనాబేగం, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి

దర్శి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకుంటే భారీ నష్టం సంభవించకుండా నివారించవచ్చని అగ్నిమాక శాఖ అధికారి సీహెచ్ జాలయ్య సూచించారు. అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆర్టీసీ బస్టాండ్, సినిమా థియేటర్లు, షాపింగ్ మాల్స్‌లో అగ్ని ప్రమాదాలను నివారించే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బంది ప్రత్యక్షంగా వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

కొర్రపాటివారిపాలెంకు సీసీ రోడ్డు నిర్మాణం



ఎంపీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు

తాళ్లూరు, ఏప్రిల్15 (ఆంధ్రజ్యోతి): వెల్లంపల్లి రోడ్డు నుంచి కొర్రపాటి వారి పాలెం గ్రామానికి వెళ్లే సాగర్ కాలువ కట్ట రోడ్డును ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి నిధులతో సీసీ రోడ్డు నిర్మించారు. ఆగ్రామానికి చెందిన తెలుగు యువత రాష్ట్రకార్యదర్శి గొల్లపూడి వేణుబాబు కట్ట రోడ్డు అధ్వానంగా ఉండటంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీ గ్రాంట్ నుంచి సీసీరోడ్డు నిర్మాణానికి రూ15లక్షల నిధులు మంజూరు చేయగా ఆపనులను పూర్తి చేశారు. ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో వెల్లంపల్లి రోడ్డు నుంచి గ్రామంలోకి వెళ్లే కాలువకట్ట రోడ్డును సీసీ రోడ్డుగా నిర్మించారు. దీంతో ప్రజల ఇబ్బందులు తొలగిపోయాయి.

పౌష్టికాహారాన్ని సక్రమంగా అందజేయాలి




పౌష్టికాహారాన్ని చూపుతున్న ఎంపీపీ లక్ష్మి తదితరులు

పామూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని ఎంపీపీ గంగసాని లక్ష్మి సూచించారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన పౌష్టికాహార వారోత్సంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుచాలన్నారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు తయారుచేసిన పౌష్టికాహారాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య, ఎంఈవో కరణకుమారి, తదితరులు పాల్గొన్నారు. అలాగే సీఎస్‌పురం మండల కేంద్రంలోనూ పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు.

బ్యాటరీ దొంగలను పట్టుకున్న గ్రామస్థులు

ముండ్లమూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మారెళ్ళలో మంగళవారం తెల్లవారు జామున జియో సెల్ టవర్‌కు చెందిన 24 బ్యాటరీలను ట్రాలీ ఆటోలో తీసుకెళుతుండగా గ్రామస్థులు పట్టుకున్నారు. దొంగతనంగా బ్యాటరీలను తీసుకెళుతున్న విషయాన్ని గ్రామస్థులు గమనించడంతో ఆటోను వదిలి పరారయ్యారు. గ్రామ యువకులు ద్విచక్రవాహనాలతో వెంబడించి నలుగురిని పట్టుకున్నారు. దొంగతనానికి పాల్పడిన ఖాశీం వలి, కాటూరి జాలయ్య, షేక్ జైలుద్దీన్, షేక్ జాన్‌వలిని ముండ్ల మూరు పోలీసులకు అప్పగించారు. మారెళ్ళలోనే కాకుండా దర్శి మండలం రాజంపల్లిలోని జియో టవర్‌లో కూడా 24 బ్యాటరీలు పోయినట్టు సమాచారం. గ్రామస్థులకు పట్టుబడిన నలుగురు దుండగులు జియో టవర్ కంపెనీ పేరుతో ఉన్న డ్రెస్‌లు ధరించి ఎవ్వరికి అనుమానం రాకుండా దొంగతనానికి పాల్పడ్డారు. ఎస్ఐ కమలాకర్ నిందితులను విచారించారు.





10 వేల ఎకరాల భూ సమీకరణ!

విమానాశ్రయంతో సత్వర ఆర్థికాభివృద్ధి!

రాజధాని నగరంలో సత్వర ఆర్థికాభివృద్ధి సాధించే ప్రాజెక్టుల్లో అంతర్జాతీయ విమానాశ్రయం ప్రధానమైంది. దీని వల్ల రాజధానిలో వ్యాపార, వాణిజ్యాభివృద్ధి జరుగుతుంది. మల్టీనేషనల్ కంపెనీల కార్యాలయాలు, కర్మాగారాలు ఏర్పాటు చేయటానికి దోహదపడుతుంది. ఎగుమతి, దిగుమతులను పెంపొందిస్తుంది.



బెంగళూరు విమానాశ్రయం ఐటీ హార్డ్‌వేర్ ట్రేడ్‌ను గణనీయంగా ప్రోత్సహిస్తోంది. అమరావతికి కూడా అందుకు అనుగుణమైన వ్యాపారాలను పెంచటానికి దోహదపడుతుంది. విమానాశ్రయం వల్ల మౌలిక సదుపాయాలు కూడా గణనీయంగా అప్‌గ్రేడ్ అవుతాయి. రోడ్లు, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్, స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులు వంటివి అభివృద్ధి చెందుతాయి. కార్గో, లాజిస్టిక్ హబ్‌గా కూడా అభివృద్ధి చెందుతుంది. పండ్లు, పూలు, ఔషధాల ఎగుమతులకు దోహదపడుతుంది. ముంబయి విమానాశ్రయం ఒక్కటే 40శాతం ఎయిర్ కార్గోను నిర్వహిస్తోంది. ఈ విమానాశ్రయం వల్ల స్థానికంగా రియల్ ఎస్టేట్ కూడా వృద్ధి చెందుతుంది. విమానాశ్రయం చుట్టూ ఉండే భూములు 300 నుంచి 500 శాతం వరకు పెరుగుతాయన్నది అంచనా. స్థానిక వస్తువులకు గ్లోబల్ మార్కెట్ లభిస్తుంది. దీంతో పాటు ఆరోగ్య, విద్యా సదుపాయాలు పెరుగుతాయి. పర్యాటకరంగం కూడా అభివృద్ధి చెందుతుంది. ఇన్ని ఆర్థిక పరమైన ప్రయోజనాలున్నందునే ముందుగా అంతర్జాతీయ విమానాశ్రయంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఐదు వేల ఎకరాల్లో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఇందు కోసం తక్షణం భూములను సమీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.



అమరావతికి దగ్గరగా ఇన్నర్, అవుటర్ రింగ్ రోడ్ల మధ్య ప్రాంతంలో ఉన్న 10 వేల ఎకరాల భూములను యుద్ధ ప్రాతిపదికన సమీకరించాలని సీఆర్‌డీఏ భావిస్తోంది. యండ్రాయి, కర్లపూడి, తాడికొండ, వైకుంఠపురంలోని భూములను టాప్-3 ప్రాధాన్యతా ప్రాజెక్టుల కోసం తీసుకోవాలని యోచిస్తోంది. అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయానికి ఐదు వేల ఎకరాలు, స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీకి 2,500 ఎకరాలు, స్పోర్ట్స్ సిటీ కోసం 2,500 ఎకరాల చొప్పున తీసుకోవాలన్నది ఆలోచన. అవసరమైన భూములను తీసుకోవటానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా అంగీకారం తెలిపినట్టు సమాచారం. మిగిలిన భూములను ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం తర్వాత తీసు కోవాలని చూస్తున్నారు. అయితే భూ సమీ కరణ విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికార వర్గాలు చెబుతున్నాయి.

- ఇన్నర్, అవుటర్ రింగ్ రోడ్ల మధ్య సీఆర్‌డీఏ ఎంపిక
- ఎయిర్ పోర్టుకు 5 వేలు, స్మార్ట్ ఇండస్ట్రియల్ పార్క్‌కు 2,500, స్పోర్ట్స్ సిటీకి 2,500 ఎకరాలు
- గవర్నమెంట్ కాంప్లెక్స్ పనులు పూర్తయిన రెండేళ్లకు మరో 34 వేల ఎకరాల సమీకరణ
- మల్టీ కనెక్టివిటీ కోసమే.. ఇన్నర్, అవుటర్ మధ్య ప్రాంతం గుర్తింపు
- తుళ్లూరు మండలంలో అంతర్జాతీయ విమానాశ్రయం !
- ప్రపంచ బ్యాంకు సూచనల మేరకు భూములు తీసుకోవాలని నిర్ణయం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాజధాని అమరావతిని పరిపాలనా కేంద్రంగానే కాకుండా సమాంతరంగా ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేలా చేయాలని కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ప్రపంచ బ్యాంక్ సూచించిన విధంగా ఆర్థికాభివృద్ధిని తీసుకురావటానికి వీలుగా అంతర్జాతీయ విమానాశ్రయం, స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీ, స్పోర్ట్స్ సిటీలను (మిగతా 6వ పేజీలో)

స్పోర్ట్స్ సిటీ ప్రాజెక్టుతో పర్యాటక రంగ అభివృద్ధి



స్పోర్ట్స్ సిటీ ప్రాజెక్టుకు కూడా భూములను సమీకరించాలని నిర్ణయించింది. స్పోర్ట్స్ సిటీ వల్ల కూడా అమరావతి సత్వరాభివృద్ధికి దోహదపడుతుంది. స్పోర్ట్స్ సిటీ అనేది క్రీడలు, ఫిట్‌నెస్, వినోద కేంద్రంగా ఉంటుంది. ప్రపంచ స్థాయి క్రీడా స్టేడియాలు, ట్రైనింగ్ అకాడమీలు, స్పోర్ట్స్ మ్యూజియాలు, ఫిట్‌నెస్ సెంటర్లు, హోటళ్లు రిటైల్ మాల్స్, ఎంటర్‌టైన్‌మెంట్ జోన్లు, ఆటగాళ్లు, కోచ్‌ల రెసిడెన్షియల్ జోన్లు ఉంటాయి. ఈ స్పోర్ట్స్ సిటీ వల్ల పర్యాటక రంగం, రియల్ ఎస్టేట్ బూమ్, స్థానిక వ్యాపారం పెరగటం, ఉద్యోగాల కల్పన పెద్ద ఎత్తున జరుగుతుంది.

సాగుకు.. మంచి రోజులు

సాగర్ కుడి కాలువ పరిధిలో మరమ్మతులు

- సమాయత్త మవుతున్న జలవనరుల శాఖ
- మూడు జిల్లాల్లో 355 పనుల గుర్తింపు
- రూ.19.28 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) నాగార్జున సాగర్ కుడి కాలువ పరిధిలో అధ్వానంగా ఉన్న కాల్వల మరమ్మతులకు ప్రభుత్వం సమాయత్తం అవుతోంది. కాల్వల్లో చేపట్టాల్సిన అత్యవసర పనులను జల వనరుల శాఖ గుర్తించింది. రూ.19.28 కోట్లు వ్యయం అంచనాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. వారంలో నిధుల మంజూరుపై ప్రభుత్వం ప్రకటన చేస్తుందని అధికారులు చెబుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు కాల్వల మరమ్మతులను విస్మరించింది. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే కాల్వల మరమ్మతులకు రూ.22.54 కోట్లు విడుదల చేసిన విషయం తెలిసిందే. మరో విడత నిధుల విడుదలకు ప్రభుత్వం సిద్ధమైంది.

దుస్థితిలో కాల్వలు

మేజర్, మైనర్, సబ్ మైనర్ కాల్వలన్నీ అధ్వాన్న స్థితికి చేరుకున్నాయి. దీంతో సాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కాల్వల్లో కంప చెట్లు పెద్ద ఎత్తున పెరిగాయి. జమ్ము, తూటికాడ, రబ్బరు మొక్కలు అల్లుకుపోయాయి. డ్రాపులు పగిలిపోయి.. షట్టర్లు దెబ్బతిన్నాయి, చాలా మైనర్ కాల్వల తూములకు కనీసం షట్టర్లు కూడా లేవు. దీంతో నీటి సరఫరాలో నియంత్రణ ఉండడం లేదు. నీటి పారుదల సమయంలో ఎక్కువగా నాచు పెరుగుతోంది. నాచు పెరిగిన వెంటనే తొలగించకపోతే దిగువకు నీరు పూర్తి స్థాయిలో సరఫరా కాదు.

అధికారుల నిర్లక్ష్యం..నేతల జోక్యం

ప్రభుత్వం నిధులు విడుదల చేసినా.. జనవనరుల శాఖ అధికారులు పనులు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం తొలి విడతగా రూ.22.54 కోట్లు నిధులు విడుదల చేసింది. ఈ పనులు చేపట్టేందుకు గతేడాది మరమ్మతుల టెండర్లు నిర్వహించింది. కొందరు అధికార పార్టీ నేతలు అనుచరులకు పనులు దక్కకపోవడంతో బలవంతంగా టెండర్లు రద్దు చేయించారు. తిరిగి టెండర్లు నిర్వహించి, పనులు చేపట్టే అంశంలో అలసత్వం తాండవిస్తోంది. మాచర్ల, సత్తెనపల్లి డివిజన్‌లలో కాల్వల మరమ్మతులు పూర్తి చేశారు. వినుకొండ పరిధిలో 34 పనులు వ్యయం అంచనా రూ.1.78 కోట్లు. ఈ పనులను సకాలంలో పూర్తి చేయడంలో అధికారులు విఫలమయ్యారు. ఇందుకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తయింది. 24 పనులు చేపట్టారు. మిగతా పది పనులు కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్ చేసే ప్రక్రియ జరుగుతోంది. లింగం గుంట్ల ఓఅండ్ఎం డివిజన్ పరిధిలో 77 పనుల వ్యయం అంచనా రూ.4.21 కోట్లు. ఈ పనుల టెండర్ ప్రక్రియ పూర్తిచేయడంలో అధికారులు ఆపసోపాలు పడుతున్నారు. ఇక్కడ అధికార పార్టీ నేతలు టెండర్లు నిర్వహించకుండా అడ్డుతగులుతున్నారన్న విమర్శలున్నాయి. కాల్వలకు నీటి సరఫరా కూడా నిలిపివేశారు. అధికార పార్టీ నేతలు కరుణిస్తేనే ఈ డివిజన్‌లో పనులు జరిగే దుస్థితి నెలకొంది. ఈ రెండు డివిజన్‌లలో తొలి విడత నిధులతో పనులు పూర్తి చేయడంలో విఫలమైన అధికారులు.. రెండో విడత నిధుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయడం గమనార్హం. కాలువల మరమ్మతులపై అధికార పార్టీ నేతల జోక్యం రైతులకు శాపంగా మారింది. సాగు నీటి సంఘాలు కాల్వల మరమ్మతులపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.


మేజర్ కాలువలో పెరిగిన కంప చెట్లు


షట్టరు లేని తూము

355 మరమ్మతు పనుల గుర్తింపు

వినుకొండ, లింగంగుంట్ల, సత్తెనపల్లి, మాచర్ల డివిజన్లలో 355 అత్యవసర మరమ్మతులను అధికారులు గుర్తించారు. ఈ పనులు చేపట్టేందుకు రూ.19.28 కోట్ల వ్యయం అంచనా వేశారు. మాచర్ల నియోజకవర్గ పరిధిలోని 38 పనుల నిర్వహణకు రూ.2.17 కోట్లు, గురజాల నియోజకవర్గంలో 31 పనులకు రూ.2.17 కోట్లు, సత్తెనపల్లి నియోజకవర్గంలో 46 పనులకు రూ.2.34 కోట్లు, పెదకూరపాడు సెగ్మెంట్‌లో 36 పనులకు రూ.2.16 కోట్లు, తాడికొండ నియోజకవర్గంలో 34 పనులకు రూ.2 కోట్లు, నరసరావుపేట నియోజకవర్గంలో 51 పనులకు రూ.2.30 కోట్లు, చిలకలూరిపేట సెగ్మెంట్‌లో 29 పనులకు రూ.1.45 కోట్లు, ప్రత్తిపాడు నియోజకవర్గంలో 25 పనులకు రూ.1.49 కోట్లు, వినుకొండ నియోజకవర్గంలో 54 పనులకు రూ.2.70 కోట్లు, దర్శి నియోజకవర్గంలో 5 పనులకు రూ.20.48 లక్షలు, అద్దంకి నియోజకవర్గంలో 6 పనులకు రూ.26.56 లక్షలుగా ప్రతిపాదనలు పంపించడం జరిగింది.

హేతుబద్ధమే.. ప్రభుత్వ నిబద్ధత!

సచివాలయ వ్యవస్థను గాడిన పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జనాభా ప్రాతిపదికన గ్రామ, వార్డు సచివాలయాల హేతుబద్ధీకరణకు సిద్ధమైంది. అనసవర ఖర్చులు తగ్గించి, పాలనలో పారదర్శకత పెంచి, ఉద్యోగుల విధులు సమర్థంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. దీంతో గతంలో గ్రామాల ప్రాతిపదికన ఇబ్బడి ముబ్బడిగా ఏర్పాటైన సచివాలయాలు సగానికి పైగా తగ్గనున్నాయి. వీటిని ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించి జవాబు దారీతనం తీసుకురానుంది.

- గ్రామ, వార్డు సచివాలయాల రేషనలైజేషన్
- జనాభా ప్రాతిపదికన ఏ, బీ, సీ గ్రేడ్‌లుగా విభజన
- ప్రతిపాదనలు సిద్ధం చేసిన అధికారులు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1,583 సచివాలయాలు
- సగానికి తగ్గి... 798కి సంఖ్య పరిమితం
- గతంలో గ్రామాల ప్రాతిపదికన ఇబ్బడిముబ్బడిగా ఏర్పాటు

గుంటూరు సిటీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల హేతుబద్ధీకరణ(రేషనలైజేషన్) ప్రక్రియ ప్రారంభమైంది. జనాభా ప్రాతిపదికన హేతుబద్ధీకరణకు అధికారుల కసరత్తు దాదాపుగా ముగిసింది. ఒకటి రెండు చోట్ల తప్ప మిగిలిన అన్ని ప్రాంతాల్లో ప్రస్తుతం అధికారులు తయారు చేసిన జాబితానే తుది ఆమోదం పొందే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 1,583 గ్రామ, వార్డు సచివాలయాలు ఉండ గా ప్రస్తుతం ఆ సంఖ్య 798కి పరిమితం కానుంది. సగానికి పైగా సచివాలయాల సంఖ్య తగ్గనుంది. గుంటూరు జిల్లాలో 568 సచివాలయాకు 282, పల్నాడు జిల్లాలో 538 సచివాలయాలకు 268, బాపట్ల జిల్లాలో 477 సచివాలయాలకు 248 మిగలనున్నాయి. గ్రామాల ప్రాతిపదికన వీటిని ఏర్పాటు చేయగా.. ప్రస్తుతం జనాభా ప్రాతిపదికన హేతుబద్ధీకరణ ప్రక్రియ పూర్తి చేయనున్నారు.

మూడు గ్రేడులు

గ్రామ, వార్డు సచివాలయాలను జనాభా ప్రాతిపదికన ఎ, బి, సి గ్రేడ్‌లుగా ప్రభుత్వం విభజించనుంది. 2,500 మంది జనాభా ఉన్న సచివాలయాలను ఏ గ్రేడ్, 2,500 నుంచి 3,500 మంది జనాభా ఉన్న సచివా లయాలను బీ గ్రేడ్, 3,500మందికి పైగా జనాభా ఉన్న సచివాలయాలను సీ గ్రేడ్ నుంచి కిందకు తేనున్నారు. ఏ గ్రేడ్ సచివాలయంలో ఆరుగురు, బీ గ్రేడ్‌లో ఏడుగురు, సీ గ్రేడ్‌లో 8 మందికి పైగా సిబ్బందిని కేటాయిస్తారు. ప్రతి సచివాలయంలో ఒక సెక్రటరీ లేదా డిజిటల్ అసిస్టెంట్ ఉంటారు. సిబ్బందిని కూడా టెక్నికల్, నాన్ టెక్నికల్‌గా విభజించి విధులు అప్పగిస్తారు.



ప్రభుత్వానికి ప్రతిపాదనలు

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మండల ప్రజా పరిషత్ అధికారులు ఇప్పటికే హేతుబద్ధీకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వాటిని ప్రభుత్వ ఆమోదం కోసం మంగళవారం సాయంత్రానికి పంపాలని ఉన్నతాధికారులు ఆదేశించిన నేపథ్యంలో ఎంపీడీఓలు అప్రమత్తమయ్యారు. అయితే, జాబితాలు సిద్ధం చేసిన తర్వాత వాటిని స్థానిక ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేల సూచనల మేరకు ఒకటీ రెండు చోట్ల మార్పులు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.


తీపికబురు రాబోతోంది..!

- జంపని షుగర్ ఫ్యాక్టరీ స్థలంపై ప్రభుత్వం దృష్టి
- 77 ఎకరాల సద్వినియోగానికి ప్రణాళిక
- ప్రజలకు ఉపాధి కల్పన దిశగా ఆలోచన
- సీఎం ప్రకటన కోసం ఎదురు చూస్తున్న ప్రజలు

వేమూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా వేమూరు మండలంలోని జంపని గ్రామంలో మూతపడ్డ షుగర్ ఫ్యాక్టరీకి చెందిన విలువైన స్థలంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించినట్లు సమాచారం. రాజధాని సమీపంలో ఉన్న విలువైన భూమిని ప్రజలకు ఉపాధి కల్పించే విధంగా తీర్చిదిద్దాలన్న ఆలోచన పాలకులు ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు విశ్వసనీయ సమాచారం. 77 ఎకరాల ఫ్యాక్టరీ భూమిని ప్రజలకు ఉపయోగపడే విధంగా చేయాలన్న సంకల్పం కనబడుతోంది. తెనాలి, కొల్లూరు ప్రధాన రహదారిలోని ఈ భూమిలో 1974 డిసెంబరు 4న సహకార రంగంలో ఫ్యాక్టరీ నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. 1983-84లో క్రషింగ్ సీజన్ ప్రారంభించారు. 2012 వరకు ఫ్యాక్టరీ నడిచింది. 2012 ఫిబ్రవరి 20న మూతపడింది. ఫ్యాక్టరీ కోసం భూమిని సేకరించిన ప్రభుత్వం.. ఆనాడు రైతుల నుంచి అతి స్వల్ప ఖరీదుతో కొనుగోలు చేసింది. రేపల్లె ప్రాంతం నుంచి పెదకూరపాడు వరకు దాదాపు 12 వేల మందిని షేర్ హోల్డర్లుగా చేర్చుకుంది. ఫ్యాక్టరీ మూతపడడంతో ఉద్యోగులకు ఇంకా రూ.11 కోట్ల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఫ్యాక్టరీ నిర్వహణకు సహకార సంస్థలు ప్రైవేట్ సెక్టార్ల నుంచి తెచ్చిన అప్పు వడ్డీతో కలిపి రూ.180 కోట్ల వరకు చేరుకుంది. జంపనితో పాటు రాష్ట్రంలో సహకార రంగంలోని 9 ఫ్యాక్టరీల పరిస్థితి ఇలాగే ఉంది. అయితే, జంపని ఫ్యాక్టరీ భూములపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. సీఎం చంద్రబాబునాయుడు వ్యవసాయ ఆధారిత పరిశ్రమను కానీ, ఇంకేదైనా పరిశ్రమను ఇక్కడ ఏర్పాటు చేసి, ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పించే విధంగా ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం. 3 వేల మందికి ప్రత్యక్షంగా.. వేల మందికి పరోక్షంగా లాభం కలిగించేందుకు ప్రయత్నం జరుగుతోంది. ఫ్యాక్టరీ సామగ్రిని రూ.9 కోట్లకు స్థలం పరిధిలో ఉన్న చెట్లను రూ.55 లక్షలకు విక్రయించారు. వ్యవసాయ ఆధారిత గ్రామీణ ప్రాంతంలో ఉన్న ఈ ప్రభుత్వ భూమిని సద్వినియోగం చేసే విషయంలో ప్రజలంతా ఏకాభిప్రాయాన్ని వ్యక్తపరుస్తున్నారు. ప్రభుత్వ ఆస్తి వృథాగా ఉండే కన్నా సద్వినియోగం చేస్తే ప్రభుత్వానికి, ప్రతినిధులకు మంచి పేరు వస్తుందని పేర్కొంటున్నారు.


మూతపడ్డ జంపని షుగర్ ఫ్యాక్టరీ

ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు చేయాలి



(బాపట్ల, ఆంధ్రజ్యోతి) గుండ్లకమ్మ ప్రాజెక్టు నిర్వాసిత ప్రాంతం కింద తమ గ్రామానికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని అమలు చేయడంలో ఏళ్ల తరబడి నిర్లక్ష్యం వహిస్తున్నారని, అద్దంకి మండలం తిమ్మారెడ్డిపాలెం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌ను కలిసి తమ సమస్యలను విన్న వించారు. 2006 నుంచి గ్రామంలో తాగునీరు మొదలుకుని.. రోడ్ల వరకు అన్ని సమస్యలు అపరిష్కృతంగానే ఉండిపోయానని వివరించారు. భూములు కోల్పోయిన వారికి నష్ట పరిహారం ఇంకా 25 ఎకరాలకు పెండింగ్‌లోనే ఉందని జేసీ దృష్టికి తీసుకొచ్చారు. ఇదే విషయాన్ని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సీసీఎల్ఏ కమిషనర్‌తో మాట్లాడారని చెప్పారు. మంత్రి గొట్టిపాటి కూడా సమస్య పరిష్కారానికి సానుకూలంగా స్పందించారని తెలిపారు. దీంతో తక్షణమే స్పందించిన జేసీ ప్రఖర్‌జైన్ ప్రాజెక్టు ఎస్‌డీసీని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలపై కదలిక రావడంతో తిమ్మారెడ్డిపాలెం వాసులు హర్షం వ్యక్తం చేశారు. జేసీని కలిసిన వారిలో చందలూరి రామాంజనేయులు, బత్తుల సుబ్బారావు, అంజయ్య తదితరులున్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ పార్వతి

ఇళ్ల పట్టాలపై అధికారుల సర్వే

- 10 ప్రత్యేక బృందాల ఏర్పాటు
- యజమానులు అన్నిపత్రాలు అందుబాటులో ఉండాలని సూచన

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దత్తక్షేత్రం, రోశయ్య కాలనీ, చేనేత కాలనీల్లోని ఇళ్ల పట్టాలపై అధికారులు సర్వే చేపట్టనున్నారు. ఇక్కడి సమస్యపై బాధితులు పలుమార్లు అధి కారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో జిల్లా అధికారుల సూచనల మేరకు తహసీల్దార్ పార్వతి ఆధ్వర్యంలో 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు మూడు రోజుల పాటు (16,17,19 తేదీల్లో) ఆ ప్రాంతాల్లో సర్వే నిర్వహించి ఆరోపణలపై లెక్కలు తేల్చనున్నారు. సుమారు 2వేల పట్టాలను పరిశీలించనున్నారు. అందుకు సంబంధించి మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

సర్వేకు సహకరించండి

మూడు గ్రామాల్లో వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు సర్వే చేయనున్నారు. ఈక్రమంలో సంబంధిత పట్టాదారులు, కొనుగోలు దారులు అవసరమైన భూ పత్రాలను అందుబాటులో ఉంచుకుని సర్వే సిబ్బందికి సహకరించాలి. సర్వేలు తేడాలను గుర్తించి, శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

- తహసీల్దార్ పార్వతి

నేడు మండల సర్వసభ్యసమావేశం

మార్టూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉదయం మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో వై.శ్రీనివాసరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు విధిగా హాజరు కావాలని కోరారు.

కందుకూరి రాష్ట్ర పురస్కారానికి ఎంపికైన కందిమళ్ల



మార్టూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోలలపూడి గ్రామానికి చెందిన ప్రముఖ నాటక రచయిత రంగస్థల ప్రముఖుడు మార్టూరు శ్రీకారం రోటరీ కళా పరిషత్ అధ్యక్షుడు డాక్టరు కందిమళ్ల సాంబశివరావుకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ కందుకూరి రాష్ట్ర పురస్కారాన్ని మంగళవారంప్రకటించింది. కందిమళ్ల తెలుగునాటక రంగం నూతనధోరణులు ప్రయోగాలు అనే అంశంపై పీహెచ్‌డీ, గుంటూరు జిల్లా నాటకరంగ చరిత్ర అనే అంశంపై డిలిట్ పట్టాలను నాగార్జున బరంపురం విశ్వ విద్యాలయాల నుంచి పొందారు. సారా సంహారం,సైసై జోడెడ్లబండి వంటి 18 నాటకాలు నాటికలను రచించారు. ఉత్తమ నాటకరచయితగా నాగార్జున, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారాలను పొందారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కళారత్న,ప్రపంచ తెలుగు మహాసభల పురస్కారాలతోగిడుగు తెలుగుభాషా పురస్కారాలను పొందారు.కందిమళ్ల రచించిన అభినయ భారతాచార్య చాట్ల శ్రీరాములు తెలుగునాటక ఉద్యమ నేపథ్యం నాటక గ్రంధాలకు ప్రభుత్వ నంది పురస్కారాలు లభించాయి.సాంబ శి వరావు చిలకలూరిపేటలోని డిఆర్ ఎన్ యస్‌సి విఎస్ కళాశాలనుండి తెలుగు ప్రొఫెసర్ గా ఉద్యోగ విరమణ చేశారు. కందుకూరి రాష్ట్ర పురస్కారాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలుగునాటక రంగదినోత్సవాన్ని పురస్కరించుకొని బుధ వారం విజయవాడ లో జరిగే సభలో ప్రధానం చేస్తారు. అయితే ప్రస్తుతం సాంబ శి వరావు అమెరికాలో ఉన్నారు.

కారును తాకుతూ రోడ్డు

పోలీసులను ఆశ్రయించిన బాధితుడు



కారు టైరుపై నుంచే వేసిన సీసీ రోడ్డు

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఇంటి వద్ద పార్కింగ్ చేసిన కారుకు స్థలం ఉంచకుండా టైరులో నుండే అధికారులు సీసీ రోడ్డు నిర్మించారని ఓ వ్యక్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఆమోదగిరి పట్నానికి చెందిన యర్రా రూపానంద్ చేనేత కార్మికుడు. అయితే బంధువు అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉండగా అధికారులు ఇంటి వద్ద పార్కింగ్ చేసి ఉన్న కారు ముందు చక్రం మీదుగా సీసీ రోడ్డును నిర్మించారు. ఈక్రమంలో ఇంటికి వచ్చి చూసుకున్న రూపానంద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఈ స్థలం విషయంలో గతంలో అధికారులతో వివాదం కూడా జరిగినట్లు సమాచారం.

చిల్లర కొట్టులో చోరీ

రూ.59,245 విలువైన బంగారం, నగదు, సిగరెట్ల అపహరణ

అద్దంకి, ఏప్రిల్ 15 : చిల్లర కొట్టు నిర్వహించే ఇంట్లో చోరీ జరిగి సుమారు రూ.59,245 విలువైన బంగారం, నగదు, సిగరెట్లు అపహరణకు గురయ్యాయి. పోలీస్‌ల కథనం మేరకు.. అద్దంకి పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల నుంచి కొత్తపేట వెళ్లే రోడ్డులో పల్లబోతు రోశమ్మ ఇంట్లో బడ్డీ దుకాణం నిర్వహించుకుంటూ ఉంది. సోమవారం రాత్రి దుకాణం మూసి వేసి ఆయిల్ మిల్ రోడ్డులోని కుమార్తె ఇంటికి వెళ్లింది. మంగళవారం ఉదయం వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు. ఇంట్లో ఉన్న 12 వేల రూపాయల నగదు, 5 గ్రాముల చెవి కమ్మలు, 40 పెట్టెల వివిధ కంపెనీల సిగరెట్‌లు అపహరించుకు పోయారు. ఇంట్లో వెనుక వైపు తలుపు తెరిచి లోపలకు ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. రోశమ్మ అల్లుడు సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. అయితే చోరీ జరిగిన తీరును బట్టి స్థానికంగా ఉండే దొంగలే చోరీకి పాల్పడి ఉంటారని పోలీస్‌లు భావించి ఆ కోణంలో విచారణ చేపట్టినట్లు తెలుస్తుంది. ఈ క్రమంలో ఇప్పటికే చోరికి పాల్పడ్డ యువకులకు సంబంధించిన సమాచారం కూడా లభ్యమైనట్లు సమాచారం.

వృద్ధాశ్రమంలో అన్నదానం

అద్దంకిటౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో మంగళవారం శింగరకొండలోని వృద్ధాశ్రమంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కొత్తపేటకు చెందిన గుంజి వెంకయ్యమ్మ జ్ఞాపకార్థం కుమారుడు, రోటరీ సభ్యుడు గుంజి హనుమంతరావు ఆర్థిక సాయంతో శ్రీరామ వృద్ధ ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు, దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తగ్గిన కూరగాయల ధరలు

- కొనుగోలు దారులు రాక కమీషన్ ఏజెంట్ల ఇక్కట్లు
- కిలో వంకాయ రూ.3
- సొరకాయలు కొనేవారే లేరు
- మార్టూరు పచ్చిమిర్చి కూరగాయల మార్కెట్‌లో ఇదీ పరిస్థితి

మార్టూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : నెలరోజుల కిందట మార్టూరు పచ్చి మిర్చి కూరగాయల మార్కెట్‌లో కూరగాయల ధరలు భగ్గుమన్నాయి. మార్కెట్‌కు కూరగాయలను తీసుకువచ్చిన రైతులు కూడా ఆనందంగా ఉన్నారు. కానీ పరిస్థితి భిన్నంగా మారిది. ముఖ్యంగా గత 20 రోజుల నుంచి కూరగాయల ధరలు పడిపోయాయి. కిలో వంకాయ 3 రూపాయలు, దోసకాయలు రూ.4 ఉన్నా కొనేవారే లేరు. సొరకాయలైతే కొనుగోలు చేసే వారు రాకపోవడంతో కొంతమంది కమీషన్ ఏజెంట్లు వాటిని సమీపంలోని గోశాలకు పంపిస్తున్నారు.కనీసం సొరకాయను రూపాయికి కూడా కొనుగోలు చేయడంలేదని వాటిని తీసుకువచ్చిన రైతులతో పాటు, కమీషన్ ఏజెంట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్టూరు మార్కెట్‌కు విజయవాడ, రాజమండ్రి, గుడివాడ, నెల్లూరు, ఏలూరు, నరసరావుపేట, గుంటూరు, ఒంగోలు, తెనాలి, భీమవరం, వైజాగ్ తదితర పట్టణాలులోని మార్కెట్‌లకు చెందిన వ్యాపారులు కూరగాయల కొనుగోలు కోసం వస్తుంటారు. అయితే అక్కడ స్థానికంగా సాగుచేసిన కూరగాయలు అందుబాటులో ఉండడంతో ఈ మార్కెట్‌కు కూరగాయలు కొనేందుకు వారు రావడం లేదు. దాంతో కూరగాయల ధరలు పూర్తిగా తగ్గాయని రైతులు అంటున్నారు. అదీ గాకుండా వేసవి కాలం కావడంతో స్కూళ్లకు చెందిన హాస్టళ్లు మూతపడ్డాయి. ఇతర శుభకార్యక్రమాలు తక్కువగా ఉండడంతో కూరగాయలకు డిమాండ్ తగ్గిందని ఏజెంట్లు అంటున్నారు. దానికి తోడు మార్టూరు ప్రాంతంలో షేడ్ నెట్‌ల ద్వారా కూరగాయల సాగు పెరగడంతో విపరీతంగా కూరగాయలు దిగుబడి రావడం, చుట్టుపక్కల మండలాల్లో బోర్లు, బావుల కింద సాగు చేసిన కూరగాయలు రావడంతో మార్కెట్‌కు వచ్చే కూరగాయలు దిగుబడి తగ్గలేదు. మంగళవారం మార్టూరు కూరగాయల మార్కెట్‌లో కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. 10కిలోలు ప్రకారం వంకాయలు రూ.30 నుంచి రూ.40, దోసకాయలు రూ.30 నుంచి రూ.50, బెండ రూ.50 నుంచి రూ.100, గుమ్మడి కాయలు రూ.80 నుంచి రూ.100, టమాట రూ.250 నుంచి రూ.400, బీరకాయలు రూ.100 నుంచి రూ.120, కాకర రూ.200 నుచి రూ.250, ములగ రూ.150, గోరుచిక్కుళ్లు రూ.100 నుంచి రూ.120, మిర్చి రూ.300 నుంచి రూ.450, దుంపలు రూ.200 నుంచి రూ.250, దొండ రూ.100 నుంచి రూ.120 ధరలు పలుకుతున్నాయి. ఇవన్నీ కూరగాయలను మార్కెట్‌కు తీసుకువచ్చిన రైతులకు పడుతున్న ధరలు. కానీ విడిగా సాధారణ మధ్యతరగతి ప్రజానీకం దగ్గరకు గ్రామాలకు చిల్లరగా వచ్చే కూరగాయల ధరలు రెట్టింపు పలకడంవిశేషం.



మార్కెట్‌లో ఉన్న దోసకాయలు



కొనుగోలు లేక మిగిలిన సొరకాయలు



గుత్తి వంకాయలు

బాడుగ డబ్బులు కూడా ఇచ్చాను



నిన్న విజయవాడ మార్కెట్ కు మినీ లారీలో సొరకాయలను పంపించాను.వారు సొరకాయలకు డబ్బులు ఇవ్వకపోయినా,కనీసం బాడుగ డబ్బులు కూడా నన్నే ఇమ్మన్నారు. రెండు రోజుల క్రితం కొనేవారు లేక గోశాలకు సొరకాయలను పంపించాను.నెలరోజులనుండి ధరలు తగ్గడంతో కొంతమంది ఏజంట్లు వ్యాపారం ఆపివేశారు.రైతులను వదులుకోలేక అప్పులు పాలవుతూ వ్యాపారం చేస్తున్నాం.

- దారా రామారావు కమీషన్ ఏజెంట్

పశువుల మేతకు

వంకాయల బస్తా రూ.200లకు ఇస్తున్నాం



మాది కొణిదెన గ్రామం.ఎ కరా వంకాయల తోట వేశాను. 50 వేల దాకా పెట్టుబడి పెట్టాను.,ఇప్పటికి 40 కోతలు కోశాను,మొదట్లో 10 కిలోలు 70 నుండి 100 రుల దాకా ధరకు అమ్మాను.ఈ రోజు తీసుకువచ్చిన వంకాయలు కిలో 3 రులకు కూడా కొనడం లేదు.మా గ్రామంలో సాటి రైతులు బస్తా వంకాయలను పశువులమేతకోసం 200 రులకు అమ్ముతున్నారు.కోత కూలి,ఆటో బాడుగ,గోతాల ఖర్చులకు చేతి డబ్బులు పడుతున్నాయి.

- గుత్తి వీరాంజనేయులు,
కొణిదెన, బల్లికురవ మండలం

అనంతపురం జిల్లా రైతుల పొగాకు కొనుగోలుకు ముందుకొచ్చిన జీపీఐ



ఏవో శ్రీనివాసరావుతో మాట్లాడుతున్న అనంతపురం రైతులు



పొగాకు లోడ్‌తో పార్కింగ్ చేసి ఉన్న లారీలు

మేదరమెట్ల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : అనంతపురం జిల్లా పెద్దఒడుగూరు మండలంలోని లక్ష్మీపల్లి, గజదారిపల్లి, చిన ఒడుగూరు గ్రామాలకు చెందిన 25 మంది రైతులు 8 లారీల్లో పొగాకును (వైట్‌బర్లీ) విక్రయించేందుకు మేదరమెట్ల గ్రామానికి ఐదు రోజుల కిందట వచ్చారు. మేదరమెట్ల గ్రామానికి చెందిన పొగాకు కొనుగోలు చేసే వ్యాపారి మాటలు నమ్మి వారు ఇక్కడకు లోడులతో వచ్చారు. కానీ ఆ వ్యాపారి రైతుల వద్ద ఉన్న పొగాకును కొనుగోలు చేసేందుకు నిరాకరించారు. విషయాన్ని స్థానిక విలేకరులు వ్యవసాయాధికారి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన గ్రోత్ సెంటర్‌లో ఉన్న గాడ్‌ఫ్రే ఫిలిప్ ఇండియా (జీపీఐ) ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పొగాకు కొనుగోలుకు మార్గం సుగమం చేశారు. దీంతో అనంతపురం జిల్లా రైతుల పొగాకును కొనుగోలు చేసేందుకు జీపీఐ ముందుకు వచ్చింది. రైతులకు వద్ద ఉన్న పొగాకును నిబంధనల మేరకు కొనుగోలు చేయడానికి ముందుకువచ్చారు. దీంతో ఐదు రోజుల నిరీక్షణకు తెరపడినందుకు రైతులు హర్షం వ్యక్తం చేశారు.

బాలుడి చికిత్స కోసం పూర్వ విద్యార్థుల సాయం

అద్దంకిటౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): బాలుడు చికిత్స కోసం సేవా స్ఫూర్తి కమిటీ 1989-90 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయాన్ని అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం చిన్న ఉల్లగల్లు గ్రామానికి చెందిన పదేళ్ల బాలుడు తప్పెట యాయిత్య కిడ్నీ, లివర్, యూరినల్ సమస్యలతో 3 సంవత్సరాలుగా చికిత్స పొంతున్నాడు. ఆర్థిక స్థోమత లేక కుంగిపోతున్న తల్లిదండ్రులు చిన్న, రాజమ్మ సేవా స్ఫూర్తి సభ్యులైన, గ్రామం లో టీచర్‌గా పని చేస్తున్న బత్తుల పురుషోత్తంను ఆదుకోవాలని కోరారు. దీంతో అతను కమిటీ దృష్టికి తీసుకు రాగా వెంటనే స్పందించిన పూర్వ విద్యార్థు లందరూ రూ.70,500 సాయాన్ని మంగళవారం అద్దంకిలోని గీతా మందిర్ వద్ద తల్లిదండ్రుల సమక్షంలో బాలుడికి అందజేశారు. బాలుడి ఆరోగ్యం కోసం మును ముందు కూడా మావంతు సాయం అందిస్తామని జాగ్రత్తగా వైద్యం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా బాలుడు ఆరోగ్యం కోసం వెంటనే స్పందించి సాయం అందించిన మిత్రులందరికీ కమిటీ సభ్యులు కృత జ్ఞతలు తెలిపారు.

వల్లాపల్లి విద్యార్థికి గిన్నిస్ వరల్డ్ రికార్డ్



గిన్నిస్ వరల్డ్ సర్టిఫికెట్‌తో వల్లాపల్లికి చెందిన వివేక్



కీబోర్డ్‌ను వాయిస్తున్న వివేక్

బల్లికురవ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : హోలెల్ మ్యూజిక్ స్కూల్ తరపున క్రిస్టియన్ సంగీత పోటీల్లో బల్లికురవ మండలం వల్లాపల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన మందా వివేక్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌ను సాధించాడు. గత ఏడాది డిసెంబర్ 1న క్రిస్టియన్ గీతాలపై ప్రపంచ స్థాయిలో జరిగిన ఆన్‌లైన్ మ్యూజిక్ ప్రదర్శనలో వివేక్ కీబోర్డు వాయిస్తూ పాల్గొన్నాడు. కీబోర్డును వాయిస్తున్న సంగీత కళాకారుల బృందం గంటలో 1046 వీడియోలను అప్‌లోడ్ చేశారు. ఈ బృందంలో వివేక్ కూడా ఉన్నాడు. దీంతో వివేక్‌కు గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు దక్కింది. సోమవారం హైదరాబాద్‌లో వివేక్‌కు పాస్టర్ ఆగస్టీన్ చేతుల మీదుగా సర్టిఫికెట్‌ను, మెడల్‌ను అందజేశారు. వల్లాపల్లి ప్రాథమిక పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న వివేక్ మెదటి చిన్నప్పటి నుంచే క్రిస్టియన్ పాటలు అంటే ఎంత మక్కువ. తండ్రి మందా రమేష్ ప్రోత్సాహంతో సంగీత పోటీల్లో పాల్గొని ప్రతిభ సాధించాడు. వివేక్‌ను ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.



బార్ అసోసియేషన్ ఎన్నికల్లో గెలుపొందిన సభ్యులు

ముగిసిన బార్ అసోసియేషన్ ఎన్నికలు

- మూడవ సారి అధ్యక్షునిగా రమేష్‌బాబు
- స్వల్ప ఓట్లతో ఓటమి చవిచూసిన సీనియర్ న్యాయవాది నాగేశ్వరరావు

చీరాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు బార్ అసోసియేషన్ ఎన్నికలు ఉత్కంఠ భరితంగా మంగళవారం ముగిశాయి. ఎన్నికల అధికారిగా రవి కుమార్‌రెడ్డి వ్యవహరించగా ఉదయం నుంచి జరిగిన ఎన్నికల్లో మొత్తం 201 ఓట్లకు గాను 190 పోలయ్యాయి. సాయంత్రం ప్రారంభమైన కౌంటింగ్ ఒక దశలో టెన్షన్ వాతావరణం నెలకొంది. ఎట్టకేలకు సీనియర్ న్యాయవాది కొమ్మనబోయిన నాగేశ్వరరావుకు 91 ఓట్లు దక్కగా, 97 ఓట్లు సాధించి 6 ఓట్ల మెజారిటీతో మూడవ సారి కూడా గౌరవ రమేష్‌బాబు విజయాన్ని అందుకున్నారు. ఒక ఓటు నోటా కాగా, ఉపాధ్యాక్షుడిగా విజయ కుమార్, జనరల్ సెక్రటరీగా రవికుమార్, ట్రెజరరీగా రామ కోటేశ్వరరావు, లైబ్రరీగా కామేశ్వరరావు ఎన్నికయ్యారు. కల్చరర్ సెక్రటరీగా రాజా సాల్మన్, జాయింట్ సెక్రటరీగా సయ్యద్ మస్తాన్‌వలి, మహిళా ప్రతినిధిగా స్నేహ మాత్రమే వేయడంతో ఆ రెండు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ఎన్నికైన వారిని సహచర న్యాయవాదులు అభినందించారు.

ట్రాక్టర్ ప్రమాదంలో వ్యక్తి మృతి



ట్రాక్టర్ ట్రక్కు టైరు కింద పడి మృతి చెందిన అంజయ్య

పంగులూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆదిరెడ్డి బావి మలుపు సమీపంలో ట్రాక్టర్ ఒరిగి ట్రక్కు టైరు కింద పడి గోళ్లమూడి అంజయ్య (45) మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. అందిన సమాచారం మేరకు.. కోటపాడు గ్రామానికి చెందిన పూసపాటి శివ శంకర్ మంగళవారం రాత్రి ముప్పవరం వైపు నుంచి ట్రాక్టర్ నడుపుకుంటూ స్వగ్రామానికి వస్తున్నారు. ట్రాక్టర్ ఆదిరెడ్డి బావి సమీపంలో రోడ్డు మార్జిన్‌లో ఒరిగి పడి పోవడంతో ట్రక్కుపై కూర్చున్న కోటపాడు గ్రామానికి చెందిన గోళ్లమూడి అంజయ్య ప్రమాదవశాత్తు తిరగబడ్డ ట్రక్కు టైరు కిందపడి మృతి చెందారు.

నేడు కనిగిరిలో అమరజీవి జయంతి

కనిగిరి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలు బుధవారం కనిగిరిలో ఘనంగా జరుగనున్నాయి. కందుకూరు రోడ్డులోని ఎంబీఆర్ ఫంక్షన్ హాలులో నిర్వహించే ఉత్సవాల ఏర్పాట్లను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి మంగళవారం పరిశీలిం చా రు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఉత్సవాల్లో జిల్లాలోని మం త్రులు, ఎమ్మెల్యేలు పాల్గొంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు.

పోలేరమ్మ ఆలయంలో చోరీ

ముండ్లమూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూజెండ్లపల్లిలో గల పోలేరమ్మ దేవాలయంలో మంగళవారం మధ్యాహ్నం చోరీకి పాల్పడ్డారు. ఆలయం పక్కనే పొలం ఉన్న పల్లా సుబ్బారావు వెళ్తుండగా ఇద్దరు దొంగలు అక్కడ సంచ రిస్తున్నారు.

10 వేల ఎకరాల భూ సమీకరణ!

(5వ పేజీ తరువాయి)

అభివృద్ధి చేయాలని భావిస్తోంది. రాజధాని అమరావతి నిర్మాణానికి ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం వివిధ గ్రాంట్లతో కలిపి రూ.45 వేల కోట్లు ఖర్చు చేస్తోంది. ఇదికాకుండా బ్యాంకుల నుంచి, ఇతర ఆర్థిక సంస్థలు కలిపి మొత్తంగా మరో రూ.55 వేల కోట్ల వరకు నిధులు సమీకరించాలని భావిస్తోంది. మొత్తం లక్ష కోట్లతో అమరావతి నిర్మాణ పనులు చేస్తుంటే, సమాంతరంగా ఆర్థికంగా అభివృద్ధి చెందకపోతే భవిష్యత్తులో సంక్షోభం చవిచూసే ప్రమాదం ఉంది. అందువల్ల ప్రపంచ బ్యాంకు సూచించిన విధంగా అమరావతి నిర్మాణ పనులతో పాటు ఆర్థికాభివృద్ధిని సాధించే ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టాల్సి వస్తోంది.

స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీతో అనేక ప్రయోజనాలు

అంతర్జాతీయ విమానాశ్రయం తర్వాత స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీ ప్రాజెక్టును కూడా ప్రభుత్వం ఎంచుకుంది. టెక్నాలజీ ఆధారిత పారిశ్రామిక నగరాన్ని స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీ అంటారు. ఇందులోని పరిశ్రమలు డిజిటల్‌గా ఇంటిగ్రేట్ అయి ఉంటాయి. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ) ద్వారా ఉత్పాదకతను పెంచడం, గ్రీన్ ఎనర్జీ అంటే సౌర, పవన శక్తి, వేస్ట్ మేనేజ్‌మెంట్ పరిశ్రమలు ఉంటాయి. అలాగే, ఇవన్నీ కూడా రోడ్లు, రైల్వేస్టేషన్, విమానాశ్రయానికి అనుసంధానం (మల్టీమోడల్ కనెక్టివిటీ)గా ఉంటాయి. స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీ వల్ల భారీ ఎత్తున పెట్టుబడులను ఆకర్షించవచ్చు. తద్వారా ఉద్యోగాల సృష్టి ఎక్కువగా జరుగుతుంది. స్థానిక ఆర్థిక వ్యవస్థకు మంచి ప్రోత్సాహం ఇస్తుంది. అందుకే ఈ ప్రాజెక్టు కోసం 2,500 ఎకరాలను సమీకరించాలని నిర్ణయించింది.

అవుటర్, ఇన్నర్ రింగ్ రోడ్ల మధ్య ప్రాంతం పరిశీలన

ఈ మూడు ఎకనమిక్ బూస్ట్ ప్రాజెక్టులకు ఇన్నర్, అవుటర్ రింగ్ రోడ్ల మధ్యన భూములు సమీకరిస్తేనే సార్థకత ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. మల్టీ మోడల్ కనెక్టివిటీ సాధించాలంటే.. ఈ ప్రాంతమే మంచిదని యోచిస్తోంది. అమరావతి నూతన రైల్వే లైను కూడా మంజూరైన సంగతి తెలిసిందే. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం నుంచి అమరావతి మీదుగా నంబూరు వరకు ఈ రైల్వేలైన్ వెళ్తుంది.. దీనికోసం 800 ఎకరాలు సేకరించాల్సి ఉంటుంది. ఈ భూములను కూడా అమరావతిలో వైకుంఠపురం, ఎండ్రాయి, కర్లపూడి, తాడికొండ గ్రామాల్లో సేకరించాల్సి ఉంటుంది. సీఆర్‌డీఏ ద్వారా ఇక్కడి భూములను సమీకరించి ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఎయిర్‌పోర్టు కోసం భూములు ఎక్కడ తీసుకోవాలన్న దానిపై ఇంకా స్పష్టత లేదు. ఎయిర్‌పోర్టు ఎక్కడ ఏర్పాటు చేయాలన్న దానిపై ఏఏఐ అధికారులతో చర్చించాక కానీ ఓ స్పష్టత రాదు. ఎయిర్‌పోర్టు అవసరాల కోసం తుళ్లూరు మండలంలోని వడ్డమాను, పెద్దపరిమి, హరిశ్చంద్రపురం, తాడికొండ మండలంలోని మోతడక గ్రామాల్లో భూ సమీకరణ ద్వారా భూములను తీసుకోవాలనుకుంటున్నారు.

మరో 30 వేల ఎకరాలపై దృష్టి

అమరావతిలో గవర్నమెంట్ కాంప్లెక్స్ పనులన్నీ పూర్తయ్యాక రాజధాని విస్తరణ ప్రక్రియను ప్రారంభించాలన్నది ప్రభుత్వ ఆలోచన. గవర్నమెంట్ కాంప్లెక్స్ పనుల్లో ఐకానిక్ టవర్లు మినహా మిగిలినవన్నీ రెండేళ్లలో పూర్తవుతాయి. మిగిలిన 30 వేల ఎకరాలను రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల కోసం, అనేక భాగస్వామ్య సంస్థలకు కేటాయించేందుకు వీలుగా సమీకరించాలన్న ఆలోచన జరుగుతోంది. దేశంలోనే పేరెన్నికగన్న రియల్ ఎస్టేట్ అండ్ డెవలపింగ్ సంస్థలను కూడా ఇప్పటికే ఆహ్వానించారు. ఇలాంటి ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలన్నింటికీ అవసరమైన భూములను సమీకరించాలని, నిధులను కూడా సమీకరించాలని ప్రభుత్వం భావిస్తోంది.


గుంతలమయంగా ఉన్న ప్రధాన రహదారి

రోడ్డంతా గుంతలే!

» అవస్థలు పడుతున్న ప్రజలు » రాకపోకలకు ఇబ్బంది
» సమస్యలు పరిష్కరించాలని బుర్లవారిపాలెం వాసుల వేడుకోలు

బుర్లవారిపాలెం(చీరాల), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఒకే ఒక్క రోడ్డు.. ఆ రోడ్డుపై వంద గుంతలు. ఇదీ మండల పరిధిలోని బుర్లవారిపాలెం రహదారి దుస్థితి. ప్రమాదకరమైన రహదారితో గ్రామ ప్రజలు అవస్థలు పడుతున్నారు. సుమారు 500 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. దాదాపు అందరూ నిరుపేదలు కావడంతో రోజువారీ కూలీ, వ్యవసాయం, ఆకు కూరలు సాగు వంటి వాటి మీద ఆధారపడి జీవిస్తున్నారు. రోజువారీ కార్యకలాపాల కోసం నిత్యం గ్రామం నుంచి ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. చీరాల, బాపట్ల వైపు వెళ్లేందుకు అనుసంధానంగా ఉన్న 216 జాతీయ రహదారి నుంచి గ్రామానికి దాదాపుగా కిలో మీటరు రహదారి ఉంది. అదీకూడా వంద గుంతలతో పూర్తిగా ధ్వంసమై ఉంది. ఈ మార్గంలో ప్రమాదకరమైన మలుపు కూడా ఉంది. అటువైపు విద్యుత్ సౌకర్యం కూడా లేదు. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తమగోడు పట్టించుకోవాలని కోరుతున్నారు.


ప్రమాదకరంగా ఉన్న మలుపు

యువత ఉపాధి కల్పనకు కృషి

» అధికారులతో ఎమ్మెల్యే కొండయ్య సమీక్ష
» సమస్యలపై చర్చ, ప్రజాభిప్రాయ సేకరణ

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డా.మహేంద్రనాథ్‌తో కలిసి తహసీల్దార్ పాలపర్తి పార్వతి ఆధ్వర్యంలో వేటపాలెం పంచాయతీ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఇప్పటి వరకు జరిగిన కుటుంబ సాధికారత సర్వేపై ఆరా తీశారు. ఈక్రమంలో నిరుద్యోగులు, ఇతరులకు సంబంధించిన ఉపాధి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రజలతో చర్చించి అభిప్రాయం సేకరించడంతో పాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈక్రమంలో వేటపాలెం కూరగాయాల మార్కెట్, పంచాయతీ పార్కుల ఆధునికీకరణపై ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామాల్లో తాగునీరు, అంతర్గత రహదారులు, డ్రెయిన్లు, నివేశన స్థలాలు, పెన్షన్ సమస్యలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి, ఆప్కో చైర్మన్ సజ్జా హేమలత, ఏఎంసీ చైర్మన్ కౌతవరపు జనార్దనరావు, రవికుమార్, డీఈ శేషయ్య, అధికారులు, ప్రజలు టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు కొత్తపేట ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో యార్లగడ్డ శ్రీహరి కళావేదికను ప్రారంభించారు. రామన్నపేట పంచాయతీ రావూరిపేటలో పాఠశాలలో నిర్మాణాన్ని ప్రారంభించారు. అనంతరం ఏడవ పౌష్టికాహార పక్షోత్సవ కార్యక్రమంలో పాల్గొని పౌష్టికాహారాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. చీరాల, పేరాల పరిధిలోని పలు చలివేంద్రాలను ప్రారంభించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య, మాజీ ఎమ్మెల్యే గోవర్ధనరెడ్డి, తహసీల్దార్ పార్వతి

రక్షణ కవచం శక్తి యాప్

ట్రైనీ డీఎస్పీ అభిషేక్

ఈపూరుపాలెం(చీరాల), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థినులకు శక్తి యాప్ రక్షణ కవచమని ట్రైనీ డీఎస్పీ అభిషేక్ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం మండల పరిధిలోని ఈపూరుపాలెం బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినులతో సుదీర్ఘంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనుమానితుల నుంచి దూరంగా ఉండాలని సూచించారు. నేరాలను గుర్తిస్తే సమాచారాన్ని స్థానికంగా ఉన్న పోలీస్ స్టేషన్‌కు వెంటనే అందించాలని సూచించారు. ఆయనతోపాటు ఎస్సై హరిబాబు, కానిస్టేబుల్ సుబ్బారావు, సునీత, పాఠశాల బోధన బోధనేతర సిబ్బంది, బాలికలు పాల్గొన్నారు.


శక్తి యాప్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ట్రైనీ డీఎస్పీ అభిషేక్


పర్చూరు బొమ్మల సెంటర్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు, రైతులు

నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేయాలి

రైతుల నిరసన, రాస్తారోకో

పర్చూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : నల్లబర్లీ పొగాకును వెంటనే కొనుగోలు చేసేవిధంగా ఆయా కంపెనీల ప్రతినిధులతో ప్రభుత్వం చర్చలు జరపాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. నల్లబర్లీ పొగాకు రైతులతో కలిసి రైతు, కౌలు రైతు సంఘం నాయకులు మంగళవారం నిరసన, రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెద్ద ఎత్తున పొగాకును సాగు చేయాలని గతంలో సూచించిన కంపెనీలవారు ఇప్పుడు కొనుగోలుకు ముందుకు రావడం లేదన్నారు. దీంతో రైతులకు పాలుపోని పరిస్థితి ఏర్పడిందన్నారు. వెంటనే ఆయా కంపెనీల వారు పొగాకు కొనుగోలు చేసేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య, అధ్యక్షుడు కొండయ్య, సీపీఎం నాయకులు శ్రీనివాసరావు, డేవిడ్, షేక్ రహీం, రోశయ్య, కౌలు రైతు సంఘ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పూసపాడు : నల్లబర్లీ పొగాకుకు మంచి ధర ఉన్నా కొనుగోలు చేయడం లేదని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కందిమళ్ల రామకోటేశ్వరరావు అన్నారు. నల్లబర్లీ పొగాకును వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఇంకొల్లు మండలం, పూసపాడు అడ్డరోడ్డులో జిల్లా రైతు సంఘం, కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బొగ్గవరపు శంకర్రావు, గోవిందరాజులు, మహేష్, పోలు జక్కరయ్య, రామారావు, రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలి

బల్లికురవ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఉన్న చెత్త సంపద కేంద్రాలను తక్షణమే వినియెగంలోకి తీసుకు రావాలని చీరాల డివిజన్ డీఎల్‌పీవో బి.శివన్నారాయణ పేర్కొన్నారు. మండలంలోని వైదన, కొప్పెరపాడు గ్రామాలలో ఉన్న చెత్త సంపద కేంద్రాలను డీఎల్‌పీవో తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు గ్రామాలలో రోడ్ల వెంట చెత్త కనిపిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ తనిఖీలో మండల ఈవోపీఆర్డీ సుమతి, పంచాయతీ కార్యదర్శి ప్రసాదరావు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలి


మల్లాయపాలెంలో పోషణ్ పక్వాడాపై ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

బల్లికురవ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో తల్లులు, బాలింతలు చిన్నారులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మీరాబి పేర్కొన్నారు. మండలంలోని మల్లాయపాలెంలో మంగళవారం పోషణ్ పక్వాడాపై అవగాహన ర్యాలీ జరిగింది. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు పౌష్టికాహారం తీసుకోవడం వలన కలుగు లాభాల గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ జూపల్లి రాఘవరావు, ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రభాకరరావు, పంచాయతీ కార్యదర్శి షేక్ మీరావలి, అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమణి, సత్యవతి, రత్నకుమారి, భారతి పాల్గొన్నారు.

నేడు కుట్టు మిషన్ శిక్షణ ప్రారంభం

అద్దంకి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చినగానుగపాలెం సచివాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు కుట్టుమిషన్ శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని మున్సిపల్ కమిషనర్ రవీంద్ర తెలిపారు. మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పంగులూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10 గంటల 30 నిమిషాలకు ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీవో స్వరూపారాణి తెలిపారు. ఎంపీపీ తేళ్ల నాగమ్మ అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

గ్రామాల్లో టీబీ పరీక్షలు

యద్దనపూడి, (మార్టూరు) ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గన్నవరం, పూనూరు గ్రామాల్లో క్షయ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులకు, వారితో దగ్గరగా ఉన్న వారికి మంగళవారం డాక్టరు పీ శ్రీహర్ష ఆధ్వర్యంలో సీవై టీబీ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించారు. దీర్ఘకాలంగా దగ్గు, జ్వరం, బరువుతగ్గుతూ, ఆకలి మందగించిన వారు ఆసుపత్రిలో సీవైటీబీ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజశేఖర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ విజయచంద్ర శివప్రసాద్, హెల్త్ సూపర్‌వైజరు నాగేశ్వరరావు, సునంద, సులోచనారాణి పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే చర్యలు


పట్టుబడిన సారా, నిందుతుడితో పోలీసులు, అధికారులు

చీరాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మద్యం అమ్మకం, సారా తయారీ వంటి నేరాలకు పాల్పడితే చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. ఈక్రమంలో వైకుంఠపురానికి చెందిన కావాటి నాగరాజును అదుపులోకి తీసుకుని అతని వద్ద 8 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రామారావు, ఎస్సై శ్రీహరి, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళపై బంధువుల దాడి

బల్లికురవ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వైదనలో ఆస్తి తగాదాల నేపథ్యంలో మహిళపై బంధువులు దాడి చేయడంతో గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. వైదనకు చెందిన ఒర్సు రమణమ్మను బంధువులైన ఒర్సు వెంకటేశ్వర్లు మరో ముగ్గురు కలిసి పూర్వీకుల నుంచి రాబడిన ఆస్తుల పంపకం విషయంలో గొడవపడి సోమవారం దాడి చేశారు. రమణమ్మను అద్దంకి ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచా రం మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.


విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

మోడల్ స్కూల్స్‌తో మెరుగైన బోధన

అద్దంకిటౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యా బోధన అందించేందుకు ప్రభుత్వం మోడల్ స్కూల్స్‌గా మార్చుతుందని ప్రధానోపాధ్యాయుడు జాకబ్ అన్నారు. మంగళవారం మండలంలోని శింగరకొండపాలెం ఎంపీపీ పాఠశాల పరిధిలోని పలు ఇళ్లకు వెళ్లి పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడల్ స్కూల్‌గా మారితే 1వ తరగతి నుంచి ప్రతి తరగతికి ఒ క ఉపాధ్యాయుడు ఉంటారని, మెరుగైన బోధన అందుతుందని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం పలువురిని 1వ తరగతిలో చేర్పించినట్లు హెచ్‌ఎం తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్.హనుమంతరావు, ఐతా శ్రీనివాసరావు, పూర్ణచంద్రరావు, అంగన్వాడీ కార్యకర్త నాగమణి పాల్గొన్నారు.

ముగిసిన ఒకేషనల్ విద్యా శిక్షణ


అద్దంకి వస్త్ర దుకాణంలో వ్యాపారలావాదేవీలను తెలుసుకుంటున్న కొండమంజులూరు విద్యార్థులు

పంగులూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : పీఎం శ్రీకి ఎంపికైన కొండమంజులూరు ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు ఇచ్చే ఒకేషనల్ ఇంటర్న్ షిప్ విద్యా శిక్షణ మంగళవారంతో ముగిసింది. పదవతరగతి పూర్తి చేసిన 81 మంది విద్యార్థినీవిద్యార్థులకు ఈ విద్యా సంవత్సరంలో నేర్చుకున్న రిటైలింగ్, ఆటోమేటివ్ ఒకేషనల్ ట్రేడ్లకు సంబంధించి 12 రోజుల ఇంటర్న్‌షిప్ కార్యక్రమం ఈ నెల 4 నుంచి 15 వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమం బాపట్ల సర్వశిక్షా అభియాన్ ఉత్తర్వుల మేరకు నిర్వహించినట్లు హెచ్‌ఎం అణిత తెలిపారు. రిటైలింగ్ ట్రేడ్‌కు గైడ్‌గా ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్‌గా గంగా ప్రసాద్, ఆటోమేటివ్ ట్రేడ్‌కు గైడ్‌గా బాలాజీనాయక్ వ్యవహరించారు. ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన విద్యార్థులకు ధ్రువీకరణపత్రాలను అందజేస్తామని హెచ్‌ఎం అణిత తెలిపారు.

ఖర్చు తక్కువ..ఆదాయం ఎక్కువ

పంగులూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంతో భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందవచ్చని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి అన్నారు. మండల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయ ప్రణాళిక, విధివిధానాల రూపకల్పనపై వ్యవసాయ, వెలుగు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంపై రూపొందించిన వార్షిక ప్రణాలికపై రైతులకు అవగాహన కల్పించేందుకు ర్యాలీలు, గ్రామ సభలు నిర్వహిస్తామని ప్రకృతి వ్యవసాయ విభాగం అడిషనల్ డీపీఎం మోహన్ అన్నారు. గ్రామాలలో పొదుపు సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేసి వార్షిక ప్రణాళిక రూపొందించాలన్నారు. ఉత్సాహ వంతులైన ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి, లీడ్ ఫార్మర్స్‌తో పాటు సంఘ సభ్యులకు పీఎండీఎస్ కిట్స్ తయారీ, ఎన్‌పీఎం షాపుల ఏర్పాటు, ఆవుల కొనుగోలుకు రుణాలు ఇవ్వనున్నట్లు వెలుగు ఏపీఎం జ్యోతి ప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ చందన, ఎంటీ శిరీష, రాజశేఖర్, ఐసీఆర్‌పీలు, వీవోఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు స్టడీమెటీయల్ పంపిణీ

చీరాల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో పాలిటెక్నిక్ ఎంట్రన్స్ కోచింగ్‌కు వచ్చిన విద్యార్థులకు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ మెటీరియల్‌ను సక్రమంగా వినియోగించుకుని ప్రావీణ్యత పొందాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. జగదీష్, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

అగ్ని ప్రమాదాలపై అవగాహన ఉండాలి



అద్దంకిలో ఆర్టీసీ సిబ్బందికి, చీరాల రైల్వే స్టేషన్ వద్ద ప్రయాణికులకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అద్దంకి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని అగ్నిమాకమాక అధికారి వెంకటరావు అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్ర యాణికులు, ఆర్టీసీ ఉద్యోగులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జా గ్రత్తలను వివరించారు. అగ్నిమాపక సిబ్బంది, ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.

చీరాల : అగ్ని ప్రమాదం నియంత్రించాలంటే ముందు అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక కేంద్రం అధికారి వివి రామకృష్ణ పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం రైల్వే స్టేషన్, బస్టాండ్, ఎంజీసీ మార్కెట్, గడియార స్తంభం సెంటర్, మసీద్ సెంటర్ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రమాదాల నియంత్రణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై కరత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

ఎంపీపీ ఆనందకుమారి

పర్చూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలపై నిర ్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీపీ మేకా ఆ న ం ద కు ం వ ా రి అన్నారు. మంగళవారం మండల విద్యావనరుల కార్యాలయ ప్రాంగణంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. తొలుత మండలంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసేలా అధికారులు ప్ర త్యేక దృష్టిసారించాలన్నారు. ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్ మా ట్లాడుతూ వేసవిలో జాబ్‌కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏవో రామ్మోహన్‌రెడ్డి, చెరుకూరు పీహెచ్‌సీ వైద్యుడు బాబు, ఏపీవో రమేష్, ఏపీఎం రామకృష్ణ, సీడీపీవో సుభద్ర, ఎంఈవో సత్యనారాయణ, డీటీ సుధారాణి, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఆనందకుమారి, పక్కన ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్

ఏపీబీఎస్ఎస్ఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా ప్రకాశం

అద్దంకిటౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (ఏపీబీఎస్ఎస్ఎస్) రాష్ట్ర కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం మంగళవారం ఏలూరులో జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా అద్దంకికి చెందిన ప్రకాశం ఎయిడెడ్ స్కూల్‌కు చెందిన టంగుటూరి ప్రకాశం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నలుమూలల నుంచి బ్రాహ్మణ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు. రాష్ట్ర అర్గనైజింగ్ సెక్రటరీగా పదవి పొందిన టంగుటూరి ప్రకాశంకు అద్దంకి బ్రాహ్మణ సంఘ సభ్యులు, ఇతర సంఘాల సభ్యులు అభినందనలు తెలియజేశారు.


పూజల్లో పాల్గొన్న భక్తులు

వైభవంగా శ్రీలక్ష్మీ గణపతి షిర్డీ సాయినాథ మందిర వార్షికోత్సవం

పంగులూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముప్పవరం గ్రామంలో శ్రీ లక్ష్మీ గణపతి షిర్డీ సాయినాథ ఆలయ 21వ వార్షిక మహోత్సవం ఘనంగా జరిగింది. శ్రీ షిర్డీ సాయిబాబా మూల విరాట్‌కు భక్తులు పంచామృత అభిషేకం, శ్రీ లక్ష్మీ గణపతి హోమంను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తుల గ్రామోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. వార్షికోత్సవ మహోత్సవం సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు జరిగిన ఉత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం




అద్దంకి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ సమీపంలోని అయ్యప్ప స్వామి దేవాలయ వార్షికోత్సవ పూజలు మంగళవారం వైభవంగా జరిగాయి. పంచామృతాభిషేకం, ప్రత్యేక పూ జలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణ మూర్తి, చెన్నుపాటి వీరాంజనేయులు, దామా హనుమంతరావు, కన్నెబోయిన వీరయ్య, వల్లెపు వెంకటేశ్వర్లు, వాసు గురుస్వామి, తిరుపతిరెడ్డి గురుస్వామి, శ్రీరాం రామలింగేశ్వరరావు, అంజయ్య, ఆలకుంట నాగేంద్రస్వామి, బాపయ్య, అర్చకులు సూర్య మాల మాలకొండమాచార్యులు పాల్గొన్నారు.

మినీ అంగన్‌వాడీలను మెయిన్ కేంద్రాలుగా మార్చాలి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : మినీ అంగన్‌వాడీలను మెయిన్ కేంద్రాలుగా మార్చి సమస్యను పరిష్కరించాలని తెలుగునాడు ట్రేడ్ యూనియన్ ప్రతినిధులు స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని కోరారు. ఈ మేరకు మంగళవారం అమరావతిలోని సచివాలయంలో మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. కొత్తగా జనరేట్ చేసిన యాప్‌తో కలిగే సమస్యలు, అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాల అమలుతో పాటు మేలో కేంద్రాలకు సెలవులు ఇప్పించాలని కోరారు. అంగన్‌వాడీలకు ఇబ్బంది లేకుండా యాప్‌ల పనిభారాన్ని తగ్గిస్తామని, కొత్త సెల్ ఫోన్లు ఇవ్వనున్నామని మంత్రి సంధ్యారాణి తెలిపారు. కార్యక్రమంలో తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు ఆచంట సునీత, రాష్ట్ర అధ్యక్షురాలు గడ్డం అనంతలక్ష్మి, జనరల్ సెక్రటరీ కొల్లి లక్ష్మీ నరసమ్మ, ట్రెజరర్ కొడాలి హేమలత, రాష్ట్ర కమిటీ సభ్యురాలు బండారు కల్యాణి పాల్గొన్నారు.


మంత్రి సంధ్యారాణికి వినతిపత్రం అందజేస్తున్న తెలుగునాడు అంగన్‌వాడీ ట్రే డ్ యూనియన్ ప్రతినిధులు



ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	37.7	27.4
కావలి	35	28
ఆత్మకూరు	37	26
ఉదయగిరి	38	26
కందుకూరు	36	28



అమలులోకి వేట నిషేధం!

- ఒడ్డుకు చేరుతున్న పడవలు, వలలు
- ప్రభుత్వ సాయం కోసం మత్స్యకారుల ఎదురుచూపు



సముద్రంలో నుంచి ఒడ్డుకు చేరిన పడవలు



వలలను జాగ్రత్త చేసుకుంటున్న మత్స్యకారులు



సురక్షిత ప్రాంతానికి ఎడ్లబండిపై వలలను తరలిస్తూ..

కడలిలో మత్స్య సంపద వృద్ధి నేపథ్యంలో రెండు నెలలపాటు వేట నిషేధం మంగళవారం నుంచి అమలులోకి వచ్చింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏప్రిల్ 15 నుంచి జూన్ 15వ తేదీ వరకు మత్స్యకారులెవరూ వేట కోసం సముద్రంలోకి వెళ్లకూడదు. ఈ నేపథ్యంలో పడవలను ఒడ్డుకు చేర్చారు. అలాగే వలలను భద్ర పరుచుకున్నారు. అయితే వేట మాత్రమే మత్స్యకారులకు తెలిసిన విద్య కావడంతో ఇతర పనులు చేసుకునే పరిస్థితి లేదు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం అందించే సాయం కోసం వారంతా ఎదురుచూస్తున్నారు. గతంలో కేవలం రోజుకు కిలో చొప్పున రెండు నెలలకు 60 కిలోల బియ్యం మాత్రం ఇచ్చే ప్రభుత్వం పలు దఫాలు తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడ్డాక నగదు సహాయం అందజేస్తోంది. ఈ క్రమంలో వేట విరామ భృతిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ.10వేల నుంచి 20వేలకు పెంచారు. ఈ పెంపు మత్స్యకారులకు ఎంతో ఊరటనిస్తోంది. జిల్లావ్యాప్తంగా 18వేలకుపైగా మత్స్యకార కుటుంబాలు ఉండగా, అధికారులు 12,440 కుటుంబాలు ఉన్నట్టు లెక్క తేల్చి ప్రభుత్వానికి నివేదికలు పంపారు. ఒక్కో కుటుంబానికి రూ.20వేలు చొప్పున రూ.24.88 కోట్లు జిల్లాకు రావాల్సి ఉంది. ఈ నిధుల కోసమే మత్స్యకారులు ఎదురుచూస్తున్నారు. త్వరలో వేట విరామ భృతి అందజేసి తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

- అల్లూరు, (ఆంధ్రజ్యోతి)

ప్రతిభకు పురస్కారం!

- ముగ్గురికి 'కందుకూరి' అవార్డులు
- నేడు విజయవాడలో ప్రదానం

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : సంఘ సంస్కర్త, స్వాతంత్ర్య సమరయోధుడు, రంగస్థల నటుడు కందుకూరి వీరేశలింగం పంతులు 177వ జయంతి సందర్భంగా కూటమి ప్రభుత్వం నాటక రంగంలో విశేష కృషి చేస్తున్న కళాకారులకు రాష్ట్ర, జిల్లాస్థాయి విశిష్ట పురస్కారాలను ప్రకటించింది. జిల్లాస్థాయి విశిష్ట పురస్కారాలను డాక్టర్ బద్రివీర్‌కుమార్ (సాంఘికం), గంధం రాజేశ్వరి (పౌరాణికం), కనిమెల భానుమతి (చారిత్రకం) పురస్కారాలకు ఎంపికయ్యారు. బుధవారం సాయంత్రం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ విశిష్ట పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫిల్మ్ టెలివిజన్ అండ్ థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రకటించింది.

చాలా సంతోషంగా ఉంది



26 సంవత్సరాలుగా నటుడిగా, రచయితగా, రంగస్థలం, టీవీ రంగాల్లో కళా సేవకు, నా నాటనా ప్రతిభకు ప్రభుత్వం ఇస్తున్న విశిష్ట పురస్కారం చాలా సంతోషంగా ఉంది. గూడూరు సన్నపరెడ్డి కృష్ణారెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తున్నాను. 1999 నుంచి నాటకాల్లో ప్రదర్శనలకు వెళుతున్నాను. ధ్రుతరాష్ట్ర కౌగిలి నాటకాన్ని 36సార్లు ప్రదర్శించి ఎన్నో అవార్డులు అందుకున్నా. లక్ష్యం నాటకాన్ని రాసి గుంటూరు నాటక పరిషత్‌లో ప్రదర్శించి ప్రథమ బహుమతిని సాధించాను.

- డాక్టర్ బద్రిపీర్‌కుమార్

ఊహించని పురస్కారం



కొంతమంది ప్రోత్సాహంతో కళాకారిణిగా అవార్డుకు దరఖాస్తు చేసుకున్నా. నేను ఊహించనే లేదు. కందుకూరి విశిష్ట అవార్డు వస్తుందని. నెల్లూరుకు చెందిన నేను చంద్రమతి, బాలనాగమ్మ, సత్యభామ, చింతామణిలో రాధ పాత్రల ద్వారా రాష్ట్రం నలుమూలల నటీమనిగా గుర్తింపు సత్కారాలు పొందాను. నా గురువులు చంద్రయ్య బాబాయి, నంద్యాల రత్నకుమార్‌లు పెట్టిన భిక్షాటన, కాశీనాయన చరిత్ర నాటకంలో 4 పాత్రలు పోషించి గుర్తింపు పొందాను. ఎనిమిదేళ్ల వయసులోనే హరికథలను గానం చేశాను. హరికథా కళాకారిణిగా ఎస్‌పీ బాలసుబ్రహ్మణ్యం ద్వారా సత్కారం పొందాను.

- గంధం రాజేశ్వరి

చాలాకాలానికి గుర్తింపు



కళాకారిణిగా నన్ను చాలాకాలం తర్వాత గుర్తించి కందుకూరి విశిష్ట పురస్కారం ఇస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. మా అమ్మనాన్నలు కళాకారులు కావడంతో 3వ ఏటనుంచే రంగస్థల కళాకారిణిగా దాదాపు 8వేలకుపైగా నాటకాలలో నటించాను. బాల నటుడిగా బాలవర్ధి, లోహితాసుడు, హరిశ్చంద్ర పాత్రల్లో నటించాను. రంగస్థలనటిగా చంద్రమతి, చింతామణి, బాలనాగ మ్మగా నటిస్తూ ఎన్నో అవార్డులు, పురస్కారాలు అందుకున్నా.

- కనిమల భానుమతి

రేపే ఐఏబీ!

నెల్లూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : రెండో పంటకు నీటి కేటాయింపులు జరిపేందుకు ముహూర్తం ఖరారు అయ్యింది. ఈ నెల 17వ తేదీ గురువారం సాగునీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశం నిర్వహించేందుకు అధికారులు నిర్ణయించారు. నెల్లూరులోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు ఐఏబీ సమావేశం ప్రారంభం కానుండగా, జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిదులు పాల్గొననున్నారు.

> **5.27 లక్షల ఎకరాల్లో రెండో పంట**
> **ప్రతిపాదనలు సిద్ధం చేసిన ఇరిగేషన్ అధికారులు**
> **సాగుతోపాటు తాగునీటి కేటాయింపులపైనా నిర్ణయం**

● **మూడేళ్ల తర్వాత..**

రెండో పంటకు ఐఏబీ నిర్వహిం చడం మూడేళ్ల తర్వాత ఇదే మొదటి సారి. ఈదఫా సోమశిల, కండలేరు జలాశయాల్లో నీరు పుష్కలంగా ఉండ డంతో రెండో పంట సాగు వీలవు తోంది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 5.27 లక్షల ఎకరాల్లో రెండో పంట సాగుకు నీటి కేటాయింపులు జరపాలని ప్రతిపాదిం చారు. సోమశిల కింద 3.70 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వను న్నారు. ఒక్కో టీఎంసీతో 8500-9వేల ఎకరాలు పండించేలా నిర్ణయించి 43 టీఎంసీలను కేటాయించనున్నారు. పెన్నా డెల్టాతోపాటు కావలి, కనుపూరు కాలువలు, ఉత్తర, దక్షిణ కాలువల కింద కూడా ఎంత మేర ఆయకట్టు సాగు జరగాలన్న దానిపై ప్రతిపాదనలు తయారు చేశారు. డెల్టాలో మొత్తం సాగు జరుగుతుండగా, మిగిలిన కాలువల కింద నిర్దేశిత ఆయకట్టు వరకూ నీరు ఇవ్వనున్నారు. అలానే కండలేరు జలాశయంలో రెండో పంటకు 16 టీఎంసీలను కేటాయించేలా టీజీపీ అధికారులు ప్రతిపాదించారు. ఈ నీటితో 1.57 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వనున్నారు. ఇందులో వరి పంటకు ఇచ్చే నీటితోపాటు ఆరుతడి పంటల స్థిరీకరణకు కూడా కేటాయింపులు ఉన్నాయి. కండ లేరు కింద ప్రస్తుత నెల్లూరు జిల్లా పరిధిలోని పొదలకూరు, మనుబోలు మండలాల్లో 33 వేల ఎకరాలకు నీరు అందించనుండగా, తిరుపతి జిల్లా పరిధిలో 1.27 లక్షల ఎకరాలకు నీరిచ్చేలా అధికారులు ప్రతిపాదించారు. సాగుతోపాటు ప్రజల దాహం తీర్చేందుకు కూడా సరిపడా నీటిని కేటాయించారు. ఈ కేటాయింపులపై ఐఏబీలో తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

● **కాలువల కింద పనులా.. పంటా?**

కాగా కొన్ని కాలువల ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. అటువంటి కాలువల కింద రెండో పంట ఉంటుందా? లేదా? అన్నది కొంత సందిగ్ధంగా మారింది. ప్రస్తుతం అధికారులు ఆయా పనులు చేస్తున్న కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్నారు. వారు పనులు చేసేందుకు ఆసక్తిగా ఉన్నారా? లేదా? అన్న విషయాన్ని తెలుసుకొని అధికారులు ఐఏబీ ముందుంచనున్నారు. అక్కడ ఈ కాలువల కింద కేటాయింపులపై నిర్ణయం తీసుకుంటారు.

గ్రామీణ ప్రాంతాల్లోని లింకు రోడ్ల అభివృద్ధికి పట్టిన గ్రహణం వీడటం లేదు. నాటి వైసీపీ ప్రభుత్వ పుణ్యమా అని నేటికీ ప్రజలకు గుంతల రోడ్ల నుంచి ఉపశమనం లభించడం లేదు. వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) నిధులతో పంచాయతీరాజ్ రోడ్లను బాగు చేయనున్నట్లు నాటి పాలకులు ఆర్భాటంగా ప్రకటించారు. అయితే, కొంతమేర పనులు చేశాక రుణం మంజూరుకాక కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేదు. దీంతో అర్ధంత రంగా ఆగిపోయిన రోడ్ల పనులకు మోక్షం లభించడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఏఎంసీ రోడ్లకు పట్టిన గ్రహణం వీడలేదు.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)



కొండాపురం : సాయిపేట-ఇస్కపాలెం మధ్య పంచాయతీరాజ్ రోడ్డు దుస్థితి

బిల్లులు రాక.. పనులు కాక!

> **ఏఎంసీ నిధులతో చేపట్టిన రోడ్లకు గ్రహణం**
> **195 రోడ్లు.. రూ.155.6 కోట్ల బడ్జెట్**
> **రూ.30 కోట్ల మేర పనులు చేసిన కాంట్రాక్టర్లు**
> **బిల్లులు రాక అర్ధంతరంగా పనుల నిలిపివేత**

రూ.1100 కోట్ల ఏఎంసీ నిధులతో పంచాయతీరాజ్ రోడ్లను బాగు చేస్తు న్నట్లు నాటి వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంది. ఏడాదిలో ఈ రోడ్లన్నీ అభివృద్ధి చెందుతాయని ప్రజలను నమ్మించింది. మొదటి దశలో ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని అన్ని నియోజక వర్గాల్లో 195 రోడ్లను రూ.155.60 కోట్లతో అభివృద్ధి చేసే విధంగా పీఆర్ అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. మొత్తం 591 కిలోమీటర్ల రోడ్లను 34 ప్యాకేజీలుగా విభజించి 2022 జూన్‌లో తొలిసారిగా టెండర్లు పిలిచారు. అయితే బడ్జెట్ లేకపోవడంతో ఈ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. 4సార్లు టెండర్లు పిలిచినా ప్రయోజనం లేకుండా పోయింది. అయితే ఎన్నికలు సమీపించిన నేపథ్యంలో హడావిడిగా కాంట్రాక్టర్ల చేత పనులు మొదలు పెట్టించారు. అప్పట్లో జిల్లావ్యాప్తంగా సుమారు రూ.30 కోట్ల మేర పనులు జరిగి ఉంటాయని అంచనా. చాలా రోడ్డు పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. కొన్ని చోట్ల డస్ట్ పోసి తారువేయకుండా వదిలేశారు.

● **కోర్టుకు కాంట్రాక్టర్ల క్యూ**

ఉమ్మడి జిల్లాలో కీలకమైన 195 రోడ్లను ఏఎంసీ నిధులతో అభివృద్ధి చేసేందుకు అనుమతించడంతో ఆ రోడ్లను వేరొక నిధులతో అభివృద్ధి చేయలేని పరిస్థితి నెలకొంది. అయితే ఈ రోడ్లను బాగు చేసేందుకు ఇప్పటికీ బడ్జెట్ కేటాయించలేదు. బ్యాంకుల నుంచి రుణం రాకపోగా, దీనిపై ప్రభుత్వం కూడా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో ఈ రోడ్లపై ప్రయాణిస్తున్న ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. మరోవైపు బిల్లుల కోసం కాంట్రాక్టర్లు హైకోర్టుకు క్యూ కడుతున్నారు. పలుమార్లు బిల్లులకై అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకపోవడంతో కోర్టు మెట్లెక్కారు. ఇటీవల కావలి నియోజకవర్గంలో పనులు చేసిన ఓ కాంట్రాక్టర్‌కు రూ.2.97 కోట్లు చెల్లించాలని హైకోర్టు ఆదేశించింది. మరో కాంట్రాక్టర్‌కు రూ.2.14 కోట్లు చెల్లించాలని తీర్పునిచ్చింది. ఇవి కంటెంప్ట్ కేసులు కావడంతో ఏదో ఒక హెడ్ కింద ఈ బిల్లులు అప్‌లోడ్ చేసి పేమెంట్ చేయాలని పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ జిల్లా అధికారులను ఆదేశించారు. దీంతో ఈ రకంగా కూడా ప్రభుత్వానికి తలనొప్పులు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ఏఎంసీ రోడ్డు పర్కులపై ఏదో ఒక నిర్ణయం త్వరగా తీసుకుంటే ఇటు రోడ్లు బాగు పడడంతోపాటు కాంట్రాక్టర్లకు కష్టాలు తప్పుతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీనిపై పంచాయతీరాజ్ ఎస్ఈ అశోక్‌కుమార్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

ఎక్కడున్నావ్.. కాకాణీ!

> **ఏడు పోలీస్ బృందాల ముమ్మర గాలింపు**

నెల్లూరు (క్రైం), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కోసం జిల్లా పోలీసులు జల్లెడ పడుతున్నారు. క్వార్ట్జ్ కేసులో ఏ4గా ఉన్న కాకాణికి న్యాయస్థానం ముందస్తు బెయిల్ రద్దు చేసిన విషయం తెలిసిందే. అప్పటినుంచి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏడు ప్రత్యేక బృందాలు హైదరాబాదు, బెంగళూరు ఇతర ప్రాంతాల్లో గాలిస్తున్నాయి. హైదరాబాదు, బెంగళూరులలోని కాకాణి నివాసాలు, బంధువుల ఇళ్ల వద్ద పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇళ్ల వద్దే ఉంటున్న పోలీస్ అధికారులు ఏక్షణాన్నైనా కాకాణి రాకపోతారా అని ఎదురు చూస్తున్నారు. మరికొన్ని పోలీసు బృందాలు సాంకేతికతను వినియోగిస్తూ కాకాణి జాడ తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. కాకాణి కోసం వెళ్లిన ప్రత్యేక బృందాలు ఆయన్ను పట్టుకున్న తర్వాతే జిల్లాకు తిరిగి వస్తాయని తెలుస్తోంది.

మేం సహకరిస్తాం.. మా డిమాండ్ల మాటేమిటి!?

- అధికారుల తీరుపై చేవూరు రైతుల అసహనం
- తమ భవిష్యత్తునూ ఆలోచించాలని వేడుకోలు
- గ్రామాన్ని పోర్టు సిటీగా అభివృద్ధి చేయాలి
- చెరువును పర్యాటకప్రాంతంగా మార్చాలని డిమాండ్
- లేకుంటే పోరుబాట తప్పదంటున్న గ్రామస్థులు

కందుకూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : రామాయపట్నం పోర్టు అనుబంధ పరిశ్రమల భూసేకరణకు సహకరిస్తున్నా, తమ డిమాండ్లను సానుకూలంగా పరిష్కరించటంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారన్న అసహనం చేవూరు గ్రామస్థుల్లో నానాటికీ పెరుగుతోంది. పరిశ్రమలకు తాము వ్యతిరేకం కాదు.. ఈ ప్రాంత అభివృద్ధిని కాంక్షిస్తూ భావోద్వేగబంధమున్న భూములను వదులుకునేందుకు తాము సిద్ధపడినా, తమ భవిష్యత్తు కోసం చేస్తున్న కనీస డిమాండ్ల పట్ల అధికారులు నియంతృత్వధోరణితో ఉన్నారని ఇదే ధోరణి కొనసాగితేఉద్యమానికి సిద్ధపడటం తప్ప మరోదారిలేదని వారు ఆగ్రహిస్తున్నారు. ఈ మేరకు గత మంగళవారం గ్రామంలో సమావేశమై అవసరమైతే సంఘటితపోరుకు సిద్ధపడాలని నిర్ణయించినట్లు సమాచారం. తాము చేస్తున్న నాలుగు ప్రధాన డిమాండ్లకు అధికారులు సానుకూల నిర్ణయం ప్రకటించకుంటే ఇక ఉద్యమబాటే గత్యంతరమని వారు అభిప్రాయపడినట్లు తెలిసింది.

● **డిమాండ్లు ఇవీ..**

రామాయపట్నం పోర్టుకు మణిహారంగా ఉన్న చేవూరు గ్రామాన్ని పోర్టు సిటీగా అభివృద్ధి చేయాలి. పోర్టు సంబంధిత అభివృద్ధి కోసం, పోర్టు రోడ్డు నిర్మాణంలో భూములు నష్టపోయిన నిర్వాసితులకు తక్షణం పరిహారం చెల్లించాలి. గ్రామం చుట్టూ కనీసం వెయ్యి మీటర్లు గ్రామస్థుల ఉపాధి కోసం సేకరణ నుంచి మినహాయించాలి. అందులో భాగంగా ఫిబ్రవరి 28న జారీచేసిన భూసేకరణ నోటిఫికేషన్‌ను రద్దుచేయాలని, భూసేకరణలో గ్రామంలో ఉన్న భూముల ఆరు క్లాసిఫికేషన్‌లను పరిగణలోకి తీసుకుని తదనుగుణంగా పరిహారం చెల్లించాలి. భూసేకరణ అధికారులు ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యధోరణి ఫలితంగా ఇటీవల ఓ యువ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడని, ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



భూసేకరణ నోటిఫికేషన్‌లోకి వచ్చిన నివాసగృహాలు

● **పరిహారం చెల్లింపులో ఇంత నిర్లక్ష్యమా ?**

జాతీయ రహదారి నుంచి రామాయపట్నం పోర్టుకు రోడ్డు నిర్మాణం కోసం గ్రామ రైతులు భూమిని కోల్పోగా దళిత రైతులకు నేటికీ పరిహారం చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్నారని గ్రామస్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ రికార్డుల్లో సాగుదారులుగా దళితుల పేర్లు ఉన్నా అప్పట్లో పరిహారం ఇస్తామని చెప్పి ఇప్పుడు మెలికలు పెట్టడంలోని ఆంతర్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అలాగే మరికొన్ని ప్రాంతాలలో లేని చెరువులు, కుంటలు ఉన్నట్లు చెబుతూ సాగుదారులకు అన్యాయం చేసే ప్రయత్నం చేస్తున్నందున క్షేత్రపరిశీలన ఆధారంగా సాగుదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే మాగాణి, మెట్ట భూమితోపాటు తోటలు, రోడ్డు సైడు భూములు, ఇళ్ల స్థలాలు, భవిష్య త్తులో ఇళ్ల స్థలాలకు పనికొచ్చే భూములుగా 6 కేటగిరీలు విభజించి మార్కెట్ ధరలు నిర్ధారించి ఉన్నప్ప టికీ పరిహారం చెల్లింపులో రెండు విభాగాలుగానే పరిగణించి చెల్లిస్తామని చెప్పడం అన్యాయమని క్లాసిఫికేషన్‌ల వారీగా పరిహారం చెల్లించాలన్నది గ్రామస్థుల ప్రధాన డిమాండ్‌గా ఉంది. చేవూరు భౌగోళి కంగా రామాయపట్నం పోర్టుకు నెక్లెస్‌లా ఉన్నందున ఈ గ్రామాన్ని పోర్టుసిటీగా ప్రకటించడంతోపాటు పర్యాటకప్రాంతంగా అభివృద్ధి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



పర్యాటకప్రాంత అభివృద్ధికి ఉన్న సహజవనరులు, పురాతన భవనాలు సూచిస్తూ రూపొందించిన మ్యాప్

వలసల నివారణకు చర్యలు చేపట్టాలి



చేవూరులో భూములు కోల్పోతున్న రైతులకు నిబంధనల మేరకు 6 క్లాసిఫికేషన్లు అమలుచేసి పరిహారం చెల్లించాలి. అలాగే వేలాదిమంది వ్యవసాయ కూలీలు ఉన్న ఈ గ్రామంలో ప్రజలకు ఉపాధి లేకపోతే వలసలు తప్పవు. గ్రామాన్ని పోర్టు సిటీగా అభివృద్ధి చేయటం ద్వారా ఉపాధి కల్పించాలి. అలాగే పశుపోషణ వంటి జీవనోపాధి దెబ్బతినకుండా పశుగ్రాసం పెంపునకు వీలుగా గ్రామంచుట్టూ కొంతభూమి వదిలేయాలి. భూసేకరణ ప్రారంభమైనప్పటి నుంచి ఈ డిమాండ్లు చేస్తున్నా అధికారుల నుంచి స్పష్టమైన హామీ లేదు. ఇప్పటికైనా స్పష్టత ఇచ్చాకే భూసేకరణ చేపట్టాలి.

- శెట్టిపల్లి వెంకటేశ్వర్లు, సర్పంచ్, చేవూరు

పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి



చేవూరు పోర్టు సిటీగా ప్రకటించి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన సహజసిద్ధ మౌలిక వనరులు ఇక్కడ ఉన్నాయి. జాతీయ రహదారి పక్కనే చేవూరు బస్టాండ్‌లో 50 ఎకరాల్లో అటవీశాఖ పార్కు, విహార కేంద్రం అభివృద్ధి చేస్తున్నందున దానిపక్కనే ఉన్న చెరువులో బోటుక్లబ్ ఏర్పాటు చేస్తే పర్యాటకులకు ఉపయోగకరంగా ఉంటుంది.

- నూతలపాటి వెంకటేశ్వర్లు, విశ్రాంత వీఆర్‌వో, చేవూరు రైతు

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	119
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	236
కోడిగుడ్ల ధర (100): 420	

విద్యార్థినికి ఎస్ఐ శ్రీనివాసులు ఆర్థిక సాయం

కావలిటౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : కావలి విట్స్ కళాశాలలో ఎంసీఏ పూర్తి చేసుకుని పెండింగ్ ఫీజు చెల్లించలేకపోవడంతో ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకోలేక ఇబ్బంది పడుతున్న ఓ విద్యార్థినికి నెల్లూరులో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఒట్టూరు శ్రీనివాసులు రూ.10,000 ఆర్థిక సాయమందించి మానవత్వం చాటుకున్నారు. మంగళవారం వెంగళరావునగర్‌లోని సంయుక్త సేవాసంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన సమక్షంలో విశ్రాంత బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ చంద్రశేఖర్, విశ్రాంత అధ్యాపకులు ప్రసాదరావుల చేతుల మీదుగా విద్యార్థిని సాయిప్రియకు నగదు సాయమందించారు. వారు మాట్లాడుతూ ఎస్ఐ శ్రీనివాసులు తండ్రి మాలకొండయ్య ఆశయాలకనుగుణంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సురేంద్ర పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందనలు

కావలిటౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం పాతూరులోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల ఇంటర్ ర్యాంకర్లను మంగళవారం ఎమ్మెల్యే కృష్ణారెడ్డి అభినందించారు. విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించి మాట్లాడుతూ ఇక్కడి విద్యార్థులు జిల్లా, రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించి కావలి కీర్తిని రాష్ట్రస్థాయికి ఇనుమడింపజేయడం గర్వకారణమన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించడంలో కృషి చేసిన అధ్యాపకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ వెంకయ్య, డైరెక్టర్ పీవీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కావలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చక్రపాణి



కావలిటౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కావలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కే. చక్రపాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం కోర్టు భవనంలోని బార్ కార్యాలయంలో జరిగిన బార్ ఎన్నికల్లో చక్రపాణి ఒక్కరే నామినేషన్ దాఖలు చేయగా ఆయన ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. అనంతరం ఆయన ఎమ్మెల్యే కృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలవగా ఆయన శాలువాతో సత్కరించి అభినందించి పేద వారికి న్యాయ సహాయం అందించి కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని కోరారు. టీడీపీ లీగల్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజ్‌కుమార్ చౌదరి, సీనియర్ న్యాయవాది శివకుమార్‌రెడ్డి, న్యాయవాదులు, సిబ్బంది చక్రపాణిని అభినందించారు.

చలివేంద్రం ప్రారంభం

కొండాపురం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గరిమెనపెంట పంచాయతీ సచివాలయం వద్ద నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి యారవ క్రిష్టయ్య మంగళవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. అంతకుముందు సచివాలయంలో మహాత్మ గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా పంచాయతీలో జరగాల్సిన పనులపై అధికారులు నిర్వహించిన గ్రామసభకు హాజరైన ప్రజలకు, ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలలో ఈవోపీఆర్డీ నారాయణరావు, టీడీపీ నాయకులు అల్లిక మధు, చెన్నుపాటి శ్రీనివాసులు, నందా మాచర్ల, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

కొండాపురం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీవో ఆదినారాయణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో మూడు నెలల కాలంలో మండలంలో జరిగిన అభివృద్ధి పనులతోపాటు జరగాల్సిన పనులపై సమీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశానికి మండల పరిధిలోని పలుశాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు తప్పకుండా పాల్గొనాలని తెలిపారు.

నేడు కలిగిరి మండల పరిషత్...

కలిగిరి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉదయం 11గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రత్యూష ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ మెట్టుకూరు శిరీష అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అన్నిశాఖల అధికారులు గ్రామాభివృద్ధికి సంబంధించిన సమగ్ర నివేదికలతో హాజరు కావాలని పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు ఆమోదం మాలలపై కక్ష సాధింపే..!

కందుకూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు క్యాబినెట్ ఆమోదం తెలపడం మాలలపై కక్ష సాధింపేనని మాల సంఘాల జేఏసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పాలేటి కోటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ రిజర్వేషన్లను రాష్ట్రాలు వర్గీకరణ చేసుకోవచ్చునని, ఇప్పటికీ రిజర్వేషన్ ఫలాలు అందుకోలేని కులాలు ఏమైనా ఉంటే వారికి ఎక్కువభాగం ఇచ్చి ఆ కులాలు కూడా అభివృద్ధి చెందేలా చూడాలని సుప్రీం కోర్టు తీర్పునిచ్చిందని, అయితే కొత్తగా ఎస్సీ జనాభా, ఎంపీరికల్ డేటా ప్రకారమే చేయాలని స్పష్టం చేసిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం పెద్దలు సుప్రీంకోర్టు సూచనలను లెక్కచేయకుండా తప్పుడు జనాభా లెక్కలతో తప్పుడు సమాచారంతో మాదిగలకు మేలు చేసి వారిని శాశ్వత ఓటు బ్యాంకుగా మార్చుకునే కుటిలపన్నాగం పన్నిందని తెలిపారు. రిజర్వేషన్ల శాతం పెంచాలని, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు ఇవ్వాలని, భూములు, పరిశ్రమలు పంచాలని ఎస్సీలు ఎంతోకాలంగా డిమాండ్ చేస్తున్నా కనీసం చెవికెక్కించుకోని చంద్రబాబు నాయుడు ప్రస్తుతం రిజర్వేషన్ల వర్గీకరణ ద్వారా మాలలపై కక్ష సాధింపుకు తెగబడ్డాడని పేర్కొన్నారు. తెలంగాణలోనూ ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు అక్క డి ప్రభుత్వం సిద్ధపడడం దురదృష్టకరమని పేర్కొన్నారు.

క్షణ క్షణం..

భయం.. భయం..!

- శిథిలావస్థలో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులు
- చౌదరిపాలెం, బుడంగుంటలో ప్రజలకు పొంచి ఉన్న ప్రమాదం
- ఎప్పుడు కూలుతాయోనని ఆందోళనతో జనం బెంబేలు
- ప్రమాదమని తెలిసినా పట్టించుకోని అధికారులు, పాలకులు



బుడంగుంట కాలనీలో నిరుపయోగంగా ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకు

కావలి రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల నడిబొడ్డున ప్రజల దాహార్తి తీర్చేందుకు నాడు నిర్మించిన రక్షిత మంచినీటి పథకాల ఓవర్ హెడ్ ట్యాంకులు నేడు శిథిలావస్థకు చేరి ఏ క్షణమైనా కూలేందుకు సిద్ధంగా ఉండడంతో ప్రజలు ప్రతి క్షణం భయాందోళన చెందుతోన్నారు. నివాసాల మధ్య నిరుపయోగంగా మారి ప్రమాదకరంగా ఉన్న వీటితో ప్రమాదం పొంచిఉంది. అయినా అధికారులు, పాలకులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు.

కావలి మండలంలోని చౌదరిపాలెంలో నివాసాల మధ్యన 70 ఏళ్ల క్రితం నిర్మించిన ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు పిల్లర్లు పూర్తిగా దెబ్బతిని కూలేందుకు సిద్ధంగా ఉంది. దీనికి నీటిని నింపితే లీకేజీలు అవుతుండడంతో గ్రామంలో మరో వాటర్ ట్యాంకు నిర్మించి ప్రారంభించారు. కానీ నాటి నుంచీ నేటి వరకు శిథిలమైన ట్యాంకు తొలగించకపోవడంతో ఎప్పుడు కూలి నివాసాలపైన పడుతుందోనని ఆ ప్రాంత వాసులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. అలాగే బుడంగుంట ఇందిరమ్మకాలనీలో గ్రామ ప్రజలకు నీరందిస్తున్న వాటర్ ట్యాంక్ పిల్లర్లు దెబ్బతిని కూలేందుకు సిద్ధంగా ఉండడంతో గ్రామస్థులు ట్యాంక్ పరిసర ప్రాంతాలకు రావడానికి భయాందోళన చెందుతున్నారు. ఈ రెండు గ్రామాల్లో పరిస్థితులపై అనేక దఫాలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని, ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం వాటిల్లితేగాని పట్టించుకోరా అని అధికారులు, పాలకులపై ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, పాలకులు స్పందించి మండలంలో శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులు గుర్తించి తొలగించాలని గ్రామీణ ప్రాంత వాసులు కోరుతున్నారు.



చౌదరిపాలెంలో శిథిలమైన పిల్లర్లు

ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదు



70 ఏళ్ల నాటి ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ పిల్లర్లు దెబ్బతిని కూలేందుకు సిద్ధంగా ఉండడంతో నూతన ట్యాంక్ నిర్మించారు. కానీ నివాసాలపై ట్యాంక్ కూలుతుందని, దాన్ని తొలగించాలని అనేక మార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు.

- మండువ శ్రీనివాసులు, చౌదరిపాలెం

ట్యాంకు కూల్చివేసి ప్రజలకు రక్షణ కల్పించాలి



ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ పిల్లర్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. చిన్నపాటి గాలులు వీచినా నివాసాలపై కూలుతుందేమోనని ఆందోళనగా ఉంది. ప్రమాదకరంగా ఉన్న దీనిని కూల్చివేసేందుకు పాలకులైనా చొరవ తీసుకోవాలి. లేకుంటే ప్రజలకు ప్రమాదం తప్పదు.

- కంటు రమేష్‌బాబు, చౌదరిపాలెం

ఇలా ఉంటే రోగాలు రావా ?



గరుకుపాలెంలో మినీ వాటర్ ట్యాంక్ వద్ద పాచిపట్టి చుట్టూ చేరిన మురుగు

వలేటివారిపాలెం మండలంలోని పోలినేనిచెరువు పంచాయతీ గరుకుపాలెంలో మినీవాటర్ ట్యాంక్ దిమ్మె చుట్టూ పాచి పట్టి అపరిశుభ్రంగా ఉంది. ట్యాంక్ లోపల కుళాయి చుట్టూ పాచి పట్టింది. అంతేగాకుండా ట్యాంక్ చుట్టూ మురుగునీరు ముందుకు పోయే అవకాశం లేక నిల్వ చేరింది. ఆ మురుగు నీటిలోని విద్యుత్ మోటారు స్విచ్ ఉంది. ఆ నీటినే గ్రామస్థులు తాగుతున్నారు. ఈ ట్యాంక్‌ను చూస్తేనే తెలుస్తుంది దీనిలో క్లోరినేషన్ చేసి ఎన్నో ఏళ్లు గడిచి ఉంటుందని. ఇది పంచాయతీ అధికారులు, పాలకుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం. ఈ కలుషిత నీరు తాగితే రోగాలు రావా అని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి మినీ వాటర్‌ట్యాంక్‌ను క్లోరినేషన్ చేసి మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- వలేటివారిపాలెం,(ఆంధ్రజ్యోతి)

గర్భిణులు, బాలింతలు పేర్లు నమోదు చేసుకోవాలి



లింగసముద్రం: పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ నీలాంబరి

లింగసముద్రం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : గర్భిణులు, బాలింతలు అంగన్వాడీ కేంద్రంలో పేర్లు నమోదు చేయించుకోవాలని ఐసీడీఎస్ లింగసముద్రం సెక్టార్ సూపర్‌వైజర్ నీలాంబరి చెప్పారు. మంగళవారం లింగసముద్రం పంచాయతీ జంగంరెడ్డిపాలెంలోని అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సకాలంలో పౌష్టికాహారం తీసుకుంటేనే పిల్లలు ఆరోగ్యంగా జన్మిస్తారన్నా రు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త టి.సరోజిని, ఆశా వర్కరు విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

బిట్రగుంట,(ఆంధ్రజ్యోతి): తల్లీ, బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే గర్భం దాల్చినప్పటి నుంచి కచ్చితంగా పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్వాడీ సూపర్ వైజర్ సుభాషిణి అన్నారు. బోగోలు మండలం జువ్వలదిన్నె పంచాయతీ కొత్తబంగారుపాలెంలో మంగళవారం పోషకాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెయ్యి రోజులు సంరక్షణ అంటే మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డకు రెండేళ్లు పూర్తి అయ్యేవరకు స్వర్ణ రోజులంటారని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో అందచేసే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం సెక్టారులోని అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు, తల్లులు, కిశోరబాలికలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే లోగో టోపీల విడుదల



ఎమ్మెల్యే లోగో టోపీలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలిటౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే లోగోతో కూడిన టోపీలను ఎమ్మెల్యే కృష్ణారెడ్డి కార్యకర్తలకు అందజేశారు. ఎమ్మెల్యే అభిమాని షేక్ అలహర్ తయారు చేయించిన ఈ టోపీలను మంగళవారం ముసునూరులోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే విడుదల చేశారు. ఇంటింటికి ఎమ్మెల్యే.. సమస్య మీది.. పరిష్కారం నాది కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పట్టణంలోని పలు వార్డుల్లో ఇంటింటికి తిరిగి సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. ఎమ్మెల్యేతోపాటు తిరిగే కార్యకర్తలు వేసవి తాకిడికి తట్టుకునేందుకు టోపీలను బహూకరించామని అలహర్ తెలిపారు. ఎమ్మెల్యే అలహర్‌ను అభినందించారు.

పంట కాలువల మరమ్మతులు చేసుకోవాలి

- సోమశిల ప్రాజెక్టు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్



నీటిపారుదల శాఖ ఏఈతో కలసి సాగునీటి డైరెక్టర్లు, రైతులతో మాట్లాడుతున్న బీద గిరిధర్

అల్లూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : అల్లూరు చెరువు, రామన్న చెరువు ఆయకట్టుల పరిధిలోని రైతులు తమ భూముల్లో రెండో పంట సాగు చేసుకోవడానికి తీలుగా పంట కాలువల మరమ్మతులు చేపట్టాలని సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ రైతులకు సూచించారు. అల్లూరులోని ఇరిగేషన్ బంగ్లా వద్ద ఏఈ సుధీర్‌తో కలసి మంగళవారం ఆయన సాగునీటి సంఘాల డైరెక్టర్లు, రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండోకారు సాగుకు కాలువలు పూడిపోయి సాగునీరు పుష్కలంగా పారే పరిస్థితి లేదన్నారు. కాలువల మరమ్మతులు చేసుకుం టే నీటిని పొదుపుగా వినియోగించుకో వచ్చన్నారు. మరమ్మతులు చేపట్టిన రైతులు ఆయి కాలువల డైరెక్టర్ల ద్వా రా తెలియజేస్తే ఆ ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు సిద్ధమన్నారు. చివరి ఆయకట్టు భూములకు సాగునీరందాలంటే కాలువలు శుభ్రంగా ఉండాలన్నారు. ఈనెల 17న ఐఏబీ సమావేశం ఉన్నందున సాగునీరు విడుదల చేసేలోపు మరోదఫా ఇదేవిధంగా సమావేశం ఏర్పాటు చేసుకొని ఆయకట్టును నిర్ణయించుకుందామన్నారు. ఈ విషయంలో రైతుల సహకారం తప్పనిసరి అన్నారు. ఈ కార్యక్రమంలో పలగాటి శ్రీనివాసులు రెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, పరంధామిరెడ్డి, తోట శ్రీహరి, అంబటి రాజేంద్ర, మేడా కృష్ణారెడ్డి, ఎండేటి హరికృష్ణ, రేబాల శంకర్‌రెడ్డి, అల్లాభక్షు తదితరులు పాల్గొన్నారు.

వైద్య పథకాలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న డాక్టరు ఉమామహేశ్వరి

కందుకూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రతి ఒక్కరికీ వైద్యం అందుబాటులో ఉండాలన్న లక్ష్యంతో అమలు చేస్తున్న జాతీయస్థాయి వైద్య పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరి కోరారు. హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం, రీప్రొడక్టివ్ చైల్డ్‌హెల్త్ కార్యక్రమంపై పట్టణంలోని నక్షత్ర ఐటీ, జేఈఈ అకాడమీలో మంగళవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ జాతీయ వ్యాధినిరోధక టీకాల కార్యక్రమంపై అవగాహన కల్పించి సకాలంలో ప్రతి ఒక్కరికీ టీకాలు అందించాలన్నారు. కందుకూరు ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టరు రజని మాట్లాడుతూ ఈనెల 17, 21, 22 తేదీలలో డివిజన్‌లోని లింగసముద్రం, వలేటివారిపాలెం, మాచవరం, కొండాపురం, వరికుంటపాడు, కందుకూరు అర్బన్ పీహెచ్‌సీల పరిధిలోని వైద్యాధికారులు, వైద్యసిబ్బందికి ఈ శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టరు రమేష్, సీహెచ్‌వో శ్రీనివాసులు, హనుమంతరావు, కరేడు, చాకిచర్ల, గుడ్లూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులు, ఫార్మాసిస్టులు, స్టాఫ్ నర్సులు, మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, ఆరోగ్య కార్యకర్తలు, నోడల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మంటలు ఆర్పే విధానంపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

కావలి రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ జి.ప్రభాకర్ పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాలల్లో భాగంగా కావలి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్‌లలో మంగళవారం అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గ్యాస్ సిలిండర్‌కు మంటలు అంటుకుంటే చేపట్టాల్సిన విధానంపై డెమో చూపించారు. అనంతరం కరతపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలోనే చెత్త బుట్టలు!

వలేటివారిపాలెం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): తడి పొడి చెత్త సేకరణకు వినియోగించాల్సిన చెత్త బుట్టలు మండల కేంద్రమైన వలేటివారిపాలెం గ్రామ సచివాలయంలో వృథాగా మూలన పడి ఉన్నాయి. గ్రామంలోని ఒక్కో కుటుంబానికి తడి, పొడి చెత్త బుట్టలను పంపిణీ చేయాలని ప్రభుత్వం వీటిని సరఫరా చేసింది. పంపిణీ చేసిన తడిపొడి చెత్త బుట్టలో వేర్వేరుగా చెత్తను వేస్తే పారిశుధ్య కార్మికులు ఇళ్లకు వెళ్లి ఆ చెత్తను తీసుకెళ్లి చెత్తసంపద కేంద్రానికి తరలించి ఆ కేంద్రంలో సేంద్రియ ఎరువులు తయారీ చేసి రైతులకు తక్కువ ధరలకే విక్రయించాలి. ఈ సేంద్రియ ఎరువుల నుంచి వచ్చే ఆదాయంతో పంచాయతీలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి. అందులో భాగంగానే ప్రభుత్వం వేర్వేరుగా తడి పొడి చెత్త సేకరణకు బుట్టలను సరఫరా చేసింది. అయితే పంచాయతీ సిబ్బంది ప్రభుత్వం సరఫరా చేసిన ఈ బుట్టలను కుటుంబాలకు పంపిణీ చేయకుండా గ్రామ సచివాలయంలో వృథాగ పడేశారు. దీంతో ఆ చెత్త బుట్టలు నిరుపయోగంగా మారాయి. చెత్త బుట్టలు లేక చెత్తను వీధుల్లో వేస్తున్నారు. దీంతో పారిశుధ్యం క్షీణించి అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ సిబ్బంది స్పందించి గ్రామ సచివాలయంలో వృథాగా ఉన్న చెత్త బుట్టలను ఇళ్లకు పంపిణీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



వలేటివారిపాలెం గ్రామ సచివాలయంలో ఉన్న ప్లాస్టిక్ బుట్టలు

పారిశుధ్య కార్మికులను రెగ్యులర్ చేయాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

కావలిటౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరుతూ మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ అనుబంధ పారిశుధ్య కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ పట్టణ కార్యదర్శి వై కృష్ణమోహన్, గౌరవాధ్యక్షుడు పసుపులేటి పెంచలయ్యలు మాట్లాడుతూ ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేసి ప్రైవేట్ ఏజెన్సీలకు కార్మికులను అప్పజెప్పాలని చేస్తున్న ప్రయత్నాలు మానుకోవాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ వచ్చిన తర్వాతే కార్మికులకు ఉద్యోగ భద్రత లభించిందని, ప్రతినెలా జీతాలు వస్తున్నాయని, దానిని రద్దు చేస్తే కార్మికులకు ఇబ్బందులు తప్పవన్నారు. గతంలో కార్మికులు ప్రైవేట్‌లో ఉన్నప్పుడు జీతాలు సక్రమంగా వచ్చేవి కాదని, వేధింపులకు గురయ్యేవారని, పనిభారం ఎక్కువగా ఉండేదన్నారు. కార్మికులను రెగ్యులర్ చేయాలని, రిటైర్‌మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, రిటైర్ అయిన కార్మికుల కుటుంబంలో ఒకరికి పని కల్పించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మధుసూదన్‌రావు, యూనియన్ నాయకులు తురకా శీనయ్య, బీ రమేష్, బాలయ్య, ఒంగోల్ రమేష్, కావలి బాబు, జలదంకి శీనయ్య, చిన్నమ్మ, రాజ్యలక్ష్మి, అనిత తదితరులు పాల్గొన్నారు.

మా గ్రామం అభివృద్ధికి నోచుకోలేదు!

అల్లూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో మా గ్రామం అభివృద్ధికి నోచుకోలేదని, తమ గ్రామానికి తాగునీటి సమస్య, భూసమస్య వెంటాడుతున్నాయని మండలంలోని పడమర గోగులపల్లి చింతచెట్టు కాలనీ వాసులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. మంగళవారం రాత్రి ఆ గ్రామంలో సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ ఆ గ్రామస్థులతో మమేకమై సమస్యలను తెలుసుకున్నారు. భూ సమస్యలు అత్యధికంగా ఉన్నాయని జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గాలను చూస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు ఆట తిరుమల, నాయకులు బండి శ్రీనివాసులురెడ్డి, మేడా కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేతిపంపునకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పాఠశాలలో చేతిపంపునకు అదనపు పైపు బిగిస్తున్న సిబ్బంది

లింగసముద్రం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిలిచెర్ల గ్రామం ఆదిఆంధ్ర కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో తక్కువ ఎత్తులో ఉన్న చేతి పంపు మరమ్మతులకు అధికారులు చర్యలు తీసుకున్నారు. 'చేతిపంపు వద్ద నీటి కోసం అవస్థ' శీర్షికతో ఈ నెల 10న ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తకు ఎంపీడీవో కె శ్రీనివాసులు స్పందించి పంచాయతీ కార్యదర్శి వెంకటరావు, బోరు మెకానిక్ శ్రీనివాసులు ద్వారా చేతిపంపుకు అదనపు పైపు వేసి చేతిపంపు హెడ్‌ను ఎక్కువ ఎత్తులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. దీంతో విద్యార్థులు, కుకింగ్ ఏజెన్సీ వారు చేతిపంపు నుంచి నీరు శులభంగా పట్టుకొన్నారు.

నెల్లూరులో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి

- హైవేపై సోలార్ దీపాలు అమర్చాలి
- రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో జేసీ కార్తీక్



రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు త్వరగా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో మంగళవారం రోడ్డు భద్రత కమిటీ సమావేశం జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న కార్యక్రమాలను ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ గంగాధర్ వివరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకోవా లన్నారు. నగరంలో ట్రాఫిక్ రద్దీ పెరిగిపోతున్న దృష్ట్యా ఏసీ కూరగాయల మార్కెట్ సెంటర్, జిల్లా పోలీసు కార్యాలయం సెంటర్, కేవీఆర్ జంక్షన్, కనకమహల్ సెంటర్, రామలింగాపురం, వీఆర్సీ తదితర ప్రధాన కూడళ్లలో సిగ్నల్ వ్యవస్థను మే నెల మొదటి వారంలోగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గతంలో ఏర్పాటు చేసిన సిగ్నల్ వ్యవస్థలోని లోపాలు పునరావృతం కాకుండా పకడ్బందీగా సిగ్నల్ పాయింట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. రద్దీ ప్రాంతాల్లో రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలు, ఇతర ఆక్రమణలను తొలగించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బుజబుజ నెల్లూరు నుంచి కోవూరు వరకు జాతీయ రహదారిపై ప్రమాదాలు జరుగుతున్న 11 ప్రాంతాల్లో సోలార్ లైటింగ్ ఏర్పాటు చేయాలని ఎన్‌హెచ్ అధికారులకు సూచించారు. పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రహదారుల వద్ద స్పీడ్ బ్రేకర్లు, పెయింటింగ్, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, హైవేపై మద్యం దుకాణాలు లేకుండా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు, ఒంగోలు ఎన్‌హెచ్‌ఏ పీడీలు ఎంకే చౌదరి, ఎం విద్యాసాగర్, సర్వే ల్యాండ్ రికార్డుల ఏడీ నాగశేఖర్, డీఎస్పీ జీ శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ కే రామకృష్ణ, మున్సిపల్ ఎస్‌ఈలు రామ్మోహన్‌రావు, జానీ, రవాణాశాఖ అధికారి బాలమురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

పచ్చిరొట్ట పైర్లతో భూమి సారవంతం

- మొక్కకు తగిన మోతాదులో పోషకాలు
- ఖర్చు తక్కువ.. మంచి దిగుబడులు : డీఏవో సత్యవాణి

వరిలో నాణ్యమైన, అధిక దిగుబడులకు పచ్చిరొట్ట పైర్లు ఎంతో ఉపయోగపడతాయి. వరిసాగుకు ముందుగా పచ్చిరొట్టపైర్లతో పొలంలో దమ్ము చేస్తే పైరుకు అవసరమైన సేంద్రీయ పదార్థాలను అందిస్తుంది. అంతేగాక భూమికి నత్రజని, ఇతర పోషకాలను అందిస్తాయి. పచ్చిరొట్ట పైర్లు అయిన జీలుగ, జనుము, పిల్లిపెసర, అలసంద, పెసర, వెంపల్లి వంటి పైరును పెంచి పూతదశకు ముందుగా పొలంలో దమ్ము చేయాలి. తర్వాత వరినాట్లు వేసుకొన్నట్లయితే అనేక లాభాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి పి.సత్యవాణి తెలిపారు. తక్కువ ఖర్చుతో భూమికి ఎక్కువ పోషకాలు అందుతాయని 'ఆంధ్రజ్యోతి' ద్వారా ఆమె రైతులకు తెలియజేశారు.

- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)

వరిసాగుకు ముందు పచ్చిరొట్ట పైర్లతో దమ్ము చేయడం వల్ల భూమి భౌతి కస్థితిని మెరుగుపరుస్తుంది. భూమిలో పైర్లకు కావాల్సిన సేంద్రీయ పదార్థాలను అందిస్తుంది. భూమిలో నీటిని నిల్వ చేసే గుణాన్ని పెంచడంతో పాటు నత్రజని మోతాదును పెంచేందుకు ఈ లెగ్యుమినస్ జాతి పచ్చిరొట్ట పైరులు ఉపయోగపడతాయి. ఎకరానికి 20-50 కిలోల నత్రజనిని అందిస్తాయి. పంటలలో వ్యాధి నిరోధకశక్తిని పెంచుతాయి. సమస్యాత్మక భూముల (చౌడు) సాగుకు అనుకూలంగా మారుతాయి. పర్యావరణ కాలుష్యం లేకుండా దీర్ఘకాలిక ప్రయోజనాలను అందిస్తుంది. పంటల ఉత్పత్తులు, నాణ్యతను, రుచిని పెంచుతాయి.



పచ్చిరొట్ట పైరు



సత్యవాణి

జీలుగ ఎకరానికి 12కేజీల విత్తనం వాడితే 4.5 టన్నుల పచ్చిరొట్ట ఎరువుతో, 6.2 కేజీల నత్రజనిని, 1.5 కేజీల భాస్వరం, 5.1 కేజీల పొటాష్‌ను ఒకటన్ను పచ్చిరొట్ట ఎరువుకి చొప్పున భూమికి అందిస్తాయి.

జనుము ఎకరానికి 16 కేజీల విత్తనం వాడితే 4.6 టన్నుల పచ్చిరొట్ట ఎరువుతో టన్నుకు 7.5 కేజీల నత్రజని, 1.2 కేజీ భాస్వరం, 5.1 కేజీ పొటాష్‌ను అందిస్తుంది.

పిల్లిపెసర ఎకరానికి 8 కేజీల విత్తనం వాడితే 2.5 టన్నుల పచ్చిరొట్ట ఎరువుతో టన్నుకు 7.2 కేజీ నత్రజని, కేజీ భాస్వరం, 5.3 కేజీల పొటాష్ చొప్పున భూమికి అందిస్తుంది. కాబట్టి రైతులు ఈ పచ్చిరొట్ట పైర్లను పెంచి దమ్ము చేసి వరిలో నాణ్యమైన, అధిక దిగుబడులు పొందవచ్చు.

● 8283 క్వింటాళ్ల కేటాయింపు

ఎడగారు సీజన్‌కు సంబంధించి జిల్లాకు 8283 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాల కేటాయింపులు జరిగాయని జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి తెలిపారు. 3500 క్వింటాళ్ల జీలుగ, 2629 క్వింటాళ్ల జనుము, 2154 క్వింటాళ్ల పిల్లిపెసర అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. వీటిని 50 శాతం సబ్సిడీ ధరకు రైతులకు అందించడం జరుగుతుందన్నారు. ఒక్కో రైతుకు 5ఎకరాలకు సరిపడా విత్తనాలు అందిస్తామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవా లని సూచించారు.

గిరిజనులందరికీ 'ఆధార్'

- 18 వారాలపాటు ప్రత్యేక శిబిరాలు
- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మల్లికార్జునరెడ్డి

ముఖాముఖి

? జిల్లాలో గిరిజనులందరికీ ఆధార్ కార్డులు పంపిణీ చేయిస్తారా?

! జిల్లాలో ఆధార్‌కార్డు లేని గిరిజనులందరికీ ఆధార్ కార్డులు పంపిణీ చేయించడానికి అన్ని చర్యలు చేపట్టాం. జిల్లావ్యాప్తంగా 2.40లక్షల మంది గిరిజనులు ఉండగా, ఇప్పటివరకు 2.3 లక్షల మందికి ఆధార్‌కార్డులను ఇప్పించాం. ఇంకా 10వేల మందికి ఇప్పించాల్సి ఉంది. గిరిజనులకు సంబంధించి ముఖ్యంగా యానాదులు వలస వెళ్లి పనులు చేసుకోవడం వల్ల వారికి ఆధార్‌కార్డులు లేవు. అటువంటి వారందరికీ ఇప్పిస్తాం.

? ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తారా



! జిల్లాలోని 38 మండలాల్లో 18 వారాల పాటు ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నాం. ఆగస్టు 15వతేదీ వరకు ఈ శిబిరాలు ఉంటాయి. ఆయా మండలాల్లో నివసిస్తున్న గిరిజనుల వద్దకే సచివాలయ సిబ్బంది వెళ్లి ప్రత్యేకంగా రూపొందించిన ఫార్మట్‌లో వాళ్ల వివరాలు తీసుకుని, స్వీయ ధ్రువీకరణ పత్రం తీసుకుంటారు. ఆ వివరాలను వీఆర్‌వో ద్వారా తహసీల్దారు, ఎంపీడీవోలకు తెలియసి, ఆధార్‌కార్డు వచ్చేలా చూస్తాం.

? ఆధార్‌కు బర్త్ సర్టిఫికెట్ అవసరం కదా

! ఆధార్‌కు తప్పనిసరిగా పుట్టిన తేదీ సర్టిఫికెట్ అవసరం. గిరిజనులలో యానాదులకు అవి లేవు. ఈ అంశమై ఆధార్ అథారిటీతో మాట్లాడి డోమిసైల్ సర్టిఫికెట్లు ఇప్పించేలా చర్యలు చేపట్టాం. ఇందుకు సంబంధించి డాక్యుమెం టేషన్ ప్రక్రియను ఎంపీడీవోలు, తహసీల్దార్లకు ఇచ్చాం. సచివాలయ సిబ్బంది సేకరించిన వివరాల ద్వారా గిరిజనులకు ఆధార్‌కార్డు అందేలా చూస్తున్నాం.

? ఆరేళ్లలోపు గిరిజన పిల్లలకు పుట్టిన తేదీ సర్టిఫికెట్ ఎలా ఇప్పిస్తారు

! 0-6 సంవత్సరాల వయసు గల గిరిజన పిల్లలకు ఆధార్ ముఖ్యం. ఈ పిల్లలందరికీ అంగన్‌వాడీ వర్కర్ల ద్వారా వివరాలు సేకరించి ఆధార్‌కార్డు అందేలా చేస్తున్నాం. డోమిసైల్ సర్టిఫికెట్ వీరికి వర్తించదు. ఎందుకంటే వీరు అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతుం టారు. వీరికి పుట్టిన తేదీ సర్టిఫికెట్ ఉంటుంది. అందుకనే నేరుగా వారికి ఆధార్ కార్డు అందేలా చేస్తాం. అలా కాకుండా వలస వెళ్లి ఎక్కడెక్కడో స్థిర నివాసం ఏర్పర్చుకున్న వారిని మాత్రమే డోమిసైల్ సర్టిఫికెట్ వచ్చేలా చేస్తున్నాం.

- నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి)

తప్పుడు సర్టిఫికెట్ మంజూరు చేసిన వీఆర్‌వో సస్పెన్షన్

మర్రిపాడు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తప్పుడు పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు చేసినందుకు వీఆర్‌వో రమణయ్యను జిల్లా కలెక్టరు ఆనంద్ మంగళవారం సస్పెండ్ చేశారు. ప్రయివేట్ బ్యాంకుల్లో రుణాలు తీసుకునేందుకు గ్రామంలో కొంత మంది తమ ఇళ్లను ఉదయగిరి రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ చేయించుకున్నారు. ఈక్రమంలో ఇంటి పన్నుతో పాటు ఇంటి పొజిషన్ సర్టిఫికెట్ అవసరం కావటంతో గ్రామస్థులు విఆర్‌వోని ఆశ్రయించారు. తమ ఇళ్లు ఉండే సర్వే నెంబర్ రిజిస్టర్ కానందున గ్రామనత్తంలో ఉన్న సర్వే నెంబర్‌లో ఇళ్లు ఉన్నట్లు తప్పుడు సర్టిఫికెట్లు మంజూరు చేశారు. దీంతో గ్రామస్థులు కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా, విచారించి విఆర్‌వో రమణయ్యను సస్పెండ్ చేసినట్లు కలెక్టరు వెల్లడించారు.

సౌర విద్యుత్‌పై అవగాహన పెంచుకోవాలి

- విద్యుత్ శాఖ ఎస్‌ఈ విజయన్

నెల్లూరు (జడ్పీ), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : సౌర విద్యుత్ వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీరు (ఎస్‌ఈ) విజయన్ పిలుపునిచ్చారు. నెల్లూరు నగరంలో సోలార్ విద్యుత్ వినియోగాన్ని మంగళవారం ఆయన స్వయంగా పరిశీలించారు. వినియోగదారుల ఇళ్లకు వెళ్లి సోలార్ విద్యుత్ వినియోగం వల్ల ఎటువంటి లబ్ధి చేకూరిందో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్, అసిస్టెంట్ ఇంజనీర్ దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సోలార్ విద్యుత్ వ్యవస్థను పరిశీలిస్తున్న ఎస్‌ఈ విజయన్

డైట్ అధ్యాపక పోస్టులకు నేటి నుంచి ఆన్‌లైన్ పరీక్ష

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : పల్లిపాడు డైట్ కళాశాలలో అధ్యాపక ఖాళీలను డిప్యుటేషన్ పద్ధతిలో భర్తీ చేసేందుకు బుధ, గురువారాల్లో ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీఈవో బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పరీక్ష నెల్లూరులోని దర్గామిట్ట జడ్పీ బాలికోన్నత పాఠశాలలో జరుగుతుందని తెలిపారు. బుధవారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ఆల్ లాంగ్వేజెస్, ఫిజికల్ ఎడ్యుకేషన్, మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్, ఈవీఎస్, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు మ్యాథ్స్ పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. 17వతేదీ ఉదయం 9 నుంచి 11 గంటల వరకు సైకాలజీ, మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు ఫిలాసఫీ, సోషయాలజీ పరీక్షలుంటాయని తెలిపారు. అర్హులైన ఎస్‌ఏ, హెచ్ఎం, ఎంఈవోల నుంచి ఇప్పటికే దరఖాస్తులు స్వీకరించి పరీక్ష వివరాలు తెలియ చేశామన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

న్యాయవాదుల సహకారం మరువలేనిది

- జిల్లా ప్రధాన న్యాయాధికారి యామిని



బార్ అసోసియేషన్ హాలులో మాట్లాడుతున్న న్యాయాధికారి యామిని

నెల్లూరు (లీగల్), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : తన పదవీకాలంలో న్యాయవాదులు అందించిన సహకారం మరువలేనిదని జిల్లా ప్రధాన న్యాయాధికారి సీ యామిని అన్నారు. ఇటీవల బదిలీ అయిన ఆమె, ఫ్యామిలీ కోర్టు స్పెషల్ జడ్జి కే వెం కట నాగ పవన్ మంగళవారం నెల్లూరు న్యాయవాదుల బార్ అసోసియేషన్‌ను సం దర్శించారు. ఉద్దండులైన న్యాయవాదుల ను, న్యాయాధికారులను నెల్లూరు బార్ అసోసియేషన్ అందించిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్య దర్శులు ఉమామహేశ్వర్ రెడ్డి, సుంద రయ్య యాదవ్, పలువురు న్యాయవా దులు, న్యాయాధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల సామగ్రి.. ఎవరో వీధిలో పడేశారు!

- విచారించి చర్యలు తీసుకుంటాం : ఆర్డీవో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆత్మకూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా ఎన్ని కల సామగ్రిని వీధిలో పడేశారని ఆత్మకూరు ఆర్డీవో బి.పావని అన్నారు. ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన కథనంపై ఆమె స్పందించారు. 2019 ఎన్నికలకు వినియోగించిన సామగ్రిని కార్యాలయంలో భద్రపరిచినట్లు చెప్పారు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా ఆ సామగ్రిని తీసుకెళ్లి వీధుల్లో పడేశారని తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశామని, పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి నిందితులను గుర్తించి వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కిసాన్ డ్రోన్ గ్రూపు సభ్యులకు నేడు అవగాహన, శిక్షణ

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కిసాన్ డ్రోన్ గ్రూపు సభ్యులకు బుధవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో డ్రోన్లపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి పీ సత్యవాణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బ్యాంకు అధికారులు, డ్రోన్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని అవగాహన కల్పించి, అనుమానాలు నివృత్తి చేస్తారని తెలిపారు.

- పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం పుట్టగొడుగుల పెంపకంపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ జీ శివన్నారాయణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 9490004254 నెంబరును సంప్రదించాలని కోరారు.

కానిస్టేబుల్ భార్య ఆత్మహత్య

భర్త వేధింపులే కారణమంటున్న కుటుంబ సభ్యులు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాల నేపథ్యంలో నెల్లూరులోని పత్తేఖాన్‌పేటలో ఉన్న పోలీస్ క్వార్టర్స్‌లో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల సమాచారం మేరకు.. ఒంగోలు ప్రాం తానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ బీ నాగరాజుకు గతంలో వివాహం జరిగి ఇద్దరు పిల్లలున్నారు. భార్య మృతి చెందడంతో, ఈ విషయమై నాగరాజుపై ఒంగోలులో కేసు నడుస్తోంది. జిల్లాల విభజనలో భాగంగా నాగరాజు ఒంగోలు నుంచి నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు. తొమ్మిది నెలల క్రితం పొదిలి ప్రాంతానికి చెందిన పూర్ణిమను రెండో వివాహం చేసుకున్నారు. రెండు నెలల క్రితమే వారు పత్తేఖాన్‌పేటలోని పోలీసు క్వార్టర్స్‌లో కాపురం పెట్టారు. భార్యాభర్తల మధ్య గొడవల నేపథ్యంలో మంగళవారం ఉదయం పూర్ణిమ ఇంట్లోని బెడ్‌రూమ్‌లో ఫ్యానుకి చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు గమనించి పత్తేఖాన్‌పేట వీఆర్‌వో మహేష్‌కు సమాచారం అందించారు. ఆయన సమాచారంతో చిన్నబజారు పోలీసులు అక్కడికి చేరుకొని తలుపులు పగులగొట్టి పూర్ణిమ మృతదేహాన్ని కిందకు దించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. పూర్ణిమ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భర్త వేధింపులు తట్టుకోలేకే ఆమె ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

● అదీ.. కాకాణి నైజం : సోమిరెడ్డి

నెల్లూరు (వైద్యం) : తప్పులు చేయడం, పోలీసులకు చిక్కకుండా పోవటం కాకాణి గోవర్ధన్‌రెడ్డి నైజమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం నెల్లూరులో కోర్టు వాయిదాకు హాజరైన సోమిరెడ్డి మీడియాతో మాట్లాడారు. బెల్జియం, అమెరికా వంటి దేశాల్లో ఉన్న వారు సైతం పోలీసులకు చిక్కుతున్నా కాకాణి మాత్రం చిక్కటం లేదన్నారు. కాకాణి వంటి వ్యక్తి వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా ఉండటం ఆ పార్టీ చేసుకున్న పాపమని దుయ్యబట్టారు. తోడేరు రెడ్డికి సంబంధం లేకుండా వరదాపురంలో రూ.వేలకోట్ల విలువైన క్వార్ట్జ్ అక్రమ మైనింగ్ జరిగిందంటారా!? అంటూ ప్రశ్నించారు. కరోనా విపత్తుల సమయంలో ఆనందయ్య ఆయుర్వేద మందును వెబ్‌సైట్ ద్వారా అమ్మకానికి పెట్టిన నర్మదారెడ్డి తనపై అక్రమ కేసుకు సంబంధించి కోర్టుకు హాజరైనట్లు తెలిపారు.

తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్‌గా హుస్సేన్‌సాహెబ్

- మెప్మా పీడీగా లీలారాణి

నెల్లూరు (హరనాధపురం), (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్‌గా హుస్సేన్‌సాహెబ్ నియమితులయ్యారు. డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్న సాహెబ్‌కు పదోన్నతి లభించింది. అలాగే మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్‌గా అన్నమయ్య జిల్లా రాజంపేట ఎస్ఎస్‌సీలో పనిచేస్తున్న బి.లీలారాణిని నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కుల దూషణతో వివాహిత బలవన్మరణం

నెల్లూరురూరల్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : కులాంతర వివాహం చేసుకున్న ఓ యువతి మెట్టినింట్లో కుల వేధింపులు తాళలేక బలవన్మరణానికి పాల్పడింది. నెల్లూరు రూరల్ సీఐ గుంజి వేణు అందించిన వివరాల మేరకు.. ముదివర్తిపాళెం గ్రామానికి చెందిన స్మైలీ (22) ఇందుకూరుపేటకు చెందిన నాగూరుబాబు ప్రేమించుకుని ఏడు నెలల క్రితం వివాహం చేసుకున్నారు. నెల్లూరులోని నవలాకుతోట వద్దనున్న మూడవ మైల్లో కాపురం ఉంటున్నారు. స్మైలీ అరుంధతీ వర్గానికి చెందిన యువతి కావడంతో ఇంట్లో నిత్యం కులం పేరుతో దూషిస్తుండటంతో వేధింపులు తాళలేక ఇంట్లోనే ఫ్యానుకు ఉరేసుకుని మృతి చెందింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. కాగా, పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించిన స్మైలీ మృతదేహాన్ని రూరల్ తహసీల్దారు లాజరస్ పరిశీలించి పంచనామా వివరాలు నమోదు చేశారు.

క్రీడా శిబిరాల నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : వేసవి క్రీడాశిక్షణ శిబిరాల నిర్వహణకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాభి వృద్ధి అధికారి ఆర్‌కే యతిరాజ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శాప్ ఆదేశాల మేరకు డీఎస్‌ఏ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది మే నెల(వేసవి సెలవులు)లో గ్రామీణ, పట్ట ణ ప్రాంతాల్లో వివిధ క్రీడాంశాల్లో శిక్షణ శిబిరాలను కోచ్‌లు, పీఈటీ, పీడీలు, అంతర్జా తీయ, జాతీయ స్థాయి సీనియర్ క్రీడాకా రుల సహకారంతో నిర్వహిస్తామని తెలిపా రు. ఈ ఏడాది కూడా మే 1 నుంచి 31వతేదీ వరకు నిర్వహించే ఈ శిబిరాలకు అర్హత, ఆసక్తి కలిగిన ఆరు ఈనెల 17వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలోని డీఎస్‌ఏ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

21 నుంచి బీఎడ్ పరీక్షలు

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : బీఎడ్ 2022-24, 2023-25 బ్యాచ్‌ల అభ్యర్థులకు ఈనెల 21 నుంచి 26వతేదీ వరకు తొలి సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయని డీఈవో బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పరీక్షలు ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. అలాగే 2024-26 బ్యాచ్ అభ్యర్థులకు అదే తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. అభ్యర్థుల హాల్‌టికెట్లు ప్రభుత్వ పరీక్షల అధికారిక వెబ్‌సైట్ www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. వాటిని డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలకు హాజరు కావాలని సూచించారు.

రూ.కోట్లలో అవినీతి .. రూ.లక్షల్లో రికవరీ

ఉపాధి ఆడిట్ తీరుపై అనుమానాలెన్నో



ప్రజావేదిక నిర్వహిస్తున్న డ్వామా పీడీ గంగాభవాని

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), (ఆంధ్రజ్యోతి): మండలంలోని 24 పంచాయతీల్లో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించి మంగళవారం స్థానిక కార్యాలయ ప్రాంగణంలో సామాజిక తనిఖీ బహిరంగ ప్రజావేదిక నిర్వహించారు. రూ.10.97 కోట్ల నిధులతో చేప ట్టిన పనులకుగాను ఇటీవల సోషల్ ఆడిట్ బృందాలు పంచాయతీల్లో సమగ్ర విచారణ చేపట్టి రూ.1,26,94,311 అవినీతి చోటుచేసుకున్నట్లు గుర్తించారు. కాగా ప్రజావేదికలో విచారణ చేపట్టిన డ్వామా పీడీ గంగా భవానీ కేవలం రూ.11,18,776 మాత్రమే రికవరీ విధించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ప్రధానంగా నల్లబోతులవారిపల్లిలో మృతు లకు మస్టర్లు వేసి నిధులు స్వాహా చేయడం, వరికుంటపాడులో మస్టర్లలో సంతకాలు,పని ప్రదేశాల్లో సమాచార బోర్డులు, జీ.కొండారెడ్డిపల్లిలో ఉద్యానశాఖ కింద నాటిన మొక్కలు, గోకులం షెడ్ ఆనవాళ్లు లేకపోవడం గుర్తించారు. అలాగే అధికశాతం పంచాయతీల్లో కొలతల్లో తేడా, బినామీ మస్టర్లు, అధిక నగదు చెల్లింపు తదితర అంశాలను డీఆర్పీలు బహిర్గతం చేశారు.

రికవరీలకు ఆదేశం

జీ.కొండారెడ్డిపల్లి పంచాయతీకి రూ.వెయ్యి, గణేశ్వరాపురం రూ.2,50,164, గువ్వాడి రూ.49,231, ఇస్కపల్లి రూ.20,978, జడదేవి రూ.1,07,043, కాంచెరువు రూ.3,000, టీ.కొండారెడ్డిపల్లి రూ.4,013, నార్త్ కృష్ణంరాజుపల్లి రూ.7,000, మహమ్మదాపురం రూ.25,939, ఎస్‌బీపల్లి రూ.2,17,989, నార్త్ కొండాయపాళెం రూ.3,500, పాములపల్లి రూ.5,461, పెద్దిరెడ్డిపల్లి రూ.1,68,766, రామాపురం రూ.7,712, తిమ్మారెడ్డిపల్లి రూ.1,386లు, టీసీపల్లి రూ.1,35,540, తూర్పుబోయమడగల రూ.32,270, తూర్పుచెన్నంపల్లి రూ.10,500, తూర్పురొంపిదొడ్ల రూ.4,500, వరికుంటపాడు రూ.44,840, వేంపాడు రూ.3,000, విరువూరు రూ.1,049, యర్రంరెడ్డిపల్లి రూ.13,633ల చొప్పున రికవరీ విధించడం జరిగింది. అలాగే అవినీతికి పాల్పడడంతో ఈసీ హజరత్, టీఏలు మూర్తి, శ్రీనివాసులను తాత్కాలికంగా సస్పెండ్ చేయడం జరిగింది.

క్రీడా శిబిరాల నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : వేసవి క్రీడాశిక్షణ శిబిరాల నిర్వహణకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాభి వృద్ధి అధికారి ఆర్‌కే యతిరాజ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శాప్ ఆదేశాల మేరకు డీఎస్‌ఏ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది మే నెల(వేసవి సెలవులు)లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వివిధ క్రీడాంశాల్లో శిక్షణ శిబిరాలను కోచ్‌లు, పీఈటీ, పీడీలు, అంతర్జాతీయ, జాతీయ స్థాయి సీనియర్ క్రీడాకారుల సహకారంతో నిర్వహిస్తామని తెలిపారు. ఈ ఏడాది కూడా మే 1 నుంచి 31వతేదీ వరకు నిర్వహించే ఈ శిబిరాలకు అర్హత, ఆసక్తి కలిగిన ఆరు ఈనెల 17వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలోని డీఎస్‌ఏ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

డిగ్రీ పరీక్షలకు 572 మంది గైర్హాజరు

వెంకటాచలం, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో మంగళవారం జరిగిన డిగ్రీ రెండవ సెమిస్టర్ పరీక్షలకు 572 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలలో 9433 మంది విద్యార్థులకు గాను 8861 మంది హాజరయ్యారు.